అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 28-11-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 329 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

కాల్పుల విరమణ
ఇజ్రాయిల్, హిజ్బుల్లా ఒప్పందం
14 నెలల పోరుకు స్వస్తి 13లో..




NDTV నేరపూరిత కుట్ర లేదు
అధికార దుర్వినియోగమూ జరగలేదు
అవన్నీ సాధారణ వ్యాపార లావాదేవీలే
బ్యాంకింగ్ చట్టం ఉల్లంఘన కాలేదు :
ప్రణయ్‌రాయ్, 5లో..
రాధికారాయ్‌ల మీద
ఆరోపణలపై సీబీఐ నివేదిక

నిగ్గు తేల్చాల్సిందే..

అదానీ ముడుపులపై దద్దరిల్లిన పార్లమెంట్.. పట్టుబట్టిన ప్రతిపక్షాలు

వాయిదాల పర్వంలో ఉభయ సభలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై నిగ్గు తేల్చాల్సిందేనంటూ ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో ఒక్కసారిగా పార్లమెంట్ దద్దరిల్లింది. ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభ వాయిదాల పర్వం కొనసాగింది. చివరికి ఈ రెండు సభలూ గురువారానికి వాయిదా పడ్డాయి. అదానీ లంచావతారం, సంభాల్ హింసపై చర్చించాలని, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని ప్రతిపక్షాలు కోరాయి. అందుకు ప్రభుత్వం సమ్మతించకపోవడంతో పార్లమెంట్ అట్టుడికింది. ఈ అంశాలపై చర్చించాలని పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్ష పార్టీలు వాయిదా తీర్మానం ఇచ్చాయి. లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో చైర్మెన్ జగదీప్ ధన్కర్ తిరస్కరించారు. ముందుగా బుధవారం ప్రారంభమైన లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం **12** గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. నిమిషాల వ్యవధిలోనే గురువారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లంచం వ్యవహారంపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుపట్టాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలో ప్రతిపక్ష పార్టీల నేతలు నినాదాలు చేశారు. దీంతో సభను **11.30** గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను చైర్మెన్ ధన్కర్ గురువారానికి వాయిదా వేశారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి
సంభాల్ హింసపై ఎస్పీ ఎంపీలు



ఉత్తరప్రదేశ్ సంభాల్ పట్టణంలో హింసకు దారితీసిన సంఘటనలపై ఏదైనా విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిర్వహించాలి. "సంభాల్‌లో జరిగిన సంఘటనపై చర్చ జరగాలని మేము కోరుకుంటున్నాం. దీనికి సంబంధించి మన ఎంపీలు స్పీకర్‌కి నోటీసులు ఇచ్చారు. పోలీసుల అమానవీయ ప్రవర్తన, ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలన చర్యల గురించి మేం సభా వేదికపై మాట్లాడాలనుకుంటున్నాం".

- ఎస్పీ ఎంపీ డింపుల్ యాదవ్

అదానీ జైల్లో ఉండాలి
కేంద్రమే రక్షిస్తున్నది : రాహుల్ గాంధీ



వేల కోట్ల రూపాయల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ జైల్లో ఉండాలి. చిన్న చిన్న ఆరోపణలపై వందలాది మందిని అరెస్టు చేశారు. అలాంటప్పుడు వేల కోట్ల రూపాయల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీని ఎందుకు అరెస్టు చేయటం లేదు."అదానీ ఆరోపణలను అంగీకరిస్తారని మీరు అనుకుంటున్నారా? ఆయన ఆరోపణలను తిరస్కరించబోతున్నాడని మీరు అనుకుంటున్నారు. అసలు విషయం ఏమిటంటే, ఆయనను ఇప్పటికే అరెస్టు చేయవలసి ఉంది. ఆ పెద్దమనిషి (గౌతమ్ అదానీ)పై అమెరికాలో వేల కోట్ల అభియోగాలు మోపారు. ఆయన జైలులో ఉండాలి. ఆయనని కేంద్రం రక్షించడం దారుణం".





ప్రాణాలు పోతేనే
స్పందిస్తారా?

అధికారులు నిద్రపోతున్నారా? :
మధ్యాహ్న భోజనం వికటించడంపై హైకోర్టు ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందించే మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్న ఘటనలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకే పాఠశాలలో వారం రోజుల్లో మూడుసార్లు మధ్యాహ్న భోజనం వికటించడంపై విస్మయాన్ని వ్యక్తం ...5లో

రూపాయి డీలా
డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు పతనమై రూ.84.44కి



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోయింది. బుధవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు పతనమై 84.44 స్థాయికి దిగజారింది. అమెరికాకు ట్రంప్ అధ్యక్షునిగి ఎన్నికైన తర్వాత డాలర్ బలపడటానికి తోడు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు ...13లో



వామ్మో..దొంగ నోట్లు
రూ. 500 ఫేక్ కరెన్సీ మూడు రెట్లు : కేంద్రం
నల్లధనాన్ని వెలికితీస్తామన్న మోడీ మాటలు ఉత్తవే

న్యూఢిల్లీ : భారత్‌లో పెద్ద నోట్లను రద్దు చేయడం ద్వారా దొంగ నోట్లను కట్టడి చేయడంతో పాటుగా దేశ, విదేశాల్లోని నల్లధనాన్ని వెలికితీస్తామని బీరాలు పలికిన ప్రధానీ నరేంద్ర మోడీ ఆచరణలో విఫలం అయ్యారు. నల్లధనం బయటికి ...13లో

గ్రూపులొద్దు..కలిసి పనిచేయండి
రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధాని స్ట్రాంగ్ వార్నింగ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీకి చెందిన రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పార్టీలో గ్రూప్ రాజకీయాలు, ఒకరిపై ఒకరు తెరవెనక కుట్రలకు స్వస్తి చెప్పాలని హెచ్చరించారు. గ్రూపులుగా వీడి... రాష్ట్ర, జిల్లా, మండల కార్యకర్తలను ఆగం చేయొద్దని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి వాటిని పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అందరూ వ్యక్తిగత ఎజెండాలు విడిచి... పార్టీ స్టాండ్ లో ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. హైకమాండ్ ఇచ్చే సూచనలు సంయుక్తంగా అమలు చేసి వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు పార్లమెంట్‌లోని ...13లో


ఇథనాల్
పరిశ్రమకు బ్రేక్
పనుల నిలిపివేతకు కలెక్టర్ ఆదేశం

దిలావర్‌పూర్ నుంచి ఫ్యాక్టరీని తరలించాలని ప్రభుత్వానికి నివేదిక
రిలే దీక్షలు విరమించిన రైతులు
గ్రామాల్లో సంబురాలు
పొలాల కోసం ఏడాది పాటు పోరు సల్పిన రైతాంగం

వివరాలు 5లో

నేటి నుంచి రైతుల పండుగ
మూడు రోజులు విజయోత్సవాలు

మహబూబ్‌నగర్‌లో నిర్వహణ
ఏడాదిలో రైతుల సంక్షేమానికి
సర్కారు చేసిన ఖర్చు
రూ.55 వేల కోట్లు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా ప్రజాప్రభుత్వం గురువారం నుంచి మూడు రోజుల పాటు రైతు పండుగను నిర్వహిస్తున్నది. అన్ని జిల్లాల రైతులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేందుకు వ్యవసాయ, దాని అనుబంధశాఖలతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆదర్శ రైతులు కూడా ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలో రైతు సంక్షేమం కోసం రూ.55,336 కోట్లను ఖర్చు చేసినట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేశారు. 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ కోసం ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించినట్టు ప్రభుత్వం పేర్కొంది. రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.5 వేల చొప్పున మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్ల నిధులను 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. నష్ట పరిహారం అందేలా పంటల బీమా ప్రీమియం రూ. 1,300 కోట్లు చెల్లించారు. ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.5 లక్షలు బీమా పరిహారం చెల్లించేలా రైతు బీమా పథకం ప్రీమియం రూ. 1,455 కోట్లు చెల్లించారు. ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించామని ప్రభుత్వం తెలిపింది. దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10,547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించారు. రైతు నేస్తం పథకం ద్వారా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, సలహాలు సూచనలు అందచేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో క్షేత్రస్థాయి పోస్టుల్ని భర్తీ చేశారు. ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.2 వేలు అదనపు ఆదాయం లభించేలా అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రైతు రుణమాఫీకి రూ.17,869 కోట్లు, రైతు భరోసాకు రూ.7,625 కోట్లు, రైతు బీమాకు రూ.1,455 కోట్లు, పంటల బీమాకు రూ. 1,300 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ.10,444 కోట్లు, 2023-24 ధాన్యం కొనుగోళ్ళ కోసం రూ.10,547 కోట్లు, ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ. 5,040 కోట్లు వ్యయం చేశారు. ఈ మొత్తం రూ. 54,280 కోట్లుగా ఉన్నట్టు ప్రకటించారు.

3లో.. **శిండే సరెండర్**
'మహా' సీఎంను తేల్చేది ప్రధానే
నా నిర్ణయాన్ని ఆయనకే వదిలేశా
ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
అజిత్ పవార్ స్టాండ్‌పైనే ఉత్కంఠ

3లో.. **చిన్నారులకు నో సోషల్ మీడియా**
ఆస్ట్రేలియా దిగువ సభలో బిల్లు ఆమోదం

పెన్షనర్ల నుంచి సీవీపీ మినహాయింపులు నిలిపేయాలి

- టీపీఏఆర్‌పీఏ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల దగ్గర నుంచి వసూలు చేస్తున్న కమ్యూటేషన్ వాల్యూ ఆఫ్ పెన్షన్ (సీవీపీ) మినహాయింపులను నిలిపేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్లు అండ్ రిటైర్డ్ పర్సన్ల సంఘం (టీపీఏఆర్‌పీఏ) డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీఏఆర్‌పీఏ అధ్యక్షులు పి నారాయణరెడ్డి మాట్లాడుతూ వసూలు చేస్తున్న సీవీపీ మినహాయింపులు 11 ఏండ్ల మూడు నెలల తర్వాత నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చిందని గుర్తు చేశారు. మొదట కోర్టుకు వచ్చిన వారికే ఈ ఉత్తర్వులను వర్తింపజేయడంతో వేలాది మంది పెన్షనర్లు న్యాయస్థానానికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం కోర్టుకు వచ్చినా, రాకపోయినా అందరినుంచి మినహాయింపులు చేయొద్దంటూ మరో మధ్యంతర ఉత్తర్వు ఇచ్చిందని చెప్పారు. ఏపీలో ప్రభుత్వం అందరి నుంచి మినహాయింపుల వసూళ్లను రద్దు చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులిచ్చిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అందరి నుంచి సీవీపీ మినహాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఈపీఎస్, సింగరేణి పెన్షనర్లకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు, సింగరేణి పెన్షనర్లకు రూ.15 వేలు చెల్లించాలని సూచించారు. పెన్షనర్ల ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదేననీ, అందరికీ నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు ఆర్టీసీ బస్సులు, రైలు ప్రయాణాల్లో గతంలో ఇచ్చినట్టుగా రాయితీ కల్పించాలంటూ తీర్మానాన్ని ఆమోదించామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఏఆర్‌పీఏ ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, నాయులు కె నాగేశ్వరరావు, ఎం నరహరి, ఎం రంగయ్య, ఎల్ అరుణ, సి కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి

- మంత్రి శ్రీధర్‌బాబుకు టీఆర్టీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో నూతన పెన్షన్ విధానం అమలు నాటికి ముందే ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయబడి, నూతన పెన్షన్ అమలైన తర్వాత నియామకం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబును బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర సర్వీసులకు సంబంధించిన ఐఏఎస్ అధికారులకు వారి నోటిఫికేషన్ ప్రకారంగా నూతన పెన్షన్ నుంచి పాత పెన్షన్ విధానంలోకి మార్చారని తెలిపారు. ఉత్తరాఖండ్, పంజాబ్, కర్ణాటక, జార్ఖండ్, హర్యానా, ఢిల్లీ, గోవా, గుజరాత్ ఉద్యోగ నోటిఫికేషన్ల ప్రకారం ఆయా ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేసి వివిధ సర్క్యులర్లను జారీ చేశాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చినందున 10 శాతం ఉద్యోగులు, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ వాటాను తిరిగి పొందొచ్చని సూచించారు. 317 జీవో బాధితుల బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్ 5 తర్వాత ఈహెచ్‌ఎస్‌పై ఉద్యోగ సంఘాలతో చర్చిస్తాం

- టీజీవో నేతలతో మంత్రి రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)పై వచ్చేనెల ఐదో తేదీ తర్వాత రాష్ట్రంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో చర్చిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి రాజనర్సింహను టీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈహెచ్ఎస్ అమలు, ఉద్యోగుల సహకారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. దానిపై విధివిధానాలను చర్చించాలని సూచించారు. నిర్ణీత మొత్తం, క్యాడర్ వారీగా మొత్తం, స్కేల్ వారీగా ప్రీమియం చెల్లింపులపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవో ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణగౌడ్, నాయకులు శ్రీరామ్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈ అభ్యర్థులకు నేడు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు రెండో విడతలో గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గైర్హాజరైన అభ్యర్థుల కోసం శుక్రవారం కూడా ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు.. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జతల జిరాక్స్ ప్రతులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అందుకు సంబంధించిన వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురాలేకపోతే ఆ తర్వాత ఈ అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. 837 ఏఈ పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ 12న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

తెలంగాణాతో ద్వైపాక్షిక సంబంధాలకు బల్గేరియా ఆసక్తి

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణాతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉందని ఐటీ, పరిశ్రమలమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బల్గేరియా రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ బుధవారం సచివాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి కామన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌లో తమ రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వారికి మంత్రి వివరించారు. త్వరలో ఇరు దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపాలని చేసిన ప్రతిపాదనకు డా.నికోలాయ్ యాంకోవ్ సంసిద్ధత వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో బల్గేరియా గౌరవ కాన్సులేట్ డా.కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మందుల సామేల్ పరిశ్రమల శాఖ కమిషనర్ డా.మల్సూర్, టీజీఐఐసీ సీఈవో.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషం... విభజన రాజకీయం

మైనారిటీలపై విషం చిమ్ముతున్న బీజేపీ నేతలు

ఎన్నికల ప్రసంగాల్లో అసత్యాలు, ఆరోపణలు

సమాజంలో దెబ్బతింటున్న సోదరభావం

దేశమంతా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని రాష్ట్రపతి, ప్రధాని మొదలు భారతావని యావత్తూ గుర్తు చేసుకొని గర్వంతో పులకించిపోయింది. రాజ్యాంగం దృష్టిలో ప్రజలంతా సమానులే. కానీ నేడు దేశంలో జరుగుతున్నదేమిటి? మతోన్మాదం జడలు విప్పి మైనారిటీలను అభద్రతాభావంలోకి నెట్టేస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రే ఎన్నికల ప్రచారాలలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ విభజన రాజకీయాలకు తెర తీస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని మత ప్రాతిపదికన విభజించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై మానవ హక్కుల కార్యకర్త రామ్ పునియని 'న్యూస్‌క్లిక్' పోర్టల్‌కు అందించిన విశ్లేషణాత్మక కథనం...

న్యూఢిల్లీ : మైనారిటీలను కించపరచడానికి, వారిని ద్రోహులుగా చిత్రీకరించడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ, వాటి అనుబంధ సంస్థలు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నాయి. ఈ సంస్థల నేతలు తమ ప్రసంగాలలో మైనారిటీలపై విషం చిమ్ముతుంటారు. విద్వేష ప్రసంగాలు చేసే వారిని చట్ట ప్రకారం శిక్షించవచ్చు. అయితే వారిలో చాలా మంది ఆ శిక్షల నుండి తప్పించుకుంటూనే ఉన్నారు. గత దశాబ్ద కాలంగా దేశంలో మతతత్వ పార్టీ అధికారంలో ఉండడంతో మైనారిటీలను ద్వేషించే సంస్కృతి ప్రబలిపోయింది. ముఖ్యంగా వాట్సప్ గ్రూపులలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది. వీటి కారణంగా సమాజంలో సోదరభావం దెబ్బతింటోంది. చివరికి శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్న ముస్లింలను కించపరుస్తూ 'అవి పిల్లలను కనే ఫ్యాక్టరీలు' అని తూలనాడే వరకూ వెళ్లారు.

'ధరించే దుస్తులను బట్టి వారిని గుర్తించవచ్చు. వాళ్లు మన పవిత్ర గోమాతను వధించే హంతకులు. మన బాలికలు, మహిళలను లవ్ జిహాద్ పేరుతో ఆకర్షిస్తున్నారు'....ఇవన్నీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న వ్యాఖ్యలే. ఈ జిహాద్ సిరీస్‌లో తాజాగా ల్యాండ్ జిహాద్, ఓట్ జిహాద్ అనే పదాలు కూడా కలిశాయి.

ఎన్నికల ప్రచారంలో...

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీ డజన్ల కొద్దీ విద్వేష ప్రసంగాలు చేశారు. ఆ ఎన్నికల్లో మోడీ 110 ద్వేషపూరిత ప్రసంగాలు చేశారని హ్యూమన్ రైట్స్ వాచ్ అనే సంస్థ తెలిపింది. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి మోడీ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా మెజారిటీ హిందూ సమాజంలో భయాందోళనలు రేకెత్తించారని ఆ సంస్థ తన నివేదికలో చెప్పింది. ఇక్కడ మరో ఉదాహరణను చూద్దాం. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మోడీ ప్రస్తావిస్తూ అవి కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు హామీలు అని ఎద్దేవా చేశారు. 'భారత్‌ను ఇస్లామీకరణ చేసేందుకు, దేశాన్ని విభజన దిశగా నడిపేందుకు జరుగుతున్న నీచ ప్రయత్నాలలో ఇది ఓ భాగం. యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆ సమయంలో కూడా కొన్ని ప్రయత్నాలు చేసింది. దీనిపై బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించింది. అది జస్టిస్ వర్మ కమిటీ నివేదిక కానీండి...లేదా సచార్ కమిటీ నివేదిక కానీండి. అవన్నీ ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల రిజర్వేషన్లను లూటీ చేసేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే' అని మోడీ చెప్పుకొచ్చారు.



ఆ మాటే ఎత్తరట

బీజేపీ, మోడీ మాత్రం తాము ముస్లింలకు వ్యతిరేకం కాదని నమ్మించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎన్నికల్లో మీరు ముస్లిం వ్యతిరేక ప్రచారం చేశారు కదా అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మోడీ బదులిస్తూ 'రాజకీయాల్లో హిందూ-ముస్లిం గురించి మాట్లాడే మొదటి రోజు నుండే నేను ప్రజా జీవితానికి అనర్హుడిని అవుతాను. హిందూ-ముస్లిం అనే మాటే ఎత్తను. అది నా సంకల్పం' అని చెప్పారు. మాటలకు, చేతలకు మధ్య ఎంత వ్యత్యాసం ఉంటుందో ఇక్కడ కన్పిస్తోంది. ఏదేమైనా విద్వేషం ఒకవైపు వెలివేతకు దారితీస్తుంటే మరోవైపు ముస్లిం సమాజాన్ని రెండో తరగతి పౌరసత్వం వైపు నెడుతోంది.

విడిపోతే వధిస్తారు

ఈసారి బీజేపీకి చెందిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుండి ఓ నినాదం వెలువడింది. అదేమిటంటే 'మనం విడిపోతే మనల్ని వధిస్తారు'. హిందువుల ఐక్యతను దృష్టిలో పెట్టుకొని ఆయన ఈ వ్యాఖ్య చేశారు. యోగి వ్యాఖ్యను బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ సమర్థించింది. ఆ సంస్థకు చెందిన దత్తాత్రేయ హొసాబలే మాట్లాడుతూ 'ముఖ్యమైన విషయమేమిటంటే హిందువులు సంఘటితంగా ఉంటే అది అందరికీ ప్రయోజనకరం. హిందువుల ఐక్యత అనేది సంఘ్ జీవితకాల ప్రతిజ్ఞ' అని స్పష్టం చేశారు. ఆదిత్యనాథ్ ప్రకటనను ప్రధాని మోడీ కొంచెం సవరిస్తూ 'హిందువులు ఐక్యంగా ఉంటే సురక్షితంగా ఉంటారు' అని అన్నారు. మైనారిటీల కారణంగా హిందువులు ప్రమాదంలో ఉన్నందున వారిని సురక్షితంగా ఉంచాలంటే హిందూ ఐక్యతే పునాది అని చాటిచెప్పడమే బీజేపీ నేతల ఉద్దేశమని అర్థమవుతోంది.

ముస్లింలపై వ్యతిరేకత నూరిపోస్తూ...

బీజేపీకే చెందిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ల్యాండ్ జిహాద్, ఓట్ జిహాద్ పైన దృష్టి సారించడంతో సరిపెట్టుకోకుండా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో అర్బన్ నక్సల్స్, అల్ట్రా లెఫ్ట్ భాగస్వాములయ్యాయని నిందించారు. ఈ దుష్ప్రచార ప్రభావం హిందూ సమీకరణ విషయంలో కాకుండా దాని ద్వారా ఓటింగ్ సరళిలో కూడా కన్పిస్తోంది. ఇప్పుడు హిందూ కుటుంబాలలో వేలాది వాట్సప్ గ్రూపులు విషాన్ని తలకెక్కిస్తున్నాయి. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) అనే సంస్థ ఈ ఏడాది మార్చి 28 నుండి ఏప్రిల్ వరకూ ఓ అధ్యయనాన్ని నిర్వహించింది. హిందువులు ముస్లింలను ఎలా చూస్తున్నారో తెలుసుకునేందుకు అందులో ప్రయత్నించింది. ముస్లింల విష యంలో హిందువుల్లో నెలకొన్న దురభిప్రాయం ఆ అధ్య యనంలో తేట తెల్లమైంది. మన సమాజంలో కూడా ఇదే అభిప్రాయం నెలకొన్నదనడంలో ఎలాంటి సందేహం లేదు.

జార్ఖండ్‌లోనూ...

ఇటీవల జరిగిన జార్ఖండ్, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఈ మతోన్మాద ధోరణి మరోసారి బయటపడింది. జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బీజేపీ నేత, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రాష్ట్రంలోని ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రీకరించారు. ఎన్నికల సమయంలో ముస్లింలను కించపరిచేలా బీజేపీ ఓ అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చింది.

ఓ పెద్ద ముస్లిం కుటుంబం హిందువుల ఇంటిపై దాడి చేసి, దానిని ఆక్రమించినట్లు అందులో చూపారు. వాస్తవానికి జార్ఖండ్‌కు అంతర్జాతీయ సరిహద్దు ఏదీ లేదు. అలాంటప్పుడు హిందువుల ఇంటిని ఆక్రమించుకున్న ఆ ముస్లింలు ఎవరు? ఈ ఎన్నికల ప్రకటనపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఎలక్షన్ కమిషన్ దానిపై ఆంక్షలు విధించింది. కానీ దాని లక్ష్యం అప్పటికే నెరవేరింది. ఆ ప్రకటనకు సంబంధించిన వీడియో అనేక ప్రాంతాలలో అందుబాటులోకి వచ్చింది.

జార్ఖండ్‌లో మరో విద్వేష ప్రచారానికి కూడా తెర లేపారు. ముస్లింలు ఆదివాసీలను వివాహం చేసుకుంటారని, వారి భూములు స్వాధీనం చేసుకుంటారని తప్పుడు ప్రచారం చేశారు. అయితే ఈ వాదనకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు, గణాంకాలు చూపలేకపోయారు. అది కేవలం విభజన రాజకీయాలకు మాత్రమే ఉద్దేశించిన ప్రచారం. 'మీ రోటీని, బేటీని, మట్టిని ముస్లిం చొరబాటుదారులు లాగేసుకుంటారు' అనే నినాదాన్ని ప్రచారంలో పెట్టారు. ఈ ప్రకటన వచ్చింది వేరెవరి నుండో కాదు. సాక్షాత్తూ ఈ దేశ ప్రధాని మోడీ నుండే.

అదానీ ప్రాజెక్టుకు రుణ సాయంపై పునఃపరిశీలన : అమెరికా సంస్థ

వాషింగ్టన్ : అదానీ గ్రూప్ సహకారంతో చేపట్టిన శ్రీలంక ఓడరేవు ప్రాజెక్టుకు 553 మిలియన్ డాలర్ల రుణాన్ని అందించే విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఓ అమెరికా సంస్థ పునఃసమీక్షిస్తోంది. అవినీతి, మోసం ఆరోపణలపై అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, మరో ఏడుగురిపై అమెరికా న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలైన నేపథ్యంలో అమెరికా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అనే సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. శ్రీలంక రాజధాని కొలంబోలో పోర్ట్



టెర్మినల్ ప్రాజెక్టుకు 553 మిలియన్ డాలర్ల రుణాన్ని అందజేసేందుకు గత నవంబరులో ఈ సంస్థ అంగీకరించింది. ఈ ప్రాజెక్టులో అదానీ గ్రూప్ సహ భాగస్వామిగా ఉంటోంది. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని ఆ సంస్థ అధికారి ఒకరు తెలిపారు. తమ ప్రాజెక్టులు, భాగస్వాములు ఉన్నత ప్రమాణాలు పాటించేలా చూస్తామని ఆయన చెప్పారు. కాగా రుణ ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టుకు అమెరికా సంస్థ ఇప్పటి వరకూ ఒక్క డాలరు కూడా అందజేయలేదు.

ప్రతీకార చర్యలు తప్పవు

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో మెక్సికో అధ్యక్షురాలి లేఖ

మెక్సికో సిటీ : మాదకద్రవ్యాల రవాణాను, శరణార్థులను కట్టడి చేయకపోతే అమెరికా నుండి వచ్చే ఉత్పత్తులపై 25శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో తాము కూడా ప్రతీకార చర్యలు తీసుకుంటామని మెక్సికో ప్రకటించింది. ఈ మేరకు మెక్సికో అధ్యక్షుడు క్లాడియా షబ్నమ్ ఒక ప్రకటన జారీ చేశారు. ఇలాంటి పెనాల్టీలు విధించడం వల్ల అమెరికాకు వెళ్ళే శరణార్థులు లేదా మాదకద్రవ్యాల రవాణా ఆగదని అన్నారు. పైగా ఇరు దేశాల్లో ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి కారణమవుతాయని తెలిపారు. దానికి బదులుగా ఈ సవాళ్లను ఎదుర్కొనడంలో పరస్పరం సహకరించుకోవాలని ఆమె పిలుపిచ్చారు. విధించిన ప్రతి పన్నుకు ప్రతిగా తాము కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు స్తంభించేవరకు ఇది కొనసాగుతుందన్నారు. ఈ మేరకు ఆమె ట్రంప్‌నకు మంగళవారం ఒక లేఖ రాశారు. చట్టవిరుద్ధమైన ఇమ్మిగ్రేషన్, ఫెంటానిల్ మాదకద్రవ్యాల సంక్షోభం నేపథ్యంలో ట్రంప్ సోమవారం మాట్లాడుతూ కెనడా, మెక్సికో, చైనా ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అమెరికా నుండి భారీగా ఆయుధాలు అక్రమ రవాణా అవుతున్నాయని వాటివల్ల మెక్సికో తీవ్రంగా ఇబ్బందులు పడుతోందని షబ్నమ్ చెప్పారు. అయినా ఇలా టారిఫ్‌లు విధించడం వల్ల కలిగే ప్రయోజనాలేంటని ఆమె ప్రశ్నించారు.

శిండే సరెండర్

'మహా' సీఎంను తేల్చేది ప్రధానే
నా నిర్ణయాన్ని ఆయనకే వదిలేశా

- ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
- అజిత్ పవార్ స్టాండ్‌పైనే ఉత్కంఠ



ముంబయి : మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరనేదానికి ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం బీజేపీ, శివసేన, ఎన్సీపీల మధ్య ముక్కోణపు పోటీ నెలకొన్నది. ఈ నేపథ్యంలో సీఎం ఎంపిక విషయంలో శివసేన(చీలికవర్గం) అధినేత, ఆ రాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే బీజేపీ హైకమాండ్‌కు సరెండర్ అయ్యారు. "మహారాష్ట్ర తదుపరి సీఎంను తేల్చే విషయంలో నా నిర్ణయాన్ని ప్రధాని మోడీ, బీజేపీ అధినాయకత్వానికి వదిలేశాను. నేను అడ్డంకి కాబోనని ప్రధానికి చెప్పాను. ఆయనేది నిర్ణయిస్తే దాని ప్రకారమే వెళ్తాం" అని థానేలో నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శిండే ఈ వ్యాఖ్యలు చేశారు. "నేను ప్రధానితో మాట్లాడాను. మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు విషయంలో పూర్తి మద్దతిస్తానని ఆయనకు నేను హామీనిచ్చాను. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో బీజేపీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా.. శివసేన మద్దతిస్తుంది. మీరు (ప్రధాని) మా కుటుంబ పెద్ద. బీజేపీ వారు మీ నిర్ణయాన్ని ఆమోదించినట్టే మేము కూడా కట్టుబడి ఉంటాం. నా వల్ల ప్రభుత్వ ఏర్పాటులో ఎలాంటి సమస్యా ఉండదని నిన్న(మంగళవారం) మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి చెప్పాను" అని ఏక్‌నాథ్ శిండే తెలిపారు. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వ విషయంలో బీజేపీ హైకమాండ్ నిర్ణయాన్ని ఒప్పుకుంటానంటూ శిండే సంకేతాలివ్వటాన్ని బట్టి చూస్తే తదుపరి సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్‌కు మార్గం దాదాపు సుగమమైనట్టేనని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి.

మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరనేదానిపై ప్రతిష్టంభనను తొలగించటానికి బీజేపీ అధినాయకత్వం సిద్ధమైంది. మహాయుతి నాయకులు ఢిల్లీకి రావాలని పిలుపు వచ్చింది. వారితో అధినాయకత్వం సమావేశమై ప్రస్తుత అనిశ్చితిపై చర్చించనున్నది. దీంతో ఏక్‌నాథ్ శిండే, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌లు ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం. అమిత్ షాతో సమావేశం అనంతరం సీఎం పదవి, ప్రభుత్వ ఏర్పాటుపై ఒక స్పష్టత వచ్చే అవకాశమున్నదని తెలుస్తున్నది. కాగా, బీజేపీ హైకమాండ్‌ను కలవటానికి దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే ఢిల్లీ వెళ్లారు. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీలో 230 సీట్లతో భారీ విజయాన్ని నమోదు చేసిన మహాయుతి కూటమి.. కొత్త సీఎం ఎంపిక విషయంలో తర్జనభర్జనలు పడుతుండటం గమనార్హం. కొత్త సీఎంను నిర్ణయించే విషయంలో కూటమిలోని మూడు పార్టీలు కూర్చొని, నిర్ణయం తీసుకుంటాయనీ, కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని దేవేంద్ర ఫడ్నవీస్ ఇప్పటికే చెప్పారు. ఇక శివసేనలోని సంజయ్ షిర్సాత్ వంటి నాయకులు మాత్రం ముఖ్యమంత్రి పదవి శిండేకే ఇవ్వాలని తెలపటం గమనార్హం. "ఏక్‌నాథ్ షిండే ఉప ముఖ్యమంత్రి పదవిని ఎప్పటికీ ఒప్పుకోరు. ఏక్‌నాథ్ శిండే పేరు మీదే ఎన్నికల్లో పోటీ చేశాం. సీఎం పదవిని మళ్లీ చేపట్టటానికి ఆయన అర్హుడు" అని సంజయ్ షిర్సాత్ ఇప్పటికే వ్యాఖ్యానించారు. తదుపరి సీఎంగా ఫడ్నవీస్‌కు ఇటు ఆరెస్సెస్, అటు కూటమిలో భాగస్వామి అయిన ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ల మద్దతు ఉన్నదని ప్రచారం జరుగుతోంది. అయితే అజిత్ పవార్ బాబాయ్ శరద్‌పవార్‌పైనే తిరుగుబావుటా ఎగురవేశారు. మరీ సీఎం ఛైర్ గేమ్‌లో ఆయన ఏవిధంగా రెస్పాండ్ అవుతారో వెయిట్ అండ్ సీ..



గుండె పోటుతో సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి మృతి

పొంగులేటి, తమ్మినేని, కూనంనేనితోపాటు పలువురు నివాళి

డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి, తుమ్మల సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్(64) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఖమ్మంలో బుధవారం ఉదయం వాకింగ్ చేస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. స్థానికంగా ఉన్న అతని స్నేహితులు ప్రాథమిక చికిత్స అందిద్దామనుకునే లోపే ఆయన మరణించారు. ప్రసాద్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మరణవార్తతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు సీపీఐ కార్యాలయానికి చేరుకున్నారు. కాగా, ప్రజల సందర్శనార్థం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు.

ప్రసాద్ మృతదేహంపై సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పార్టీ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం ప్రసాద్ మరణంతో నిజమైన కమ్యూనిస్టును కోల్పోయిందన్నారు. పోటు ప్రసాద్ మృతిపట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అమెరికాలో ఉన్న నారాయణ పోటు ప్రసాద్ కుమారుడు స్వాతిక్‌తో మాట్లాడి మనోధైర్యం కల్పించారు.

పలువురు నివాళి

రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పి. సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు ఆవులూరి మధు, గుర్రం అచ్చయ్య ఆవుల అశోక్, రామయ్య ఆవుల వెంకటేశ్వర్లు, టీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మాజీ ఎంఎస్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ మౌలాన, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.కె. సాబీర్ పాషా, గన్నా చంద్రశేఖర్, దండి సురేష్, విద్యాసంస్థల యాజమాన్యాలు, గ్రానైట్ అసోసియేషన్స్ ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.గోర్కీ, డాక్టర్ వై.ప్రసాద్, డాక్టర్ భారవి, డాక్టర్ యలమంచలి రవీంద్రనాథ్, న్యాయవాదులు, ప్రజా సంఘాల బాధ్యులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పలువురి సంతాపం

పోట ప్రసాద్ మృతిపట్ల ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ సంతాపాన్ని ప్రకటించారు. ఎంపీలు రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, రామసహాయం రఘురామరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నవతెలంగాణ రీజియల్ మేనేజర్ ఎస్డీ జావిద్, సిబ్బంది సిహెచ్. నారాయణ, ఇ.వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు, వీ6 బ్యూరో ఇన్‌చార్జి సయ్యద్ ఖదీర్ తదితరులు సంతాపం తెలిపారు.

చిన్నారులకు నో సోషల్ మీడియా

ఆస్ట్రేలియా దిగువ సభలో బిల్లు ఆమోదం

సిడ్నీ : 16 ఏండ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించిన విషయంలో ఆస్ట్రేలియా ఒక అడుగు ముందుకేసింది. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లు ఆలస్యం విషయంలో గూగుల్, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలు ప్రయత్నాలు చేసినా.. దిగువ సభ మాత్రం ఆమోదించటం గమనార్హం. ఈ బిల్లుకు ఆస్ట్రేలియా పార్లమెంటులోని ప్రతినిధుల సభలో 102 మంది సభ్యులు మద్దతివ్వగా, 13 మంది వ్యతిరేకించారు. ఈ బిల్లుకు మేజర్ పార్టీలు మద్దతు పలికాయి. ఈ బిల్లు ప్రకారం.. 16 ఏండ్ల లోపు వయసున్న చిన్నారులు సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉండటాన్ని నిరోధించే విషయంలో విఫలమైతే.. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలు 50 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్ల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు అమలు



తర్వాత పెనాల్టీలను ఎదుర్కొనే ముందు.. వయో పరిమితులను అమలు చేయటానికి సోషల్ మీడియా కంపెనీలకు ఒక సంవత్సరం సమయం ఉంటుంది. పిల్లలకు సోషల్ మీడియా నిషేధంపై ఆస్ట్రేలియాలో మిశ్రమ స్పందన లభిస్తున్నది. బ్యాన్ మంచిదేననీ కొందరు అంటుండగా.. నిషేధం చిన్నారులను ఒంటరి చేస్తుందనీ, డార్క్ వెబ్‌కు వారు ఆకర్షితులవుతారని కొందరు విమర్శకులు అంటున్నారు.

రోహింగ్యాలపై నేరాలకు పాల్పడిన

మయన్మార్ సైనిక నేతపై చర్యలు ?

అరెస్టు వారంట్ల జారీ యోచనలో ఐసీసీ

నెపిడా : ముస్లిం మైనారిటీలైన రోహింగ్యాలను హింస, వేధింపులకు గురి చేయడం ద్వారా మయన్మార్ మిలటరీ నేత మిన్ ఆంగ్ హ్లేయింగ్ మానవాళికి వ్యతిరేకంగా పాల్పడిన నేరాలకు అరెస్టు వారంట్లు జారీ చేయాలని భావిస్తున్నట్లు అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం (ఐసీసీ) ప్రాసిక్యూటర్ బుధవారం తెలిపారు. మయన్మార్, బంగ్లాదేశ్‌ల్లో రోహింగ్యాలను వేధిస్తూ, వారిని దేశం నుంచి తరిమివేసినందుకు నేరపూరితమైన బాధ్యత వహించడానికి తగిన కారణాలు వున్నాయా లేదా అన్న అంశంపై ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన కమిటీ నిర్ణయించనుంది. అయితే వారు నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి అంటూ లేదు. కానీ అరెస్టు వారంటు జారీ చేయాలంటే కనీసం మూడు నెలలు పడుతుందని అంచనా. కాగా దీనిపై మయన్మార్ పాలక జుంటా ప్రతినిధి వ్యాఖ్యానించడానికి తిరస్కరించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, మాజీ రక్షణ చీఫ్ యోవ్ గాలంట్‌లకు అరెస్టు వారంట్లు జారీ అయిన నేపథ్యంలో మయన్మార్ నేతపై కూడా ఈ తరహా చర్యలు చేపట్టాలని అమెరికా సహా పలు దేశాలు ఐసీసీపై ఒత్తిడి తెస్తున్నాయి. దాంతో ఈ విషయంపై ఆలోచన చేస్తున్నట్లు ఐసీసీ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. 7,30,000వేల మందికి పైగా రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌కు పారిపోయారని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. కాగా ఊచకోత ఆరోపణలను మయన్మార్ తిరస్కరిస్తోంది. పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని, తీవ్రవాదులపైనే తమ చర్యలని చెబుతోంది.

వాట్సాప్, జీమెయిల్ వద్దు

- అధికారిక డాక్యుమెంట్లను వాటి ద్వారా పంపొద్దు
- థర్డ్-పార్టీ ప్లాట్‌ఫామ్‌లకు జమ్మూకాశ్మీర్ నో
- సమగ్రత, భద్రత కారణాలుగా చూపుతూ నిషేధం
- ప్రభుత్వాధికారులకు ఆదేశాలు

మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం



జమ్మూకాశ్మీర్ : అధికారిక డాక్యుమెంట్లను పంపించే విషయంలో థర్డ్-పార్టీ ప్లాట్‌ఫామ్‌లైన వాట్సాప్, జీమెయిల్‌లను ఉపయోగించటాన్ని జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం నిషేధం విధించింది. సమగ్రత, భద్రతను కారణాలుగా పేర్కొన్నది. థర్డ్-పార్టీ ప్లాట్‌ఫామ్‌ల ఉపయోగం ద్వారా ఉండే ముప్పును ఎత్తి చూపింది. ఈ మేరకు సున్నితమైన, అధికారిక సమాచార మార్పిడి విషయంలో ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం.. గోప్యత, పరిమిత సమాచార మార్పిడి, ప్రసారం కోసం ప్రభుత్వాధి. కారులు ఇక ప్రభుత్వ ఈమెయిల్ సర్వీసులను, దాని తక్షణ సురక్షిత సందేశ ప్లాట్‌ఫామ్‌లను కచ్చితంగా ఉపయోగించాలే ఆదేశాలు జారీ అయ్యాయి. సున్నిత, రహస్య, గోప్యమైన సమాచార ప్రసార విషయంలో థర్డ్-పార్టీ టూల్స్ అయిన వాట్సాప్, జీమెయిల్, ఇలాంటి ఇతర ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తున్న ట్రెండ్ అధికారుల్లో పెరిగిపోతున్నదన్న విషయం యంత్రాంగం దృష్టికి వచ్చిందని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ సెక్రెటరీ సంజీవ్ వర్మ అన్నారు. థర్డ్-పార్టీ టూల్స్‌ను ఉపయోగించటం ద్వారా అది అనధికారిక యాక్సెస్, సమాచార ఉల్లంఘన, రహస్యమైన సమాచార లీక్‌కు దారి తీయగలదని తెలిపారు. వాట్సప్, జీమెయిల్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో కఠినమైన భద్రతా ప్రోటోకాల్‌లు లేవని ఆయన నొక్కి చెప్పారు. అలాంటి టూల్స్‌ను ఉపయోగించటం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాల సమగ్రత దెబ్బతింటుందనీ, తీవ్రమైన భద్రతా ఉల్లంఘనలకు దారి తీస్తుందని తెలిపారు. వీటికి బదులుగా ప్రభుత్వ మెసెజింగ్ ప్లాట్‌ఫామ్‌లైన ఎన్ఐసీ ఈమెయిల్, సంవాద్, సందేశ్‌లను ఉపయోగించాలని ప్రభుత్వాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

నవతెలంగాణ

దురాచారాలు తొలగినపుడే సంఘం అభివృద్ధి చెందుతుంది - రాజరాంమోహనరాయ్

గురువారం 28 నవంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

మూలాల్లోకి వెళ్లాలి...



పుండెక్కడుందో.. మందక్కడే వేయాలంటారు పెద్దలు. అప్పుడే అది తగ్గుతుంది. ఈపని చేయకపోవటం వల్లే రాష్ట్రంలో ఇప్పుడు ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతమవుతున్నాయి. ఫలి తంగా విద్యార్థులు బలైపోతున్నారు. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు మధ్యాహ్న భోజనం వికటించింది. మొత్తం ఎనభై మంది పిల్లలు ఆస్పత్రి పాలయ్యారు. ఇలాంటి ఘటనలే రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల చోటు చేసుకోవటం ఆందోళనాకరం.

మాగనూరు పాఠశాలకు సంబంధించి మొదటి ఘటన అశ్రద్ధ, నిర్లక్ష్యం వల్లే సంభవించిందని చెప్పక తప్పదు. పౌర సరఫరాలశాఖ సరఫరా చేసిన బియ్యాన్ని బాగు చేయకుండా (గ్రేడింగ్) నేరుగా వండితే పురుగులు రాకుండా ఇంకేం వస్తాయంటూ ప్రశ్నిస్తున్నారు ఆహార నిపుణులు. అందువల్ల ఆ ఒక్క పాఠశాలే కాదు...తెలంగాణలోని మిగతా బడుల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది సైతం పిల్లలకు పెట్టే భోజనం విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఇదే సమయంలో అదే పాఠశాలలో సోమవారం నాటి ఘటనపై విచారణకు వెళ్లిన స్థానిక తహశీల్దార్, అక్కడి ఉపాధ్యాయులు కూడా వాస్తవాలను తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థులకు వడ్డించిన భోజనాన్నే తినటాన్ని మనం అభినందించాల్సిందే. ఇదే శ్రద్ధ, చొరవతో అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అటు ప్రభుత్వానిది, ఇటు ఉపాధ్యాయులది కూడా.

> రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంతే పర్యవేక్షిస్తోన్న నేపథ్యంలో ఆయన భుజాలపై ఇప్పుడు బృహత్తర బాధ్యత ఉంది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా... సీఎం నేరుగా రంగంలోకి దిగి, సమస్యలకు గల మూల కారణాలను వెతకాలి. వాటి మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. గురకులాలు, ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలందరూ పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు కాబట్టి, వారికి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని అందించటమేగాదు, అది నాణ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సర్కారుదే.

ఇక గురుకులాల విషయానికొస్తే... గత ప్రభుత్వ విధానపరమైన లోపాలు, నిర్ణయాలు... నేటి రేవంత్ సర్కారుకు శాపాలుగా మారాయి. బీఆర్ఎస్ సర్కారు హడావుడిగా, అనాలోచితంగా ప్రారంభించిన గురుకులాల్లో అత్యధికం అద్దెభవనాల్లో కొనసాగుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,022 గురుకులాలు ఉంటే... వాటిలో సగానికి పైగా అంటే 660 అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వీటిలో వంటశాలలు, బియ్యం, కూర గాయలు, ఇతర సామగ్రి భద్రపరుచుకు నేందుకు ప్రత్యేకంగా స్టోర్ రూమ్‌లంటూ ఏమీ లేవు. దీంతో అవన్నీ పాడైపోతున్నాయం టున్నారు అక్కడి సిబ్బంది. దీనికితోడు వంటల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కేర్ టేకర్లుగానీ, వార్డెన్లు గానీ లేకపోవటం విద్యార్థులకు శాపంగా మారింది. ఫలితంగా పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఇటు వంటలను, అటు బోధనను చూసు కోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో రెండింటిలో ఏఒక్క దానిమీద కూడా పూర్తి శ్రద్ధను పెట్టలేకపోతున్నా మని వాపోతున్నారు టీచర్లు. అంతిమంగా ఇది విద్యా ప్రమాణాల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోందని తేలింది.

ఇలాంటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంతే పర్యవేక్షిస్తోన్న నేపథ్యంలో ఆయన భుజాలపై ఇప్పుడు బృహత్తర బాధ్యత ఉంది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా... సీఎం నేరుగా రంగంలోకి దిగి, సమస్యలకు గల మూల కారణాలను వెతకాలి. వాటి మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. గురకులాలు, ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలందరూ పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు కాబట్టి, వారికి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని అందించటమేగాదు, అది నాణ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సర్కారుదే.

నేటి బాలలే రేపటి పౌరులు... వారు చదువులు, ఆటపాటల్లో రాణించాలంటే పౌష్టికాహారం అవసరం. అది లేకే వందలాది మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని సర్కారు గుర్తెరగాలి. ప్రభుత్వ బడులపై పకడ్బందీ పర్యవేక్షణ ఉండేలా చేయటం ద్వారా ఈ సమస్యల నుంచి విద్యార్థులను బయటపడేయొచ్చు. అందుకోసం విద్యా రంగానికి చాలినన్ని నిధులు కేటాయించాలి. సొంత భవనాలు నిర్మించాలి, సరిపడా సిబ్బందిని నియమించాలి. ఆ దిశగా సర్కారు ప్రయత్నాలు ప్రారంభించాలి. లేదంటే మాగనూరు లాంటి ఘటనలు మరిన్ని పునరావృతమయ్యే అవకాశం లేకపోలేదు.

ఆకలి కేకల ప్రపంచం

దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని చెప్పే పాలకులకు పేదల ఆకలికేకలు కనిపించవు. ఆర్తనాదాలు వినిపించవు. ఎవరికి వారు తమది పేద దేశం కాదని, ప్రపంచంలోనే ధనిక దేశాలతో పోటీపడుతున్నామని చెబుతున్నవారి డొల్లతనాన్ని తాజాగా ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక బయటపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 731 నుంచి 757 మిలియన్ల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ప్రతి 11 మందిలో ఒక్కరు ఆకలి వలయంలో చిక్కి ఐక్కపడుతున్నారని పేర్కొంది. ఐరాస ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన "స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ 2024 (ఎస్ఓఎఫ్ఐ-2024)" నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం చూస్తే ఆహార అభద్రత, పోషకాహార లోపాలు ప్రపంచ మానవాళిని వెంటాడుతున్నాయి. ఆసియా



ఖండంలోనే అత్యధిక పోషకాహార లోపంతో బాధపడుతున్న ప్రజలున్నారు. 2023లో దాదాపు 2.33 బిలియన్ల ప్రపంచ ప్రజలు సాధారణ లేదా తీవ్రమైన ఆహార అభద్రతలో బతుకులు ఈడుస్తున్నారు. తీవ్రమైన ఆహార అభద్రతలో 864 మిలియన్ల ప్రపంచ ప్రజలున్నారు. ప్రతి ఒక్కరికి రోజుకు సగటున దాదాపు 3.96 డాలర్లు ఆరోగ్యకర భోజన ఖర్చులవుతున్నాయి. దీంతో 55.6 శాతం భారతీయులు ఆరోగ్యకర భోజనాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఐదేండ్లలోపు పిల్లల్లో స్టంటింగ్, వేస్టింగ్ సమస్యలు తగ్గినా, ప్రపంచవ్యాప్తం స్థూలకాయ సమస్యలు పెరుగుతున్నాయి. 15నుంచి 40 ఏండ్ల లోపు మహిళల్లో రక్తహీనత పెరుగుతూ ప్రజారోగ్యం పెద్దసమస్యగా ముందుకొస్తున్నది.

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 194.6 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపాలతో జీవిస్తున్నారు. దీర్ఘ కాలం పాటు ఆహార అభద్రత సమస్యలతో సతమతమవుతూ 13 శాతం ప్రజలు తీవ్రమైన పోషకాహార లోప సమస్యలతో బాధపడుతున్నారు. "2023 ప్రపంచ ఆకలి సూచీ" జాబితాలో భారత్ 111వ స్థానానికి దిగజారడం మన దుస్థితులను వివరిస్తున్నది. దక్షిణాసియా దేశాల్లో ఇండియాలోనే అత్యధికంగా 18.7 శాతం వేస్టింగ్, అధికంగా 31.7 శాతం స్టంటింగ్ సమస్యలు పిల్లలకు ఎదురవుతున్నట్టు నివేదిక ద్వారా తెలిసింది. పోషకాహారలోపం కలిగిన తల్లుల వల్ల 27.4 శాతం శిశువులు తక్కువ బరువుతో పుడుతున్నారని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని వెల్లడైంది. భారతీయ మహిళల్లో 53 శాతం రక్తహీనత, 2.8 శాతం పిల్లల్లో/7.3 శాతం పెద్దల్లో స్థూలకాయం నమోదుకావడం ఆందోళనకరమైన అంశం. కోవిడ్-19 సమయంలో ఆదాయం పడిపోవడం, జీవనోపాధులు తగ్గడం, ఆహార సరఫరా శృంఖలం గాడి తప్పడంతో ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరిగిన మాట వాస్తవం. ఎస్ఓఎఫ్ఐ-2024 థీమ్‌గా "ఆకలి, ఆహార అభద్రత, పోషకాహారలోపాలను అంతం చేయడానికి ఆర్థిక పెట్టుబడులు కావాలి" అనబడే అంశాన్ని తీసుకుంది. ఈ లక్ష్యంతో వ్యవసాయ ఆధార పరిశ్రమల ఏర్పాటు లేదా బలోపేతం చేయడం, అసమానతల తొలగింపు, ఆహార భద్రతను గాడిలో పెట్టడం, పోషకాహార లభ్యతకు వనరుల కల్పన లాంటివి ఫలిస్తాయనే ఆశిస్తున్నది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి చేరడానికి కావలసిన ఆర్థిక వనరులను ఆయా ప్రభుత్వాలు ప్రాధాన్యతాక్రమంలో కేటాయించాలని, 2030 నాటికి ఆకలి కేకలు వినిపించరాదని ఐరాస కోరుకుంటున్నది.

- బీఎంఆర్, 9949700037

రైతు కోసం గళమెత్తిన సంస్కర్త పూలే




ఎస్. వినయ కుమార్
9989718311

పందొమ్మిదో శతాబ్దపు సంఘ సంస్కర్తల్లో రైతుల గురించి పోరాడిన ఏకైక సంస్కర్త జ్యోతిరావు పూలే. జ్యోతిరావు తండ్రి గోవింద్‌రావు పూల వ్యాపారి. ఆయనకు కొంత భూమి ఉండేది. ఆ భూమిలో పూలు పండించి పూణేలోని తన అంగట్లో అమ్మేవాడు. చిన్నతనంలో జ్యోతిరావు కూడా పొలంలో, అంగడిలో పనిచేశాడు. అలా రైతు నేపథ్యం నుంచి వచ్చిన పూలే ఆనాటి శూద్రులు, అతి శూద్రులు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక సమస్యలతో పాటు రైతు, కార్మిక సమస్యలపై కూడా పోరాడారు. ఖండే అనే నాయకుడితో కలిసి బొంబాయిలో కార్మిక సంఘం నెలకొల్పారు. సామాజిక ఆర్థిక పోరాటాలు రెండింటినీ ఆయన నిర్వహించారు. చాలావరకు సామాజిక దోపిడీ, ఆర్థిక దోపిడీ కలిసే ఉంటాయి. మనదేశంలో మరీనూ. ప్రతిఘటన లేని ఆర్థిక దోపిడీకి సామాజిక పెత్తనం ఒక అదనపు సాధనం. గనుక పూలే రెండు రంగాల్లోనూ పోరాడారు. పూణే ప్రజలచేత 'మహాత్మా'అన్న బిరుదు పొందిన పూలే 11 ఏప్రిల్ 1827 పూణేలో పుట్టారు. 28 నవంబర్ 1890న మరణించారు.

ఆనాటి రైతు సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి పూలే పలు చర్యలు సూచించారు. దాదాపు 150 ఏండ్ల క్రితం 1883లో సేత్కార్యాచ అసూడ్ (సేద్యగాని చర్నాకోల) పేరుతో మరాఠీలో రైతు సమస్యలపై ఒక పుస్తకం రాశారు. అందులో రైతు శ్రమ ఫలితాన్ని మతాచారాల పేర పురోహితులు, భూవివాదాల్లో రైతులను మోసగించి కులకర్ణీలు, బ్రాహ్మణ ఉద్యోగులు అలాగే ప్రభుత్వం వారిని ఎలా దోచుకొంటుందో వివరంగా చెప్పారు. ఆ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సూచనలు నేటికీ ప్రాసంగికమైనవే.

సనాతన ధర్మం ఎంతో గొప్పదని ఎవరు ఎంత భుజం చరిచినా అది శూద్రులను, అతిశూద్రులను ఎలాంటి హక్కుల్లేని దాసులుగా మార్చింది. దాచి పెట్టలేని నిజం వర్ణాశ్రమ ధర్మాన్ని, పురాణాలను, వేదాలను సవాలు చేసిన పూలే రైతుల కోసం కూడా గళం విప్పారు. పూలేకు ముందు ఆ తర్వాత వచ్చిన అనేక మంది సంస్కర్తలు ఆంగ్లేయ విద్యతో, యూరప్ ఉద్యమాలతో స్ఫూర్తి పొంది హిందూమతంలో సంస్కరణల కోసం కృషి చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పినట్టు ఆ సంస్కరణ సమాజంలోని అట్టడుగు తరగతులకు చేరలేదు. పూలే దానికి ఒక మినహాయింపు.

హిందూ మతంలో సముద్రయానంపై విధించిన నిషేధం కూడా దోపిడీలో భాగమేనని పూలే చెప్పారు. పశ్చిమ దేశాల విజ్ఞానాన్ని, అక్కడి మానవ హక్కులను మన దేశవాసులు గమనిస్తే తమ ఆధిపత్యానికి దోపిడీకి శిశ్రుషకు ప్రమాదం ఏర్పడుతుందని భావించిన ఆధిపత్య వర్గాలు భయపడ్డాయన్నారు. శూద్ర రైతుల దయనీయ స్థితికి మతపరమైన, సమాజపరమైన కారణాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటినైనా చర్చకు పెట్టాలన్న ముఖ్య ఉద్దేశంతో తాను ఆ గ్రంథం రాశానని చెప్పారు. మతం మానవ కల్పితమే కాదు, అది క్రూరమైందని కూడా ఆయన అన్నారు.



బ్రాహ్మణోమమ దైవతం (బ్రాహ్మణుడే నా దైవం) అన్న భావన శూద్రరైతుల్లో ఉన్నంత కాలం వారు పీడన నుండి బయటపడరని చెప్పారు.

రైతును పురోహితులు దోచుకోవడం అతను పుట్టకముందు నుండే మొదలు పెడతారు. అతను చనిపోయాక ఉత్తర క్రియలు, శ్రాద్ధకర్మల పేర కూడా ఎలా దోచుకుంటారో పూలే తన పుస్తకంలో వివరంగా చెప్పారు. రైతు తల్లి గర్భం ధరించగానే బ్రాహ్మణులు ఏవేవో తంతులు జరిపించి కాసులు రాల్చుకొంటారు. ప్రతియేటా తద్దినాల పేర విందు భోజనాలు ఆరగించి సంభావనలు లాగుతారు. హిందువుల పండుగలన్నీ బ్రాహ్మణుల దోపిడీకి అక్కరకొచ్చేవే అంటూ పండుగల వారిగా రైతులను ఎలాదోచుకొంటారో విశదీకరించారు. క్రీ.పూ. చార్వాకులు కూడా ఇదే ప్రశ్నించారు. అతిథికి మిద్దె మీద పీట వేసి కింది అంతస్తులో విస్తరి వేసి వడ్డిస్తే మిద్దెమీదికి వాడికి చేరవు కదా? అని వారు ప్రశ్నించారు.

బ్రిటిష్ పాలనలో రైతులపై విధిస్తున్న భూమిశిస్తును కట్టలేని స్థితిని వివరిస్తూ పూలే ఒక విషయం చెప్పారు. గతంలో రాజుల దగ్గర సైనికులుగా, గుర్రాలు, పశువులు, ఒంటెలు, ఏనుగులకు సంరక్షకులుగా శూద్ర,అతిశూద్రుల కుటుంబాల నుండి ఎవరో ఒకరు ప్రభుత్వ ఉద్యోగంలో ఉండేవారు. దానివల్ల ఆ కుటుంబాలకు భూమిశిస్తు చెల్లించడం ఒక సమస్యగా ఉండేది కాదు. ఇప్పుడు ఆ ఉద్యోగాలు లేవు, రైతులు భూమి శిస్తు చెల్లించలేక పోతున్నారని చెప్పారు. కేవలం కొద్దిపాటి భూమిపై ఆధారపడి జీవించే వారి స్థితి నేటికీ అలాగే ఉంది. భూమి శిస్తు లేకపోయినా రైతులు రకరకాల దోపిడీకి గురవుతున్నారు.

> అన్ని ఉద్యోగాలను బ్రాహ్మణులే కాజేయకుండా వారి జనాభా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు కేటాయించి మిగిలిన ఉద్యోగాలను శూద్ర, అతిశూద్రులకు ఇవ్వాలన్నారు. రైతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే రైతు కుటుంబాల నుండే టీచర్లు ఉండాలి. విద్యార్థులకు ఒక నిర్ణీత కాలం సాధారణ విద్యనందించి ఆ తర్వాత వ్యవసాయ సంబంధ శిక్షణనివ్వాలి. వారిలో సత్ప్రవర్తన గల విద్యార్థులను ఆరో తరగతి పాసయ్యాక గ్రామ పాటీళ్లుగా నియమించాలి. అలాచేస్తే బ్రాహ్మణ కులకర్ణీ (కరణాలు)లు పెట్టే బాధల నుండి రైతులను తప్పించవచ్చు. కొంతకాలం పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడం ఆపేసి ఆ ఉద్యోగాల్లోకి రైతు కుటుంబాల యువకులను తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. బ్రిటిష్ పాలకులు ఆ పని చేయకపోయినా పూలే అభిమాని సాహు మహరాజు తన రాజ్యంలో

తక్కువ భూమి గల రైతులు గొర్రెలు, మేకలు, పశువులు పెంచుకొని కొంత ఆదాయం పొందేవారు. ఇప్పుడు బ్రిటిష్ పాలకులు పచ్చిక బయళ్లను కూడా అడవులుగా గుర్తించడం వల్ల జీవాలకు మేత లేదు. కనుక అడవుల్లో కొంత భాగాన్ని పశ్చికబయళ్ల కోసం గ్రామాలకు అప్పగించాలని కోరారు. బ్రిటిష్ వారి పారిశ్రామిక ఉత్పత్తులతో పోటీ పడలేక దేశంలోని వృత్తిదార్లు బతుకుదెరువు కోల్పోయారు. తిండి దొరకని స్థితికి చేరారు. అర్ధాకలితో చస్తున్నారని పూలే చెప్పారు. రైతులు ఆత్మహత్యల గురించి ఆయన ప్రస్తావించలేదు. కాని ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన మాత్రం వారికి కలుగుతోందని చెప్పారు.

బ్రిటిష్ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఆయన వదల్లేదు. చదువు పేర స్థానిక పన్నుల రూపంలో లక్షల రూపాయలను వసూళ్లు చేస్తున్నారు. అందులో మూడోవంతు మాత్రమే అక్కడో ఇక్కడో స్థాపించిన బడులపై ఖర్చు చేస్తున్నారు. పిల్లలను బడికి పంపిస్తున్న రైతుల సంఖ్య చాలా తక్కువ. రైతులందరూ తమ పిల్లలను తప్పక బడికి పంపాలన్న ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేయాలని పూలే కోరారు. అలా నిర్బంధోచిత విద్య ఆవశ్యతను ఆయన నూట యాభై ఏండ్ల క్రితమే చెప్పారు. పాఠాలు చెప్పాల్సిన పంతుళ్లు పవిత్రం, అపవిత్రం అంటూ విద్యార్థులపై ఆంక్షలు పెడతారు. పైగా క్రతువుల నిర్వహణల్లో మునిగి చదువు చెప్పరు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదు. కనుక రైతుల పిల్లలు ఎంతమంది చదువుకున్నారు. వారిలో ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగంలో చేరగల విద్యను పొందారు అన్న విషయాలను ప్రభుత్వం రాజ పత్రం (గెజిట్)లో ప్రచురించాలని పూలే డిమాండ్ చేశారు.

అన్ని ఉద్యోగాలను బ్రాహ్మణులే కాజేయకుండా వారి జనాభా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు కేటాయించి మిగిలిన ఉద్యోగాలను శూద్ర, అతిశూద్రులకు ఇవ్వాలన్నారు. రైతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే రైతు కుటుంబాల నుండే టీచర్లు ఉండాలి. విద్యార్థులకు ఒక నిర్ణీత కాలం సాధారణ విద్యనందించి ఆ తర్వాత వ్యవసాయ సంబంధ శిక్షణనివ్వాలి. వారిలో సత్ప్రవర్తన గల విద్యార్థులను ఆరో తరగతి పాసయ్యాక గ్రామ పాటీళ్లుగా నియమించాలి. అలాచేస్తే బ్రాహ్మణ కులకర్ణీ (కరణాల)లు పెట్టే బాధల నుండి రైతులను తప్పించవచ్చు. కొంతకాలం పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడం ఆపేసి ఆ ఉద్యోగాల్లోకి రైతు కుటుంబాల యువకులను తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. బ్రిటిష్ పాలకులు ఆ పని చేయకపోయినా పూలే అభిమాని సాహు మహరాజు తన రాజ్యంలో బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లను అమలు చేశారు.

ముప్పయేళ్లకు ఒకసారి ప్రభుత్వం భూమి శిస్తును సవరించేది. ఆ సమయంలో ఎంతోకొంత శిస్తును పెంచకుండా బ్రిటిష్ అధికార్లు ఒప్పుకోరు. పైగా భూమిని సర్వే చేస్తున్నప్పుడు అక్కడ ఉండాల్సిన బ్రిటిష్ అధికార్లు ఆ పనిని బ్రాహ్మణ ఉద్యోగులకు వదిలి వేటకు వెళ్తారు. ఒక క్రమపద్ధతి లేకుండా బ్రాహ్మణ ఉద్యోగులు శిస్తును పెంచుతారు. భూ వివాదాల కేసుల్లో బ్రాహ్మణ గుమస్తాలు రైతుల స్టేట్‌మెంట్లను మార్చి రాస్తారు.వాటి ఆధారంగా మెజిస్ట్రేట్లు తప్పుడు తీర్పులిచ్చి రైతులకు అన్యాయం చేశారు. ఎక్కువ భూమిగల రైతులు తమ భూమిని సాగు చేయక పడావు పెట్టారు. ఫలితంగా తిండి గింజల ఉత్పత్తి తగ్గుతుంది. పెరుగుతున్న జనాభాకు తగినట్లు పంటల ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టదు. తమ గోడును

> భూ వివాదాల కేసుల్లో బ్రాహ్మణ గుమస్తాలు రైతుల స్టేట్‌మెంట్లను మార్చి రాస్తారు.వాటి ఆధారంగా మెజిస్ట్రేట్లు తప్పుడు తీర్పులిచ్చి రైతులకు అన్యాయం చేశారు. ఎక్కువ భూమిగల రైతులు తమ భూమిని సాగు చేయక పడావు పెట్టారు. ఫలితంగా తిండి గింజల ఉత్పత్తి తగ్గుతుంది. పెరుగుతున్న జనాభాకు తగినట్లు పంటల ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టదు. తమ గోడును కలెక్టర్‌కు చెప్పుకోవడానికి వచ్చిన రైతును బ్రాహ్మణ ఉద్యోగులు గోస పెడతారు. తప్పుడు సాకులతో రైతులను అరెస్టు చేయిస్తారు. కేసులు ఎత్తేయడానికి గుమాస్తాలు, పోలీసులు లంచాలు గుంజుతారు. వారు వడ్డీ వ్యాపారుల నుండి కూడా లంచాలు తీసుకొని రైతులను కష్టాల పాల్జేస్తారు. మద్యం, వేట ఈ రెండింటి మైకంలో పడిన ఆంగ్లేయ అధికారులు రైతుల గోస పట్టించుకోరని పూలే విమర్శించారు.

కలెక్టర్‌కు చెప్పుకోవడానికి వచ్చిన రైతును బ్రాహ్మణ ఉద్యోగులు గోస పెడతారు. తప్పుడు సాకులతో రైతులను అరెస్టు చేయిస్తారు. కేసులు ఎత్తేయడానికి గుమాస్తాలు, పోలీసులు లంచాలు గుంజుతారు. వారు వడ్డీ వ్యాపారుల నుండి కూడా లంచాలు తీసుకొని రైతులను కష్టాల పాల్జేస్తారు. మద్యం, వేట ఈ రెండింటి మైకంలో పడిన ఆంగ్లేయ అధికారులు రైతుల గోస పట్టించుకోరని పూలే విమర్శించారు.

వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి కూడా పూలే పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో యూరప్ దేశాల తరహాలో ఆధునిక పనిముట్లను ప్రవేశపెట్టాలని, వాటి ఉపయోగంపై శిక్షణివ్వాలన్నారు. గోమాంస భక్షణను ఆయన వ్యతిరేకించలేదు. అయితే వ్యవసాయానికి అవసరమైన పశువుల సంఖ్య తగ్గకుండా ముస్లింలు, ఆంగ్లేయులు విదేశాల నుండి దిగుమతి చేసుకొని వాటి మాంసం తినాలన్నారు. వాగులపై ప్రభుత్వం చిన్న చిన్న ఆనకట్టలు కట్టి వర్షపునీటితో పాటు నదుల్లోకి పశువులను వెళ్లే భూసారాన్నీ కాపాడాలని కోరారు. కొండలు, గుట్టల్లో వీలైనన్ని చెరువులు కట్టించాలి. వాటి వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. పంటల దిగు బడులూ పెరుగుతాయి. సేద్యపు బావులు తవ్వుకొనే రైతులకు ప్రోత్సాహాలు అందించాలి. విదేశాలనుండి మేలు జాతి గొర్రెలను ప్రభుత్వమే దిగుమతి చేసుకొని ఆ జాతిని అభివృద్ధి చేయాలి. అడవి జంతువుల నుండి పంటలు కాపాడుకోవడానికి రైతులకు తుపాకీ ఉంచుకోవడానికి అనుమతినివ్వాలి. లేదంటే పంట నష్టాన్ని ఉన్నతాధికారుల జీతాల్లో కోసి రైతులకివ్వాలి.

కమ్మరి, వడ్రంగి పని నేర్చుకున్న రైతు కుటుంబాల పిల్లల్ని విదేశాలకు తీసుకెళ్లి అక్కడి వ్యవసాయ పాఠశాలలను, పంటపొలాలను చూపెట్టాలి. దాని వల్ల వారు మెరుగైన వ్యవసాయ పరికరాలను తయారు చేయగలరు. లక్షలాది రైతులు సరైన తిండికీ, బట్టకు నోచుకోలేని దశలో పోలీసు, న్యాయశాఖ, మిలటరీ, రెవెన్యూ తదితర ఉద్యోగులకు ప్రభుత్వం భారీగా వేతనాలు, పింఛన్లు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు? అలా అని తక్కువ జీతం పొందే సైనికులు, కమ్మర్లు, వడ్రంగుల వంటి వారి జీతాలు తగ్గించరాదు. ఉన్నతాధికారుల జీతాలు తగ్గించాలని కోరారు. చిన్ననాటి ముస్లిం స్నేహితుల వల్ల తనకు హిందూ మతంలోని స్వార్థం ఏమిటో అర్థమయిందన్నారు. తనకు జ్ఞానభిక్ష పెట్టిన స్కాటిష్ మిషన్‌కు, ప్రభుత్వ పాఠశాలకు కృతజ్ఞతలు తెలిపారు. తన అభిప్రాయాలను పుస్తక రూపంలో తెలియచేయడానికి స్వేచ్ఛనిచ్చిన బ్రిటిష్ ప్రభుత్వ రాజకీయ వ్యవస్థకు, పుస్తకం ప్రచురణకు ఆర్థిక సహాయం చేసిన బరోడా మహారాజుకు కూడా పూలే కృతజ్ఞతలు చెప్పారు.

(నేడు జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి)

సమస్యల మణిపురం - సంభావ్య పరిష్కారం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

మణిపూర్ మరలా మండుతోంది. మోడీ మణిపూర్ పోలేదని విపక్షాల విమర్శ. మణిపూర్ సమస్యను తీర్చమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాష్ట్రపతికి లేఖ రాశారు. రాజ్యాంగాధికరణలు 370, 35ఎ కశ్మీరీలకు భూమి హక్కునిచ్చాయి. వీటి రద్దుతో కశ్మీర్ భూములను కార్పొరేట్ల కిచ్చారు. లక్షద్వీప్ కేంద్ర పాలనాధికారి రాజ్యాంగ పరిమితి దాటి చట్టాలు చేశారు. ప్రకృతి సంపద, సముద్ర తీరాలు, నిర్జన ద్వీపాలను కార్పొరేట్లకు పంచారు. నేటి పాలకవర్గాల ఇలాంటి చర్యలే మణిపూర్ అల్లర్లకు కారణం.

2017లో 60 సీట్ల (40 మైతీలకు, 20 కుకీ, నాగా, జోమి గిరిజనులకు) మణిపూర్‌లో 21 సీట్ల బీజేపీ పభుత్వాన్ని ఏర్పర్చింది.వైదికవాద మెజార్టీ మైతీలను, సనమహిలను రెచ్చగొట్టి సంఘ్ సంస్థలు క్రైస్తవ కుకీలపై దాడిచేశాయి. వారితో ఆస్తులు, ఇండ్లు, పొరుగు పంచుకోవద్దని 2022 ఎన్నికల్లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ మైతీలకు చెప్పారు. వారు ఈ గుజరాత్ నమూనాను పాటించారు. కుకీలు, నాగాలు మణిపూర్ లోయలో పిల్లలను చదివిస్తారు. చిన్న పనులతో అద్దె ఇండ్లలో బతుకుతారు. సంఘ్ దాడులతో పిల్లల చదువు, పెద్దల జీవనం ఆగాయి. డబులింజిన్ ప్రభుత్వంతో శాంతిభద్రతలు, జీవన ప్రమాణాలు పెంచుతా మని, మైతీలకు షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా ఇస్తామని మోడీ ప్రచారం చేశారు.(సామాజిక, ఆర్థిక వెనుక బాటుతో రాజకీయ ప్రాతినిధ్యం పొందలేని మూలప్రాంతాల గిరిజనులకు రాజ్యాంగం ఎస్టీ హోదానిచ్చింది. మైతీలు దీనికి అనర్హులు) రాజ్యాంగ విరుద్ధ వాగ్దానాలతో దోచుకున్న 32 సీట్లతో 2022లో ప్రభుత్వాన్ని ఏర్పర్చారు.అభివృద్ధి నిధుల్లో 80శాతం మైతీలకు, 20శాతం గిరిజనులకిచ్చారు. పాలకవర్గ మైతీలకు 36 వేర్పాటువాద తీవ్రవాద సంస్థలపై ఆంక్షలను ఎత్తేశారు. అవి విజృంభించాయి. ఎస్టీ హోదా కోసం మైతీలు ఉద్యమించారు. వారి తీవ్రవాద సంస్థలు, సంఘ్ వత్తాసు పలికాయి. దీనికి గిరిజనులు నిరసన తెలిపారు. వీరిని అడ్డుకునేందుకు మైతీలు హింసకు పాల్పడ్డారు.

మణిపూర్‌లో మయన్మార్లు చొరబడ్డారని సంఘ్ ప్రచారం. నియంత్రిత ప్రాంత అనుమతితో విదేశీయులకు పదిరోజుల మణిపూర్ ప్రవేశం ఇస్తారు. అధికార అశ్రద్ధతో బర్మా చిన్ తెగవారు మణిపూర్‌లో చొరబడ్డారు. రోహింగ్య ముస్లింలను అడ్డుకున్న కేంద్రం వీరిని ఆపలేదు. బీజేపీ పాలిత గుజరాత్, రాజస్థాన్, హరియాణాలకు వైదిక విదేశీయులను రానిచ్చారు. వారికి పౌరసత్వం, ఓటు హక్కు ఇచ్చి 2014లో వారితో 19 ఎంపీ సీట్లు పొందారు. ఇదే ప్రయోజనాన్ని ఆశించి కేంద్ర రాష్ట్ర పాలకులే మణిపూర్‌లోకి బర్మీయులను రానిచ్చారు. కుకీల పర్వత ప్రాంతాల్లో బొగ్గు నిలువలున్నాయి. ఇటీవల చమురు,వజ్రాల నిక్షేపాలు కనిపెట్టారు. వాటిని కార్పొరేట్లకు ఇవ్వాలని బీజేపీ పాలకుల పన్నాగం. రక్షిత, వన్యప్రాణ అభయారణ్య అడవుల సాకుతో కుకీల భూములను ఆక్రమించారు. వారిని తరిమేశారు. కుకీలు నల్లమందు పండిస్తున్నారని వారి తోటలను ధ్వంసం చేశారు. పాలక మైతీల వాణిజ్యవేత్తలే నల్లమందు వ్యాపారం చేస్తారు. వారి డ్రగ్ సిండికేట్లు కుకీల నుండి నల్లమందును తక్కువ ధరకు కొంటారు. నల్లమందు పంటను, వ్యాపారాన్ని సొంతం చేసుకోవాలని వీరి పథకం. పోలీసులు అరెస్టుచేసిన నల్లమందు ముఠాలలో ముఖ్యమంత్రి బంధువులున్నారు. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, జాతి ద్వేషాలు కుకీలను నల్లమందు వైపునకు నెట్టాయి. పాలకులు సమస్యలను పరిష్కరిస్తే కుకీలు నల్లమందు జోలికిపోరు.



> ప్రజాసేవకు, శ్రేయస్సుకు అంకితమవుతానని రాజ్యాంగాధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి ప్రమాణం చేశారు. గిరిజన ముర్ముకు మణిపూర్ సొంత సమస్య. వందల స్త్రీల మానప్రాణాలు పోయాయి. గిరిజనులు హత్యలు, దోపిడీలకు గురయ్యారు. మణిపూర్ గిరిజన సంక్షేమానికి కొండప్రాంతాలను కాపాడే రాజ్యాంగాధికరణ 371సి ఇచ్చిన ప్రత్యేక హోదాను మోడీయం దుర్లక్ష్యం చేసింది.స్త్రీలు, తన జాతి ప్రజలకు ఇన్ని అన్యాయాలు జరిగినా, మణిపూర్ ప్రజాహింసకు సైనిక ప్రత్యేకాధికారాల చట్టం తిరిగి అమలయినా సర్వసైన్యాధిపతి ముర్ము మౌనంగా ఉన్నారు.దేశ ప్రతిష్ట, లౌకికత్వం, మానవత్వాల రక్షణకు ప్రభుత్వాధిపతికి సూచనలివ్వడం దేశాధిపతి బాధ్యత.

మణిపూర్ క్రైస్తవ జనాభా పెరిగిందని, వారు మైతీలను మించుతారని సంఘ్ ప్రచారం. 1961-2011 మధ్య యాభైఏండ్లలో క్రైస్తవులు ఐదు లక్షలు పెరిగారు. వైదికులూ పెరిగారు. క్రమేపి పెరిగిన జనాభా, ఓట్ల కోసం పాలక ఆమోదిత వలసలు, వైదిక వివక్షను భరించలేక క్రైస్తవానికి మార్పిళ్ల పెరుగుదలకు కారణం. క్రైస్తవ పెరుగుదలను ఆపడానికి జాతీయ పౌరసత్వ, జనాభా జాబితాలను తయారుచేయమని, 1951 జనాభా ప్రకారం పౌరసత్వాన్ని సవరించమని సంఘ్ గొడవచేసింది. దీనితో 95శాతం కుకీలు, నాగాలు పౌరసత్వం కోల్పోయి రాష్ట్రాన్ని వదలాలి. అల్లర్లలో ఆరు వేల ఆయుధాలు చోరీఅయ్యాయి. పోయింది వెయ్యేనని, 200 రికవరీ చేశామని ముఖ్యమంత్రి అన్నారు. అల్లర్లు జరిగిన చురాచంద్‌పూర్‌లోనే కాక రాష్ట్రమంతా (కేంద్ర, సైనిక, ప్రత్యేక దళాల భాండాగారాలను వదిలి) రాష్ట్ర రక్షణదళాల భాండాగారాల నుంచే చోరీలు జరిగాయి. ఒక్కటీ పట్టుబడలేదు. అన్ని స్టేషన్లలో పోలీసు నిర్లిప్తత అనూహ్యం. పాలకుల, అధికారుల మద్దతుతో ఈ ఆయుధాలు సంఘ్, మైతీ సంస్థలకు చేరాయి. చనిపోయిన 250 మందిలో 98శాతం, పారిపోయిన 6,500 మందిలో 70శాతం, గాయపడ్డ 500 మంది కుకీలు. కుకీల 20వేల ఇండ్లు, 200 చర్చిలు, 17 గుళ్లు, 124 గ్రామాలు, వారి ఆస్తులు, వాహనాలే బూడిదయ్యాయి. కుకీలను తీవ్రవాదులుగా చిత్రించి పాలకులే చంపారు. 3 జూన్ 2023న కేంద్రం నియమించిన దర్యాప్తు సంస్థ గడువుతీరినా నివేదిక నివ్వలేదు. గిరిజనులు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నారు. ఈ సందులో మయన్మార్ సైనిక ఝుంతా మణిపూర్‌లో చొరబడగలదు.

స్త్రీలు, క్రీడాకళాకారులు, మేధావులు దేశవ్యాపితంగా నిరసనలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ఐరాస మానవహక్కుల సంస్థ, 550 మంది పౌరసమాజ ప్రతినిధులు, కేంద్ర పాలకులు జోక్యం చేసుకోవాలని, హత్యలు, హింసను దమనకాండను ఆపాలని ఉత్తరాలు రాశారు. ప్రధాని, రాష్ట్రపతి పట్టించుకోలేదు. మోడీ మణిపూర్‌కు పోతే 'నీవిస్తానన్న ఎస్టీ హోదా ఎక్కడా?' అని నిలదీస్తారు. డబులింజిన్ డొల్లని విమర్శిస్తారు. మోడీ అక్కడికెళ్లినా నష్టమే. మణిపూర్ సమస్యకు విపక్షాలే కారణమంటారు. తాను సమస్యను పరిష్కరిస్తుంటే క్రైస్తవులు, కమ్యూనిస్టులు అడ్డుకున్నారంటారు. తన "ఘనత"ను ఘోషిస్తారు. నాలుగు వందల ఏండ్ల నాటి ముస్లిం పాలన, హిందు ఇస్లామీకరణ, క్రైస్తవీకరణలు మణిపూర్ మంటలకు మూలాలంటారు. ధృతరాష్ట్ర (వాట్సాప్) విశ్వవిద్యాలయ వత్తాసుదారులతో నమ్మిస్తారు.ప్రజాసేవకు, శ్రేయస్సుకు అంకితమవుతానని రాజ్యాంగాధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి ప్రమాణం చేశారు.

గిరిజన ముర్ముకు మణిపూర్ సొంత సమస్య. వందల స్త్రీల మానప్రాణాలు పోయాయి. గిరిజనులు హత్యలు, దోపిడీలకు గురయ్యారు. మణిపూర్ గిరిజన సంక్షేమానికి కొండ ప్రాంతాలను కాపాడే రాజ్యాంగాధికరణ 371సి ఇచ్చిన ప్రత్యేక హోదాను మోడీయం దుర్లక్ష్యం చేసింది.స్త్రీలు, తన జాతి ప్రజలకు ఇన్ని అన్యాయాలు జరిగినా, మణిపూర్ ప్రజాహింసకు సైనిక ప్రత్యేకాధికారాల చట్టం తిరిగి అమలయినా సర్వసైన్యాధిపతి ముర్ము మౌనంగా ఉన్నారు.దేశ ప్రతిష్ట, లౌకికత్వం, మానవత్వాల రక్షణకు ప్రభుత్వాధిపతికి సూచనలివ్వడం దేశాధిపతి బాధ్యత.

మోడీ కార్పొరేట్ ఫాసిజానికి, ఆశ్రిత కార్పొరేట్ల దోపిడీ, మోసాలకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్యపర్చాలి.లౌకిక సమాజ అవసరాన్ని వివరించాలి.మనముందే రాజ్యవ్యవస్థ కూలింది. మన క్షేమాన్ని మనమే పట్టించుకోవాలి. సామాన్యుల సమస్యల పరిష్కారానికి పోరాడిన చారిత్రక విప్లవవీరులెందరో మనకు ఆదర్శం. వారి పోరాటాలు సమస్యల నిరోధకాలు, పరిష్కారాలు. స్వేచ్ఛాసాధికార న్యాయబద్ధ జీవితాల సాధనాలు. ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారి పద్ధతి సామాన్యుల సమస్యలు పరిష్కరించదు. మనం ఒంటరులం కాదు. సామూహికంగా సమస్యలను పరిష్కరించుకోగల ఆలోచనాపరుల సంఘ సభ్యులం. శాంతిసౌఖ్యాల ప్రపంచ నిర్మాణానికి విప్లవమార్గం పడదాం.



సోషలిజం కోసం యువత ఆలోచించాలి

- భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

షాహిద్ భగత్ సింగ్ కలలుగన్న సోషలిజం కోసం యువత, విద్యార్థి లోకం ఆలోచించాలని భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లో రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి వచ్చారు. గాంధీనగర్, జగద్గిరిగుట్ట, మక్దుమ్ నగర్, భగత్ సింగ్ మార్గ్ ప్రాంతాల్లో ఉన్న భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గాజుల రామారంలోని విన్ పాలస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. భగత్ సింగ్ చిన్నతనంలోనే సొంతంగా చదివి ఆలోచించే గుణం కలిగి ఉండేవరని, అందుకే సమాజంలో జరిగిన అన్ని అన్యాయాలనూ ప్రశ్నిస్తూ వాటికి శాస్త్రీయమైన సమాధానాలు రాబట్టేవారని తెలిపారు. మత, కుల, లింగం లాంటివి మనుషులను విభజిస్తున్నాయని, అలాంటి విభజన ఉండొద్దంటే ఈ దేశంలో అందరూ సమానులే అనే భావన తీసుకురావాలని 17 సంవత్సరాల వయసులోనే నౌజవాన్ సభ ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ప్రజలు కులం, మతం అనే అభిప్రాయాల నుంచి దూరంగా ఉండాలని, శాస్త్రీయమైన విద్యను అభ్యసించాలని కోరుకున్నారని చెప్పారు. ఈ దేశ సంపద కొంత మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అందరికీ చెందాలని, దాన్ని కేవలం సోషలిస్టు వ్యవస్థతోనే సాధించొచ్చని అన్నారు. భగత్ సింగ్ విప్లవకారుడిగా మారడానికి కారణం చదువని, ఆ విజ్ఞానాన్ని ఆచరణలో చూపాడు కాబట్టే ఆయన ఇంతమందికి నేటికీ స్ఫూర్తిగా, చైతన్యం అందిస్తూనే ఉన్నారన్నారు. విద్యార్థులు భగత్ సింగ్ గురించి చదవాలని, మాట్లాడాలని సూచిం చారు. నేడు భగత్‌సింగ్ బతికుంటే మత రాజకీయాల ను వ్యతిరేకించేవారన్నారు. గాంధీనగర్‌లో ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ఆయనకు ఘనస్వాగతం పలకగా.. జగద్గిరిగుట్ట, భగత్ సింగ్ మార్గ్‌లో సీపీఐ నాయకులు, విన్ పాలస్ ఫంక్షన్ హాల్లో నేతాజీ విద్యార్థులు వేదిక పైకి ఆహ్వానించారు.

సంఘమిత్ర, పటేల్, ఫ్రీడమ్, నాగార్జున, సాధన, బాపూజీ పాఠశాల విద్యార్థులు దేశభక్తి గేయాలపై నృత్యాలు చేశారు. వారికి బహుమతులు అందజేశారు. ప్రజానాట్య మం డలి అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, భాస్కర్ బృందం, వెంకటా చారి బృందం దేశభక్తి పాటలు పాడి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. కార్యక్రమ నిర్వాహకులు అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, వెంకటేష్ నాయకత్వం వహించి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఈ.ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కిషన్, జనవిజ్ఞాన వేదిక నాయకులు రావుల వరప్రసాద్, సీపీఐ రాష్ట్ర నాయకులు కె.ఏసురత్నం, మహిళా సమాఖ్య నాయకురాలు హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురౌతుంటే పాలకులు, అధికారుల్లో కదలిక లేదని మండిపడింది. వాంతులు, విరోచనాలు చేసుకుని అనారోగ్యానికి గురౌతుంటే అధికారులు నిద్రపోతున్నారా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల ప్రాణాలు పోతేగానీ స్పందించరా అంటూ ప్రభుత్వాన్ని నిలదీసింది. నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీ స్కూల్‌లో వరుసగా మూడుసార్లు విద్యార్థులు ఆస్పత్రిపాలైన ఘటనపై వివరాలు ఇచ్చేందుకు వారం రోజులు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో కోర్టు అసహనం వ్యక్తం చేసింది. వాయిదా వేసే ప్రసక్తే లేదనీ, నారాయణపేట డీఈవో ఇతర ఆఫీసర్ల దగ్గర సెల్‌ఫోన్లు లేవా అని ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్యానికి మేమైతే వెంటనే డీఈవోను సస్పెండ్ చేస్తామంటూ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రభుత్వం తరఫున వాదించేందుకు అదనపు అడ్వొకేట్ జనరల్ విచారణకు రావాలని తేల్చి చెప్పింది. దీంతో పది నిమిషాల తర్వాత అదనపు ఏజీ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ విచారణకు హాజరై పూర్తి వివరాలు భోజన విరామం తర్వాత ఇస్తామని చెప్పడంతో హైకోర్టు సమ్మతించింది.

ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు సరిగ్గా లేదంటూ హైదరాబాద్‌కు చెందిన కె.అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. మాగనూరులో ఈనెల 20, 24, 26 తేదీల్లో వరసగా విద్యార్థులు మిడ్డే మీల్స్ తిని ఆస్పత్రి పాలయ్యారని పిటిషనర్ లాయర్ చిక్కుడు ప్రభాకర్ వాదించారు. దీనిపై కౌంటర్ వేసేందుకు వారం రోజులు కావాలని ప్రభుత్వ ప్లీడర్ కోరడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మాగనూరు 70 కిలోమీటర్ల దూరంలోనే ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రభాకర్ చెప్పారు. అక్కడ నుంచి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని తెప్పించుకునే సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. దీంతో, ఫోన్‌లో డీఈవో నుంచి సమాచారాన్ని తెప్పించుకునేందుకు వారం రోజులు సమయం ఎందుకని హైకోర్టు ప్రశ్నించింది. గడువు కోరడానికి సిగ్గుపడాలని వ్యాఖ్యానించింది. అధికారులకు కూడా పిల్లలు ఉన్నారనీ, మన పిల్లలకు అలా జరిగితే ఎలా వ్యవహరిస్తామో ఒకసారి ఆలోచన చేయాలని సూచించింది. విద్యార్థులు చచ్చిపోతేనే మీలో కదలిక వస్తుందా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది.

నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఈరోజే రెక్కలు కట్టుకుని సమాచారంతో వచ్చి వాలుతారని పేర్కొంది. లంచ్ తర్వాత అదనపు ఏజీ వాదనలు వినిపిస్తూ, లోకల్‌గా తయారు చేసిన కుర్‌కురేను విద్యార్థులు తినడంతోనే అస్వస్థతకు గురయ్యారనీ, రెండు సార్లు మాత్రమే స్కూల్‌లో మిడ్డే మీల్స్ వల్ల ఇబ్బందులు పడ్డారని కోర్టుకు తెలిపారు. మిడ్డే మీల్ తిన్నడం వల్ల జరిగిన ఘటనలకు బాధ్యులైన అధికారులు సస్పెండ్ అయ్యారని చెప్పారు. మధ్యాహ్న భోజనం తయారీదారు లను కూడా మార్పు చేశారని వివరించారు. కరీంనగర్ జిల్లా బూరుగపల్లి మండలం గంగాధరలో కూడా ఈ నెల 24న 20 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యారని కోర్టుకు తెలిపారు. వాదనల అనంతరం ప్రభుత్వం తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు డివిజన్ బెంచ్ తదుపరి విచారణను డిసెంబర్ 2కు వాయిదా వేసింది.

నేరపూరిత కుట్ర లేదు



న్యూఢిల్లీ: ఎన్డీటీవీ మాజీ డైరెక్టర్లు ప్రణయ్ రాయ్, రాధిక రాయ్‌లకు ఊరట లభించింది. వారిపై ఉన్న అవినీతి, ఫ్రాడ్ కేసును సీబీఐ మూసేసింది. ముందుగా ఊహించినట్టుగానే 2017 నాటి కేసులో అన్ని అభియోగాల నుంచి వారికి క్లీన్‌చిట్ ఇచ్చింది. ఐసీఐసీఐ బ్యాంకు అందించిన రూ.375 కోట్ల రుణం విషయంలో అవినీతి, కుట్ర, అవకతవకలున్నాయంటూ వారిపై ఉన్న ఆరోపణలను సీబీఐ క్లోజ్ చేసింది. సీబీఐ నివేదికను ఒక వార్త సంస్థ సంపాదించింది.

సీబీఐ నివేదిక సమాచారం ప్రకారం.. ఐసీఐసీఐ బ్యాంకుకు ఉద్దేశపూర్వకంగా రూ.48 కోట్లకుపైగా నష్టానికి కారకులయ్యారని 2017లో ప్రణయ్‌రాయ్, రాధికారాయ్‌లపై కేసు నమోదైంది. అయితే, ఈ కేసులో ఎలాంటి నేరపూరిత కుట్ర కానీ,ఏ ప్రభుత్వాధికారి లేదా ఐసీఐసీఐ బ్యాంకు ఆఫీసర్లు అధికారాన్ని దుర్వినియోగపర్చినట్టు కానీ లేదని సీబీఐ తన ముగింపు నివేదికలో పేర్కొన్నది. ఈనెల 12న రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి శైలేంద్ర మాలిక్ తన ఉత్తర్వుల్లో దీనిని వివరించారు.

ప్రణయ్‌రాయ్, రాధికలు ఆర్ఆర్‌పీఆర్ హెూల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్‌తో కలిసి కొందరు ఐసీఐసీఐ బ్యాంకు అధికారులతో నేరపూరిత కుట్రలో ప్రవేశించారనీ, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949లోని సెక్షన్ 19(2)ను ఉల్లంఘించారని 2008-09లో సీబీఐ ఆరోపించింది. ఏ కంపెనీ లోనైనా బ్యాంకింగ్ కంపెనీ షేర్లను కలిగి ఉండకూడదని ఈ సెక్షన్ వివరిస్తుంది. అయితే, అడ్వాన్స్ లోన్ కింద ఐసీఐసీఐ బ్యాంకు రూ.375 కోట్లను అందించిందనీ, ఎన్డీటీవీలో అప్పటి ప్రమోటర్ల మొత్తం షేర్‌హెూల్డింగ్‌ను తాకట్టుగా తీసుకున్నదని సీబీఐ ఆరోపించింది. రుణంపై వడ్డీ రేటును 19 శాతం నుంచి 9.5 శాతానికి తగ్గించిందనీ, దానితో బ్యాంకుకు రూ.48 కోట్ల నష్టమని పేర్కొన్నది.

అయితే, సీబీఐ తన ముగింపు నివేదికలో దీనిపై ఒక స్పష్టతకు వచ్చింది. ఇందులో ఎలాంటి అవకతవకలు, కుట్ర, అవినీతి, అధికార దుర్వినియోగం లేవనీ, అవన్నీ సాధారణ వ్యాపార లావాదేవీలేనని గుర్తించింది. వడ్డీ రేటు తగ్గింపు ఈ ఒక్క విషయంలో జరగలేదనీ, 2007 నుంచి 2010 మధ్య 83 లోన్లలోనూ జరిగిందని సీబీఐ పేర్కొన్నది. అలాగే, ఆర్ఆర్‌పీఆర్ ప్రయివేటు లిమిటెడ్‌కు రూ.375 కోట్ల రుణం మంజూరు అయిన విషయం పైనా సీబీఐ తన నివేదికలో స్పష్టతకు వచ్చింది.

బిబి రేటింగ్ కలిగి ఉన్న ఇతర కంపెనీలకు కూడా ఐసీఐసీఐ బ్యాంకు అలాంటి రుణాలను అందించిందని పేర్కొన్నది. 2008-09, 2009-10 ఆర్థిక సంవత్సరంలో బిబి, తక్కువ రేటింగ్ ఉన్న రుణ గ్రహీతలకు ఐసీఐసీఐ బ్యాంకు రూ.8400 కోట్ల లోన్లను అందించిందని సీబీఐ తన ముగింపు నివేదికలో పేర్కొన్నది. లోన్ విషయంలో బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలోని సెక్షన్ 19(2) ఉల్లంఘన జరగలేదని వివరించింది.

జీడిమెట్ల అగ్నిప్రమాదంలో కుప్పకూలిన పరిశ్రమ భవనం

- రూ.100 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల ఎస్ఎస్‌వీ ఫ్యాబ్ ఇండస్ట్రీస్ పాలిథిన్ సంచుల తయారీ కంపెనీలో మంగళవారం భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. పరిశ్రమలో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి అర్ధరాత్రి వరకు అదుపులోకి తీసుకొచ్చారు. వివారల్లోకెళ్తే.. జీడిమెట్ల ఫేజ్ 5 దూలపల్లి రోడ్డులో ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పేరిట ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే పరిశ్రమ ఉంది. పరిశ్రమ మొత్తం 3 ఫ్లోర్లలో నడుస్తోంది. ఆ పైన రేకుల షెడ్డు నిర్మించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భవనంలోని మూడో అంతస్తులో మంటలు ఏర్ప డగా, క్రమంగా ఒకటో అంతస్తు వరకు వ్యాపించాయి. ఆ తర్వాత భవనం మొత్తం మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఫ్యాక్టరీలోని కెమికల్ డ్రమ్ములు పెద్ద ఎత్తున పేలడంతో మంటలు మరింత చెలరేగాయి. సమా చారం అందుకున్న అగ్నిమాపక అధికారి శేఖర్‌రెడ్డి ప్రమాద తీవ్రతను గమ నించి, ఉన్నతా ధికారులకు వివరించి, నగరంలోని పలుచోట్ల నుంచి ఏడు ఫైరింజన్లను తరలించారు. అలాగే, వాటర్ బోర్డుతో పాటు ప్రయివేటు ట్యాంకర్లతో నీటిని తరలించారు. ఒక దశలో మంటలు వంద మీటర్ల ఎత్తు వరకు ఎగిసి పడ్డాయి. రసాయన డ్రమ్ముల పేలుడుతో మంటలు భారీగా ఎగిసిపడగా.. మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. మంటల ధాటికి భవనం గోడలు బీటలు వారి కుప్పకూలి పోయింది. దాదాపు రూ.100కోట్లకుపైగా నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా. షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. పరిశ్రమలో మొత్తం 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలో జనరల్ షిఫ్ట్‌లో 200 మందికిపైగా కార్మికులు ఉన్నట్టు సమాచారం. మంటలు రాగానే కార్మికులంతా బయటకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఇథనాల్ పరిశ్రమకు బ్రేక్

- పనుల నిలిపివేతకు కలెక్టర్ ఆదేశం
- దిలావర్‌పూర్ నుంచి ఫ్యాక్టరీని తరలించాలని ప్రభుత్వానికి నివేదిక
- రిలే దీక్షలు విరమించిన రైతులు
- గ్రామాల్లో సంబురాలు
- పొలాల కోసం ఏడాది పాటు పోరు సల్పిన రైతాంగం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైతుల పోరాటం ఫలించింది. పచ్చని పంట పొలాల్లో నుంచి విషాన్ని వెదజల్లే ఇథనాల్ పరిశ్రమను తరిమేసే వరకు విశ్రమించ లేదు. పచ్చని పంట పొలాలను కాపాడుకునేందుకు గ్రామాలన్నీ ఐక్యంగా పోరాడాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. పెద్దఎత్తున రణం సాగించారు. మంగళవారం ఉదయం నుంచి రోడ్డుపై బైటాయించి ఆందోళన కొనసాగించారు. చివరకు ప్రభుత్వం దిగొచ్చింది. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడ్నుంచి తరలించేలా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పరిశ్రమ నిర్మాణ పనులను నిలిపివేయించిన జిల్లా కలెక్టర్.. పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇందుకు సానుకూలంగా స్పందించి నట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క హామీ మేరకు దీక్షలు విరమించినట్టు రైతులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉన్నతా ధికారులు రైతులతో చెప్పడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలమంతా సం బురాల్లో మునిగిపోయింది. సుదీర్ఘంగా సాగించిన రైతుల పోరాటం విజయం సాధించింది. అయితే, ఈ ఫ్యాక్టరీ గత ప్రభుత్వంలోని మంజీ మంత్రి కుటుంబ సభ్యులకు సంబంధించినదని తెలిసింది.

ఏడాది కాలంగా పోరాటం..!

దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు గుండంపల్లి తదితర గ్రామాల మధ్య 42 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమను నిర్మిస్తున్నారు. ఈ పరిశ్రమతో చుట్టుపక్కల పంట పొలాలు పనికిరాకుండా పోతాయని.. భవిష్యత్‌లో వాటిలోకి వెళ్లలేని పరిస్థితి ఉంటుందని రైతులు తొలి నుంచి ఆందోళన వ్యక్తం చేస్తు వస్తున్నారు. ఇది వరకే మహబూబ్‌నగర్ జిల్లా చిత్తనూరులోని ఇథనాల్ పరిశ్రమను, అక్కడి పంట పొలాలను పరిశీలించి వచ్చారు. పొలాలు కలుషితం కావడం గమనించిన రైతులు తమ వద్ద ఇథనాల్ పరిశ్రమ వద్దేవద్దని నినదించారు. ఏడాది కాలం నుంచి పోరాడుతున్నారు. తొలుత దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టగా.. కొన్ని రోజులకు మండలంలోని అన్ని గ్రామాల వారు వీరికి తోడయ్యారు. పరిశ్రమను తరలించే వరకు ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. ఏడాది కాలంగా వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తున్న రైతులు 129 రోజులపాటు రిలే నిరాహార దీక్షలకు దిగారు. కొన్ని రోజుల నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. గ్రామాల నుంచి రైతులంతా రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో కొందరు రైతులపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. వీటిని ఎత్తివేయాలని మళ్లీ రైతులు పోలీసు స్టేషన్ ఎదుట పురుగు మందు డబ్బాలు చేతపట్టుకొని నిరసన తెలపడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. చివరకు ప్రభుత్వం దిగొచ్చి ఈ పరిశ్రమను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

కలెక్టర్ చర్చలు సఫలం

బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల రైతులతో చర్చలు జరిపారు. పరిశ్రమ పనులను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఈ పరిశ్రమను రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించినట్టు రైతులతో చెప్పడంతో దీక్షలు విరమించేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా రైతులపై నమోదైన కేసులను కూడా ఎత్తేయాలని కోరగా.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీనిచ్చారు. అనంతరం ఉన్నతాధికారులు గ్రామానికి వెళ్లి విషయం చెప్పడంతో ఆయా గ్రామాల్లో సంబురాలు మిన్నంటాయి.

వీహెచ్ కారును ధ్వంసం చేసిన దుండగులు

- ఇంటి ముందు పార్కింగ్

నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు (వీహెచ్) కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. హైదరాబాద్ అంబర్ పేట లో వీహెచ్ ఇంటి ముందు పార్క్ చేసిన కారును బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఓ వాహనంతో ఢీకొట్టి ధ్వంసం చేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై పోలీసులకు వీహెచ్ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. కారు నెంబర్ ప్లేట్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనపై వీహెచ్ మాట్లాడుతూ.. తన వాహనంపై ఇలా దాడి జరగడం ఇది రెండోసారి అని చెప్పారు. దాడికి గల కారణాలు తెలుసుకోవాలని, నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

నేటి నుంచి పాలమూరులో రైతుల పండుగ

- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్
- మూడ్రోజులపాటు నిర్వహణ
- 30న సీఎం రాక



నవతెలంగాణ- మహబూబ్‌నగర్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో కొచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడ్రోజులపాటు రైతుల పండుగ సంబురాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 28 నుంచి 30వరకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాన్‌పూర్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. 30న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే లక్ష్యంగా ఇప్పటికే వరంగల్ జిల్లాలో ఇందిరా మహిళాశక్తి సంబురాలు నిర్వహించామని తెలిపారు. గురువారం రైతు పండుగ సంబరాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభిస్తారని చెప్పారు. వ్యవసాయ రంగంలో చేపడుతున్న విధానాల పై 150 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా, మిగిలి ఉన్న రైతు రుణ మాఫీపై సీఎం ప్రకటన చేస్తారని తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రారంభమై సంవత్సరం పూర్తి కావస్తున్న దృష్ట్యా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మహబూబ్ నగర్ జిల్లాలో "రైతు పండుగ" ను మూడ్రోజులపాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో వస్తున్న ఆవిష్కరణలు, యాంత్రీకరణ, విత్తనాలు, పురుగు మందులు,ఎరువులు తదితరాంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహిస్తామని, వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు, వివిధ కంపెనీలు, రైతు సంస్థలు, రైత మేధావులు, ప్రొఫెసర్లు, ఆదర్శ రైతులు హాజరై రైతులకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. పర్యటనలో జిల్లా ఎస్పీ జానకి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్డీఓ నవీన్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ఉన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ అమిస్తాపూర్, నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద "రైతుపండుగ" కోసం ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను, భూత్పూర్ వద్ద పార్కింగ్, ఇతర సౌకర్యాలను పర్యవేక్షించారు.

బీఆర్ఎస్ గురుకుల బాట

- 30 నుంచి 7వ తేదీ వరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ
- గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులపై అధ్యయనం: కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి 7వ తేదీ వరకు గురుకుల బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీని ఏర్పాటు చేశామనీ, ఈ కమిటీ సహ సభ్యులుగా డాక్టర్ ఆంజనేయులు గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారామ్ యాదవ్, వాసుదేవ రెడ్డి ఉంటారని చెప్పారు. ఆ కమిటీ గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో పరిస్థితులను అధ్యయనం చేసి నివేదికను పార్టీకి సమర్పిస్తుందని తెలిపారు. అక్కడి స్థితిగతులు, సౌకర్యాలను, పరిస్థితులను తెలుసుకోనుంది. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఎదుర్కొంటోన్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తుందని తెలిపారు.

విద్యార్థుల మరణాలను నివారించటం విఫలమవటం, వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించలేకపోతున్న దానిపై ప్రభుత్వమే ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అదే విధంగా కమిటీ నివేదికలో ప్రస్తావించే అంశాలను తాము శాసనసభలో లేవనెత్తుతామని కేటీఆర్ తెలిపారు. 11 నెలల్లో 48 మంది విద్యార్థుల మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చనిపోతున్నా సమీక్షించే తీరిక లేకుండా సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీకి తిరగడానికే సరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురుకుల బాట కార్యక్రమానికి ఎంఎల్‌ఏ, ఎమ్మెల్సీ, ఎంపీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, విద్యార్థి విభాగం నాయకులకు సహకారం అందించాలని కేటీఆర్ సూచించారు. బాలికల విద్యాసంస్థల్లో పార్టీ తరఫున విద్యార్థి విభాగం మహిళా నాయకులు, పార్టీ మహిళా నాయకులు సందర్శిస్తారని కేటీఆర్ తెలిపారు. జడ్పీ చైర్మెన్లు ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మహిళా సీనియర్ నాయకులు బాలికల సమస్యలను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని చెప్పారు. ఏడాదిలో 48 మంది విద్యార్థులు మరణిస్తే, విద్యా సంస్థల్లో ఉన్న దుర్భరమైన పరిస్థితులను తట్టుకోలేక 23 మంది ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఎనిమిది మంది అనుమానస్పదంగా మరణించారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నలుగురు విషాహారం తిని, మరో 13 మంది అనారోగ్యంతో చనిపోయారన తెలిపారు. 38 సార్లు ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగితే 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలు కాగా నలుగురు మరణించారని చెప్పారు. విద్యార్థినీ శైలజ మరణం మరవక ముందే మహబూబ్‌నగర్ జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగడం ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో చెబుతున్నదని విమర్శించారు. పాలనానుభవం లేని సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్ద పెట్టుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. 28 సార్లు ఢిల్లీకి వెళ్లేందుకు సమయమున్న రేవంత్ రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చనిపోతున్నా సమీక్షించేందుకు ఒక్కసారి సమయం దొరకలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వారి బాగోగులు చూసుకోవడం చేతకాని దద్దమ్మ ప్రభుత్వమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరితే బీఆర్ఎస్వీ నాయకుల ను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని చెప్పారు. రేవంత్ సర్కార్ గురుకుల, పాఠశాల విద్యను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్రలో భాగంగా రేవంత్ రెడ్డి ఇంత నిర్దయగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మొదటి సంఘటన జరి గినప్పుడే ఈ సీఎం స్పందించి ఉంటే విద్యార్థుల మరణాలు జరిగి ఉండేవి కావని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మాదాపూర్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన

- రెండోసారి ఈదులకుంట పరిశీలన
- రెండు మండలాల రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని అధికారులకు సూచన



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, మాదాపూర్ ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పర్యటించారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి మండలాల సరిహద్దుల్లోని ఖానామెట్ విలేజ్ రెవెన్యూ సర్వే నంబర్ 7లోని ఈదులకుంటను రెండోసారి ఆయన పరిశీలించారు. ఆరెకరాల విస్తీర్ణంలో ఈదులకుంట చెరువు ఉండేదని, కాలక్రమేణా చెరువులోకి నీళ్లను వెళ్లకుండా నాలా మార్గం మార్చి ఒక బడా రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జాకు ప్రయత్నం చేస్తోందని సీపీఐ(ఎం) నాయకులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చెరువును కాపాడాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ గతంలో ఒకసారి పరిశీలించగా మళ్లీ బుధవారం పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు మండలాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

పలుమార్లు వినతులతోనే మరోసారి పర్యటన : సీపీఐ(ఎం) నాయకులు శోభన్

గతంలో హైడ్రా కమిషనర్ పర్యటించిన అనంతరం నిర్మాణ పనులు ఆపేసిన ఆ రియల్ ఎస్టేట్ సంస్థ.. మళ్లీ నిర్మాణ పనులను వేగవంతం చేసిందని సీపీఐ(ఎం) నాయకులు శోభన్ అన్నారు. ఇదే విషయాన్ని తాము కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రెండోసారి పర్యటించారని తెలిపారు. ఆయన పర్యటన తమ పోరాటానికి బలాన్ని ఇచ్చిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ సంస్థ చెరువుకు పక్కన ఉన్న ఒక ప్రయివేట్ సర్వే నెంబర్ ప్రకారం పర్మిషన్ తీసుకుని చెరువులో నిర్మాణం చేపడుతోందని చెప్పారు. గతంలోనే ఈ విషయంపై రెవెన్యూ, ఇరిగేషన్, వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పర్మిషన్ ఇచ్చారని తెలిపారు. ఈ పర్మిషన్‌పై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎంఎంఎస్ఎస్ పరీక్ష ప్రాథమిక కీ విడుదల

- డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 24 (ఆదివారం)న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాష్ట్రస్థాయి పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు తెలిపారు. ఎన్ఎంఎంఎస్ఎస్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేశామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. ప్రాథమిక కీపై వచ్చేనెల తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

మాగనూర్ పాఠశాలను సందర్శించిన స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

విద్యార్థులు, ఉపాధ్యాయులతో విచారణ

వంట గది, సరుకులు, తాగునీరు పరిశీలన



నవతెలంగాణ-మాగనూర్

నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో వరుసగా ఫుడ్ పాయిజన్ జరగడం, మంగళవారం కూడా విద్యార్థులను ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ చేసేందుకు వచ్చిన విద్యాశాఖ డైరెక్టర్ కలెక్టర్‌తో కలిసి పాఠశాలలో నిల్వ ఉన్న బియ్యం, వంట గది, పరిసరాలను, వంటకు ఉపయోగించే సరుకులను పరిశీలించారు. తాగు నీటి నమూనాలను మిషన్ భగీరథ అధికారులు పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని పెడుతున్నారా లేదా అని వంట ఏజెన్సీ నిర్వాహకులను డైరెక్టర్ ప్రశ్నించారు. వంటకు ఉపయోగించే బియ్యాన్ని, పప్పు, ఉప్పు, కారం, పసుపు నూనెను చూశారు. మధ్యాహ్నం భోజనానికి సిద్ధం చేసిన అన్నం, పాలకూరను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరానికి వెళ్లిన ఆయన విద్యార్థులకు ఏ ఏ పరీక్షలు చేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని, డాక్టర్ సౌభాగ్య లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి సాధారణ పరీక్షలు చేస్తున్నారని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను బట్టి అవసరమైతే రక్త పరీక్షలు చేస్తారని ఆమె వివరించారు. పాఠశాలకు ఏఏ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తారని? వసతి గృహాల నుంచి కూడా వస్తారా అని ఆరా తీశారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రం, స్థానికంగా ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు కూడా వస్తారని ఉపాధ్యాయులు తెలిపారు.

అనంతరం ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలంతో కలిసి హెచ్ఎం గదిలో ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు, గ్రామ మహిళా సమైక్య సభ్యులు, పదో తరగతి విద్యార్థులతో వేర్వేరుగా మంగళవారం జరిగిన ఘటన తాలూకు విచారణ నిర్వహించారు. వరుసగా పాఠశాలలో ఎందుకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రశ్నించారు. మంగళవారం మధ్యాహ్నం భోజనాన్ని ఎవరు పరిశీలించారని ఉపాధ్యాయులను అడిగారు. వంటకు ఉపయోగించే సరుకులు పాత స్టాక్ ఏమైనా ఉన్నాయా? అని డైరెక్టర్ ప్రశ్నించారు. అన్నీ పరిశీలించిన తర్వాతే మధ్యాహ్న భోజనం వండించామని, తాము తిన్న తర్వాత విద్యార్థులకు వడ్డించామని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో 400 మంది విద్యార్థులు భోజనం చేయగా, కొంతమందే ఎందుకు అస్వస్థతకు గురయ్యారని అడిగారు. ఇకపై పాఠశాలలో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు రొటేషన్ పద్ధతిన రోజూ నాణ్యత ప్రమాణాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులతోపాటు పదో తరగతి విద్యార్థులతో కమిటీ వేయాలని సూచించారు. రోజూ వారీగా ఆ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కలిసి మధ్యాహ్నం వంటకు ముందు, వంట చేసిన తర్వాత భోజనాన్ని పరిశీలించి తిన్న తర్వాత విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. మంగళవారం కొందరు విద్యార్థులు స్వల్ప జ్వరంతో ఉన్నట్టు తెలిసిందని, ఒకరిద్దరు విద్యార్థులు పచ్చి కందికాయలు తిన్నట్టు విద్యార్థులతో మాట్లాడే సమయంతో తెలిసిందని ఆయన అన్నారు.

అనంతరం విద్యార్థులతో కలిసి రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈ.వెంకట నరసింహారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ భోజనం చేశారు. పాఠశాలలో అన్నింటినీ పరిశీలించామని, నీటి నమూనాలు సేకరించి పరీక్షించామని మీడియాకు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇకపై పాఠశాలలో రోజువారీ పరిశీలన ఉంటుందన్నారు. ప్రతి రోజూ తాజా కూరగాయలు, నాణ్యతతో కూడిన వంట సామగ్రిని ఉపయోగిస్తారని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, తహసీల్దార్‌లు క్షేత్రస్థాయిలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తారన్నారు. వారి వెంట స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ కూడా ఉన్నారు. అన్నీ బాగున్నా ఎందుకీ ఘటనలు జరుగుతున్నాయన్న దానిపై అధికారులకు అంతు చిక్కడం లేదు. మొదటి రోజు మురిగిన కోడి గుడ్లు అస్వస్థతకు కారణమని తెలుస్తోంది. మిగతా రెండ్రోజులు వంట విషయంలో ఎటువంటి లోపాలు లేవని అధికారులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

మిల్లర్ల అక్రమాలు అరికట్టాలి

రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి



నవతెలంగాణ-ఐనవోలు

ధాన్యం కొనుగోళ్లలో గత ప్రభుత్వంలో జరిగిన లోపాలు తిరిగి జరగకుండా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సివిల్ సప్లయ్ మిల్లర్లు ఏకమై గతంలో జరిగిన మోసాలని మళ్లీ కొనసాగిస్తున్నారని, ఈ విధానాన్ని అరికట్టాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి హెచ్చరించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అనేక విషయాలు ప్రతినిధి బృందానికి వివరించారు. ఐకేపీ సెంటర్‌లో ధాన్యం తెచ్చి 15 రోజులు అవుతున్నా కొనుగోలు చేయడం లేదని, తేమశాతం ప్రభుత్వం నిర్ణయించిన దానికి లోపు ఉన్నా కాంటాలు పెడతలేరని తెలిపారు. క్వింటాకు 5కిలోలు కోత పెడుతున్నారని, సరైన టైమ్‌లో గన్నీ బ్యాగులు, టార్పలిన్లు ఇవ్వడం లేదని అన్నారు. కాంటాలు అయిన తర్వాత బిల్లులు ఇవ్వడం లేదని, ఐకేపీ కాంటాలకు వేసినా మళ్లీ మిల్లర్లు కోతలు పెడుతూ డబ్బులు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ సిమెంటు గద్దెలు గానీ, టార్పాలిన్లు గానీ లేకుండా ధాన్యాన్ని నేలపై పోయడంతో మట్టి కలుస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో షెడ్లు లేకపోవడంతో అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిసి పనికిరాకుండా పోతుందని, దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు రావడానికి టోకెన్ ఇచ్చినప్పటికీ అందుకు కావాల్సిన గన్నీ బ్యాగులు సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఐకేపీ సెంటర్లు కాంటాలు పెట్టిన తర్వాత కూడా మిల్లర్లు తూకంలో కోత పెడుతూ డబ్బులు తగ్గిస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రైతులతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు గుండెకారి మహేందర్, మండల అధ్యక్షులు మడిగే నాగరాజు, మండల ఉపాధ్యక్షులు కుంకాల నారాయణరెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల సైబర్ మోసం..!

- డిజిటల్ అరెస్ట్ స్కామ్ నుంచి రక్షించిన ఎస్‌బీఐ సిబ్బంది

నవ తెలంగాణ - హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సిబ్బంది తమ మరో ఖాతాదారున్ని డిజిటల్ అరెస్ట్ నుంచి కాపాడగలిగింది. హైదరాబాద్‌ని లోతుకుంటా శాఖలోని సిబ్బంది చాకచక్యంగా ఖాతాదారుడి రూ.30 లక్షలను సైబర్ మోసం నుంచి రక్షించారు. ఎస్‌బీఐ లోకల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఏజీఎం జి రామక్రిష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. లోతుకుంటలోని వైద్య దంపతులిద్దరిని ఢిల్లీ క్రైమ్ పోలీసుల పేరుతో బ్లాక్ మెయిల్ చేశారు. వారి ఆధార్ కార్డుతో పలు బ్యాంక్ ఖాతాలు తెరిచి.. రూ.80 కోట్ల అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని ఆ దంపతులిద్దరిని ఢిల్లీ క్రైమ్ పోలీసు ఏసీపీ సునీల్ కుమార్ పేరుతో బెదిరించారు. వారిని ఈ కేసు నుంచి తప్పించాలంటే కొంత మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారు రూ.30 లక్షలు చెల్లించడానికి అంగీకారంతో ఎస్‌బీఐ బ్యాంక్ శాఖకు వచ్చారు. తమ సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్స్ (ఎస్‌సీఎస్ఎస్) నుంచి నగదు ఉపసంహరణ, బదిలీకి రావడంతో అక్కడి సిబ్బందికి అనుమానం రావడం, విచారణ చేయగా అసలు విషయం తెలిసింది. బ్రాంచ్ మేనేజర్ నవీన్ కుమార్ ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. పోలీసులతో వారికి అర్థమయ్యేలా చెప్పించారు. తమ రూ.30 లక్షలు దక్కించినందుకు గాను ఆ వైద్య దంపతులిద్దరు ఆ బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో ఇటీవల చంద్రయాన్‌గుట్ట శాఖలోనూ రూ.46 లక్షలు, మహబూబునగర్‌లోనూ రూ.4.20 లక్షల డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల నుంచి అక్కడి సిబ్బంది తమ ఖాతాదారులను రక్షించారు.

కుటుంబ సర్వే 95 శాతం పూర్తి

- వేగంగా కొనసాగుతున్న డాటా కంప్యూటరీకరణ.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మంగళవారం నాటికి 95 శాతం పూర్తయిందని ప్రభుత్వం వెల్లడించింది. సర్వేలో గుర్తించిన 1,17,58,491 నివాసాలకు గాను ఇప్పటి వరకు 1,10,98,360 కుటుంబాల వివరాలు సేకరించినట్టు సర్కార్ పేర్కొంది. ఇంకా 7,04,366 నివాసాల సర్వే సమాచారాన్ని మాత్రమే సేకరించాల్సి ఉందని ప్రభుత్వం ప్రకటించింది. పూర్తి జాగ్రత్తలు తీసుకొంటూ సేకరించిన వివరాలను కంప్యూటరీకరిస్తున్నారు. అత్యధికంగా70.3 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి మూలుగు జిల్లా మొదటి స్థానంలో నిలువగా, 59.8 శాతం సమాచారాన్ని కంప్యూటరీకరించి యాదాద్రి భువనగిరి జిల్లా రెండవ స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వరకు 29,82,034 నివాసాల సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోనూ సర్వే ప్రక్రియ ఉపందుకుందని ప్రభుత్వం పేర్కొంది. 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 20,15,965 నివాసాలలో సర్వే పూర్తయిందని తెలిపింది.

రైతు పండుగను గొప్పగా నిర్వహించాలి

30న మహబూబ్‌నగర్‌కు తరలిరావాలి : మహేష్ కుమార్ గౌడ్ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరగబోయే రైతు పండుగను గొప్పగా నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పన్నెండు నెలల్లో గొప్ప కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో వరంగల్, వేములవాడలో విజయోత్సవాలను నిర్వహించామని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి పార్టీ నేతలతో ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఎవరూ చేయని విధంగా రైతు ఉత్సవం పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. రైతులు, వ్యవసాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు ప్రతి గ్రామంలో రైతులను మహబూబ్‌నగర్ తరలించాలని కోరారు. అక్కడ జరిగే రైతు ఉత్సవాల్లో పెద్దలు చెప్పే కార్యక్రమాలను ప్రజలకు చేరేలా చూడాలని కోరారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ ఇథనాల్ కంపెనీకి టీఆర్ఎస్ ప్రభుత్వం జూలై 7, 2023 అనుమతి ఇచ్చిందన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్ కుమారుడు తలసాని సాయి కిరణ్ యాదవ్ డైరెక్టర్‌గా ఉన్న ఆ కంపెనీకి కేసీఆర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. ఏదో కాంగ్రెస్ ఇచ్చినట్టుగా ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ ఊరెళ్లి చర్చిద్దాం రండి అని బీఆర్ఎస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అక్కడ ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. ఇథనాల్ కంపెనీ విషయంలో పూర్వపరాలు పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాదిపాటు అనేక వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. మహబూబ్‌నగర్‌లో భారీ ఎత్తున వ్యవసాయ ప్రదర్శన ఉందని చెప్పారు. అలాగే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహబూబ్‌నగర్ రైతు సదస్సు పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



హర్యానా స్టీలర్ గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-11లో భాగంగా బుధవారం జరిగిన పోటీల్లో హర్యానా స్టీలర్స్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. షాహిద్ విజయ్ సింగ్ పాఠక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పుణేరి పల్టన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్యానా జట్టు 38-28 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. హర్యానా జట్టులో శివమ్(13) రైడ్స్‌లో రాణించగా.. మహ్మద్రేజ్(5), వినయ్(4) ట్యాకిల్స్‌లో రాణించారు. హర్యానా జట్టు రైడ్స్‌లో నిరాశపరిచినా.. ట్యాకిల్స్‌లో అద్భుతంగా రాణించింది. ఆ జట్టు రెండుసార్లు పుణేరి జట్టును ఆలౌట్ కూడా చేసింది. పుణేరి జట్టులో పంకజ్ మోహిత్(10), ఆకాశ్ షిండే(9) రైడ్స్‌లో రాణించగా.. మోహిత్, సావంత్ ట్యాకిల్స్‌లో మెరిసాడు.

ఆంధ్ర గెలుపు

సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ



హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గోవాతో బుధవారం జరిగిన గ్రూప్-ఇ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గోవా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 154పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 15.4ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఆంధ్ర బౌలర్లు శశికాంత్(2/38), స్టెఫెన్(2/42) రాణించగా.. గోవా బ్యాటర్ సుయాశ్ ప్రభుదేశాయ్(71నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. ఛేదనలో భాగంగా ఆంధ్ర కెప్టెన్ రికీ బుయ్(72), శ్రీకర్ భరత్(52) అజేయ అర్ధసెంచరీలతో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రికీ బుయ్‌కు లభించగా.. వరుసగా రెండో గెలుపుతో ఆంధ్ర జట్టు 8పాయింట్లతో అగ్రస్థానంలోకి ఎగబాకింది.

హైదరాబాద్‌కు మళ్లీ నిరాశ.. :

గ్రూప్-ఎలో హైదరాబాద్ జట్టు వరుసగా మరో ఓటమిని చవిచూసింది. రాజస్థాన్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 24పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 187పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హైదరాబాద్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 167పరుగులే చేసింది. రాజస్తాన్ బ్యాటర్లు కార్తీక్ శర్మ(58) అర్ధసెంచరీకి తోడు దీపక్ హుడా(46) బ్యాటింగ్‌లో రాణించారు. హైదరాబాద్ బౌలర్లు రవితేజ, అంకిత్‌రెడ్డికి రెండేసి వికెట్లు, తిలక్ వర్మకు ఒక వికెట్ దక్కింది. ఇక హైదరాబాద్ బ్యాటర్లు తన్మయ్ అగర్వాల్(33), త్యాగరాజన్(32నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించగా.. తిలక్ వర్మ నిరాశపరిచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కార్తీక్ శర్మకు దక్కింది. దీంతో గ్రూప్-ఎలో హైదరాబాద్ జట్టు మూడు మ్యాచ్‌లు ముగిసేసరికి 4పాయింట్లతో 5వ స్థానంలో కొనసాగుతోంది.

ఆటలు

మళ్లీ ఆ ఫ్రాంచైజీల చెంతకే..

ఐపిఎల్-2025 వేలంలో ఆ ఐదుగురు ఆటగాళ్లు..



రవిచంద్రన్ అశ్విన్

జెడ్డా: సౌదీ అరేబియా వేదికగా 24, 25 తేదీల్లో జరిగిన వేలంలో ఐదుగురు ఆటగాళ్లు మళ్లీ పాత ఫ్రాంచైజీల చెంతకు చేరారు. వీరిలో రవిచంద్రన్ అశ్విన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ట్రెంట్ బౌల్ట్, జోఫ్రా ఆర్చర్, దేవదత్ పడిక్కల్ తదితరులు ఉన్నారు. అరంగేట్రం సీజన్‌లలో వీరు ఆ ఫ్రాంచైజీల తరఫున ఆడినా.. ఆ తర్వాత వివిధ ఫ్రాంచైజీల చెంతకు చేరారు. 2025 ఐపిఎల్ సీజన్ కోసం జరిగిన వేలంలో వీరిని మళ్లీ పాత ఫ్రాంచైజీలు తమ చెంతకే చేర్చుకున్నాయి.

రవిచంద్రన్ అశ్విన్ (చెన్నై సూపర్‌కింగ్స్) :

2025 వేలంలో రవిచంద్రన్ అశ్విన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.9.75కోట్లకు కొనుగోలు చేసింది. అశ్విన్ 2009లో ధోనీ సారథ్యంలో చెన్నై తరఫున ఐపిఎల్‌లో అరంగేట్రం చేశాడు. అరంగేట్రం సీజన్‌లో అశ్విన్ కేవలం 2మ్యాచుల్లో మాత్రమే ఆడాడు. ఆ తర్వాత 2015వరకు చెన్నై ఫ్రాంచైజీలోనే కొనసాగాడు. ఆ ఫ్రాంచైజీ 2010, 2011లో టైటిళ్లను చేజిక్కించుకున్న జట్టులో అశ్విన్ ఓ ఆటగాడు. 2015 తర్వాత పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్ తరఫున ఆడిన అశ్విన్.. మళ్లీ 2025వేలంలో చెన్నై సూపర్‌కింగ్స్ కొనుగోలు చేసింది.

గ్లెన్ మ్యాక్స్‌వెల్(పంజాబ్ కింగ్స్) :



ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తిరిగి పంజాబ్ కింగ్స్ చెంతకు చేరాడు. 2020 తర్వాత పంజాబ్ కింగ్స్‌కు దూరమైన మ్యాక్స్‌వెల్.. నాలుగేళ్ల తర్వాత మళ్లీ జట్టుతో కలిసాడు. 2014 నుంచి 2017వరకు పంజాబ్ కింగ్స్ తరఫున ఆడిన మ్యాక్స్‌వెల్.. 2014 సీజన్‌లో 187.75 స్ట్రయిక్‌రేట్‌తో ఏకంగా 552పరుగులు చేశాడు. గత నాలుగేళ్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడిన మ్యాక్స్‌వెల్.. 2025 సీజన్‌కోసం జరిగిన వేలంలో రూ.4.20కోట్లకు మళ్లీ పంజాబ్ కింగ్స్ వేలంలో కొనుగోలు చేసింది.



ట్రెంట్ బౌల్ట్

జోఫ్రాఆర్చర్

ట్రెంట్ బౌల్ట్ (ముంబయి ఇండియన్స్) :

న్యూజిలాండ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ మళ్లీ ముంబయి ఇండియన్స్ దక్కించుకుంది. 2020వరకు ముంబయి ఇండియన్స్‌కు ఆడిన బౌల్ట్.. 2021 సీజన్ నుంచి 2024 వరకు రాజస్థాన్ రాయల్స్‌కు ఆడాడు. 2020 సీజన్‌లో 15మ్యాచుల్లో 25వికెట్లు తీసిన బౌల్ట్.. ముంబయి జట్టు టైటిల్ చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. 2025 సీజన్‌కోసం జరిగిన వేలంలో బౌల్ట్‌ను ముంబయి ఇండియన్స్ రూ.12.50కోట్లకు దక్కించుకుంది. జస్ప్రీత్ బుమ్రాతో కలిసి రాబోయే సీజన్‌లో అతడు పేస్ భారాన్ని మోయనున్నాడు.

జోఫ్రా ఆర్చర్ (రాజస్తాన్ రాయల్స్) : ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి రాజస్థాన్ రాయల్స్ వేలంలో దక్కించుకుంది. 2018 నుంచి 2020వరకు రాజస్తాన్ తరఫున ఆడిన ఆర్చర్.. మూడు సీజన్లలో కలిపి మొత్తం 46వికెట్లు పడగొట్టాడు. 2020 సీజన్ ఒక్కదానిలోనే ఆర్చర్ 14 మ్యాచుల్లో 20వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 2021, 22 సీజన్‌లలో గాయం కారణంగా ఐపిఎల్‌కు దూరం కాగా.. 2023 సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఆడాడు. ఐదు మ్యాచుల్లో ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు. ఆ తర్వాత ఐపిఎల్‌కు దూరంగా ఉన్నాడు. తాజా వేలంలో రాజస్తాన్ రాయల్స్ రూ.12.50కోట్లకు తిరిగి కొనుగోలు చేసింది.

దేవదత్ పడిక్కల్ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) :



ఎడమచేతి వాటం స్టార్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను ఈసారి వేలంలో రూ.2కోట్లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. 2020 సీజన్‌లో బెంగళూరు తరఫున ఆడిన పడిక్కల్ 473పరుగులు చేసి రాణించాడు. 2021లో ఒక సెంచరీతో కదం తొక్కాడు. ఆ తర్వాత 2022, 2023 సీజన్‌లలో రాజస్తాన్ రాయల్స్‌కు, 2024లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఆడిన పడిక్కల్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. గత సీజన్‌లో ఏడు మ్యాచుల్లో కేవలం 38పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. దీంతో బెంగళూరు ఫ్రాంచైజీ మరోసారి అతడి ప్రదర్శనను ఆధారంగా తీసుకొని తిరిగి వేలంలో కొనుగోలు చేసింది.

డింగ్‌కు గుకేశ్ ఝలక్

మూడోరౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్ ఓటమి



సింగపూర్: ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మూడోరౌండ్‌లో గుకేశ్ విజయం సాధించాడు. బుధవారం జరిగిన మూడోరౌండ్ గేమ్‌లో గుకేశ్ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించాడు. తెల్లపావులతో మూడోరౌండ్‌లో ఆడిన గుకేశ్ 37ఎత్తుల తర్వాత విజయం సాధించాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్‌లో తెల్లపావులతో ఆడిన గుకేశ్ ఓటమిపాలవ్వగా.. మూడోరౌండ్‌లో తెల్లపావులతో ఆడి గుకేశ్‌ను చిత్తుచేయడం విశేషం. తొలిరౌండ్‌లో ఫ్రెంచ్ గేమ్‌ను ఎంచుకున్న గుకేశ్.. ఆ గేమ్‌లో పరాజయాన్ని చవిచూశాడు. గుకేశ్ డి-4తో గేమ్‌ను ప్రారంభించగా.. డింగ్ ఎన్ఎఫ్-6తో గేమ్‌ను మొదలుపెట్టాడు. ప్రపంచ టైటిల్‌కోసం ఇరువురు 14రౌండ్‌లపాటు తలపడనున్నారు. 7.5పాయింట్లు సాధించిన ఆటగాడికి విజయం దక్కనుంది. ఇక మూడోరౌండ్ ముగిసిన అనంతరం ఇరువురు 1.5-1.5పాయింట్లతో సమంగా ఉన్నారు. 2022లో చైనాకు చెందిన డింగ్ లెరెన్ రష్యాకు చెందిన నెపోంనిచ్చిని ఓడించి టైటిల్‌ను చేజిక్కించుకొన్నాడు.

దీక్ష దివాస్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఈనెల 29న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించను న్న దీక్ష దివాస్ కార్యక్రమ నిర్వహణపై అబిడ్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దీక్షదివాస్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోదీక్ష దివస్ కార్యక్రమ ఇన్‌చార్జీ ఎం ఎస్. శ్రీనివాస్ , గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆశిష్ కుమార్ యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాక్‌లో సినీ టెక్నాలజీ అండ్ సాఫ్ట్‌వేర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో సినీటెక్నాలజీ అండ్ సాఫ్ట్‌వేర్ కోర్సులను ప్రారంభించారు. హైస్కూల్ ఎడ్యుకేషన్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని బుధవారం న్యాక్ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య తెలిపారు. న్యాక్‌లో ముఖ్యంగా సినిమాటోగ్రఫీ మాస్ట్రీ, సౌండ్ రికార్డింగ్ మాస్ట్రీ, వీడియో ఎడిటింగ్ మాస్ట్రీ, డిజిటల్ డిజైనింగ్ అండ్ సోషల్‌మీడియా మేనేజ్ మెంట్, ప్రొడెక్షన్ మేనేజ్‌మెంట్, హ్యాంకరింగ్ అండ్ ఈఎంసీఈఈఈ, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్స్, మ్యూజిక్ ప్రొడెక్షన్ మాస్ట్రీ, ప్రొఫెషనల్ సింగింగ్‌తోపాటు తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. న్యాక్‌లో హాస్టల్‌తోపాటు క్యాంటీన్ సదుపాయం ఉందన్నారు. కోర్సుల కాలపరిమితి 3నెలలని, డిసెంబర్ నుంచి ప్రారంభించన్ను ఈ కోర్సులకు రూ.35వేల ఫీజుచెల్లించాల్సి ఉంటుంద న్నారు. కోర్సులో చేరడానికి ఆసక్తిగల అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9676287287 ఆన్‌లైనో సంప్రదించాలని కోరారు.

'ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన డీజేఎస్ ప్రెసిడెంట్ బొజ్జ రమేష్'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం దళిత జన సమితి (డీజేఎస్) రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, దళిత జన కార్మిక విభాగం (డీజేకేవీ) రాష్ట్ర ఇంచార్జి బొజ్జ రమేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొజ్జ రమేష్, సమితి నాయకులు కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రజా సమస్యలపై మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత జన సమితి ఉప్పల్ నియోజకవర్గం మైనార్టీ సెల్ ఇన్‌చార్జి సయ్యద్ మజీద్, నాయకులు ఇప్పల కుమార్, గంధం కళ్యాణ్, సంజయ్, రవి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

లింగ నిర్ధారణ ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-366

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

లింగ నిర్ధారణ ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-3366 ఏర్పాటు చేసినట్టు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లాలోని హాస్పిటల్స్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గర్భస్థ పిండ ప్రక్రియ లింగ నిర్ధారణ చట్టంపై (జిల్లాస్థాయి బహుళ సభ్యుల సముచిత అధికార కమిటీ) జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొని జిల్లా కలెక్టర్లింగ నిర్ధారణ ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-3366ను ప్రారంభించారు. అనంతరం ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య, ఆరోగ్య అధికారుల కరదీపికను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టోల్ ఫ్రీ నెంబర్ ఫ్లెక్సీని ప్రతి అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో డేకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న హాస్పిటల్స్‌కు చెక్ లిస్ట్ పెట్టి మార్కులు ఉన్న హాస్పిటల్స్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తెలిపారు. లింగ నిష్పత్తిపై సెన్సిటైజేషన్ కార్యక్రమం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిర్వహించాలని సూచించారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్టులకు పీసీ అండ్ డీటీ చట్టం నియమాలపై ఓరియంటేషన్ శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలోని ఆస్పత్రులు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిస్తే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-3366 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. లింగ నిర్ధారణపై సోమవారం నుంచి శనివారం వరకు కార్యాలయ పని వేళలల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. లింగ నిర్ధారణ ఫిర్యాదుల టోల్ ఫ్రీ నెంబర్ జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లలో ప్రదర్శించాలని కలెక్టర్ డీఎంహెహెచ్ఓను ఆదేశించారు. డిసెంబర్ నెలలో జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్ల పనితీరును, తనిఖీ పర్యవే క్షించుటకు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేయాల న్నారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో లింగ నిష్పత్తి, లింగ వివక్షతపై అవగాహనా సదస్సులను ప్రణాళికతో మార్చి 2025 వరకు నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో తనిఖీ సమయంలో నిర్దిష్ట ప్రశ్నావళి వంద మార్కులకు తయారుచేసి గ్రేడింగ్ విధానం అమలు చేయాలని, పాటించని స్కానింగ్ సెంటర్ల వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్ రెన్యువల్, కొత్తవి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసిన 78 స్కానింగ్ సెంటర్‌లకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వెంకటాచారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.అరుణకుమారి, అడిషనల్ డీసీపీ జి.మనోహర్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జె.వెంకటి, డీపీఆర్ఓ కలీం, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ పి.జయమాలిని, డాక్టర్ అంజయ్య, యాక్షన్ ఎయిడ్ ఎన్జీవో సంస్థ ప్రతినిధి వందన, మాస్ మీడియా అధికారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

'పోటు ప్రసాద్ మరణం కార్మికవర్గ సమాజానికి తీరని లోటు'



- ఏఐటీయూసీ సంతాపం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఏఐటీయూసీ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, ప్రస్తుత సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్న పోటు ప్రసాద్ ఖమ్మంలో గుండెపోటుతో మృతి చెందడం ప్రజాస్వామ్య శక్తులకు, కార్మికవర్గానికి తీరని లోటని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ అన్నారు. బుధవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో పోటు ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటు ప్రసాద్ చిన్నతనం నుండి విద్యార్థి ఉద్యమంలో, కార్మికోద్యమంలో పని చేసి ఎంతో మంది పేదలకు, సహాయం అందించారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నిర్మాణంలో వారు అనేక సలహాలు, సూచనలు చేసి కార్మికోద్యమ నిర్మాణానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనునిత్యం పేద ప్రజల అభివృద్ధికి ఎన్నో పోరాటాలు నిర్వహించారని ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పార్టీ అభివృద్ధికి, పార్టీ నిర్మాణానికి ఆయన కృషి కొనియాడదగిందన్నారు. పోటు ప్రసాద్ మరణం రాష్ట్రంలో కార్మికవర్గ పార్టీలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమారాజేష్ ఖన్నా, బాలసుబ్రమణ్యం, సబ్బు రాజ మౌళి, చెట్టుక్రింది శ్రీనివాస్, ఆఫీసు సెక్రెటరీ జె.వి.కృష్ణ, పి.జగన్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానలో సమస్యలుంటే మా దృష్టికి తేవాలి

- గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

బస్తీ దవాఖానలో కావాల్సిన సదుపాయాల కొరత ఏదైనా ఉంటే తమ దృష్టికి తేవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సిబ్బందికి సూచించారు. అంటు వ్యాధులు, జ్వరాలతో ఇబ్బందిపడి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన చికిత్సలు పొందలేని పేద ప్రజల కొరకు ఏర్పాటు చేసిన బస్తీ దవా ఖానాల్లోని పరిస్థితులను, చికిత్స కొరకు వచ్చే రోగులకు అందుతున్న సౌకర్యా లపై గాంధీనగర్ డివిజన్‌లోని బస్తీ దావఖానాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు. విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవళికను కలిసి వైద్యపరీక్షల విధానాలపై వివరాలను తెలుసుకున్నారు. బస్తీ దవాఖానలో కావాల్సిన సదుపాయాల కొరత ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని సమకూర్చేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్, సంయుక్త రాణి, దవాఖాన నర్సు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను త్వర్గా పూర్తి చేయాలి

- సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని జాంబవి నగర్‌లో ప్రేయర్ పవర్ చర్చ్ వీధిలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని వెంటనే సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, దీన్ దయాల్ రెడ్డి, శివ ముదిరాజ్, జిహెచ్ఎంసి అధికారులు సన్నీ, మురళి, దాస్ నాయక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

29 నుంచి మూడురోజుల పాటు హైదరాబాద్ ఫెస్ట్ టాలెంటో 24 ఈవెంట్



నవతెలంగాణ-ధూల్‌పేట్

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు హైదరాబాద్ ఫెస్ట్, టాలెంటో 24 ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామని గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ బాధ్యులు నేహా గులాం, ఉజ్మా, అస్ఫియా ఆనమ్ లు తెలిపారు. బుధవారం గన్ ఫౌండ్రీలో జరిగిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడుతూ నవంబర్ 29,30, డిసెంబర్ 1తేదీల్లో జరిగే ఈవెంట్‌లో అమ్మాయిల కోసం పలు రకాల పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతలుంటాయని తెలిపారు. ఈవెంట్‌లో విజ్ఞానాన్ని పెంపొందించే పలు రకాల కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పాశ్చాత్య సంస్కృతి దుష్ప్రభావాల నుండి చైతన్యం కల్పించి, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించే ప్రధాన ఉద్దేశంతో ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం స్త్రీలు, యువతుల కోసమే ప్రవేశం ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం



నవతెలంగాణ-ధూల్‌పేట్

75వ భారత రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గోషామహల్ చుడీ బజార్ డాక్టర్ అంబేద్కర్ లోహియా ఫంక్షన్ హాల్‌లో మాదిగ బంధు మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వెంకటేష్, అనిల్ కుమార్, యాదయ్య, ధర్మేందర్, ప్రేమ్ కుమార్, రాజు, ఆర్.సుమన్ కుమార్ ప్రతినిధి బృందంతో కలిసి డాక్టర్ అంబేద్కర్ చిత్ర పటానికి పులమాలవేసి నివాళి అర్పించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కుల, మతాలకతీతంగా నిర్మించిన భారత రాజ్యాంగం, వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సొసైటీ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సొసైటీ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉప్పుగూడ ధనరాజ్ ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ఉత్సవాలను అర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు... రాజ్యాంగ దినోత్సవం విశిష్టతపై పలువురు ప్రసంగించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ మాదిగ వ్యవస్థాపక అధ్యక్షులు మిర్ జుమ్లా ముత్యాలు, ప్రధాన కార్యదర్శి పార్వతి నరేష్ బాబు, కోశాధికారి వగ్గు సురంజన్, సంయుక్త కార్యదర్శి పడికంటి సతీష్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వరాష్ట్ర సాధనలో కీలక ఘట్టం దీక్ష దివాస్

- పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేస్తాం
- ఎమ్మెల్యే ముఠాగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక ఘట్టం దీక్షా దివాస్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్‌లోని లలిత నగర్ కమ్యూనిటీ హాల్‌లో దీక్షా దివాస్ కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రాణాలకు తెగించి ప్రత్యేక తెలంగాణ సాధన లక్ష్యంగా 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు కాబట్టి 29వ తేదీన దీక్షా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో నింపాలని పిలుపునిచ్చారు. దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని గుర్తు చేశారు. స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచి పోయే శుభదినం. ఆనాడు కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో అని తెగువ కనబరిచిన నాయకుడికి 3 కోట్ల మంది ప్రజలు ముక్తకంఠంతో అండగా నిలబడ్డారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి.. కులాలకు మతాలకు అతీతంగా అందరినీ కలిపిన సందర్భం దీక్షా దివస్' అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి దాదాపు 2000 మంది కార్యకర్తలతో రాంనగర్ చౌరస్తా వద్దగల అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి ర్యాలీగా వెళ్లి విజయవంతం చేస్తామని తెలిపారు. స్వరాష్ట్ర సాధనకు అమరులైన ప్రతి ఒక్క అమర వీరులకు ఈ కార్యక్రమం ఘన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్, డివిజన్ ల ప్రెసిడెంట్లు వై శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, కొండ శ్రీధర్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్ యాదవ్, సీనియర్ నాయకులు దీన్ దయాల్ రెడ్డి,నేత శ్రీనివాస్ ,సత్యనారాయణ, టైలర్ శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'రాజ్యాంగం' గురించి ప్రతి వ్యక్తీ తెలుసుకోవాలి

- మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మాస్త దయానంద్



నవతెలంగాణ-ముషీరాబాద్

భారత రాజ్యాంగంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కొరకు ఉన్నటువంటి ఆర్టికల్స్ గురించి ప్రతి ఒక్క వ్యక్తి తెలుసుకోవాలని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మాస్త దయానంద్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హాలో మాల చలో పరేడ్ గ్రౌండ్‌లో భాగంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ జవహర్ నగర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మాస్త దయానంద్ మాట్లాడుతూ బాబాసాహెబ్ రచించిన భారత రాజ్యాంగంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కొరకు ఉన్నటువంటి ఆర్టికల్స్ గురించి ప్రతి ఒక్క వ్యక్తి తెలుసుకుని వాళ్ల హక్కులను సాధించుకునే ఉద్యమాలు చేయాలని చెప్పి అవే బాబాసాహెబ్ అంబేద్కర్‌కు మనం అర్పించినటువంటి నిజమైన నివాళులన్నారు. ఈ కార్యక్రమంలో మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు తల్ల మల్ల కాశీనాథ్(సురేందర్), మాల మహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్, మన్నె శ్రీధర్, దళిత హక్కుల రక్షణ సంఘం అధ్యక్షురాలు బొనగిరి మంగ, కే.రమేష్, నాగేల కృష్ణ, వెంకటేష్, యాదగిరి, నిరుడు నర్సింగరావు, లక్ష్మణ్ రావ్, ఎన్.రవీందర్, ఎన్‌వీఎస్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్, సదానంద్, వాళ్మమల్ల శ్రీనివాస్, బాల్వాంత్, బాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్‌లో జరుగు మాలల సింహగర్జన జయప్రదం చేయాలని కరపత్రాన్ని విడుదల చేశారు.

రెండు సంవత్సరాల వయస్సు నుంచే షుగర్, లివర్ వ్యాధితో బాధపడుతున్న రితిక్

బిడ్డ ప్రాణం కోసం తల్లిదండ్రుల ఆరాటం, ఆదుకోవాలని సీఎం ఎ.రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం కోరుతున్న పేద కుటుంబం




నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రెండు సంవత్సరాల చిరుప్రాయం లోనే షుగర్, లివర్ వ్యాధితో బాధపడుతున్న తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డికి విన్నవించిన బాధితులు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం, బాబాపూర్ గ్రామానికి చెందిన బాధితుడి తల్లి అనూష మాట్లాడుతూ తన కుమారుడు రితిక్ రెండు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడే అధిక షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. షుగర్ వ్యాధికి చికిత్స అందిస్తుండగానే లివర్ సమస్యకు గురి కావడం జరిగిందన్నారు. దీంతో గత 5ఏండ్లుగా అపోలో ఆస్పత్రి, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలోజీలో చికిత్స అందిస్తున్నామన్నారు. నిత్యం ఇన్సులిన్ ఇంజక్షన్లు, మందులు వాడటం జరుగుతుందన్నారు. దీనికి గాను ప్రతి నెలా వైద్య పరీక్షలు, ఇన్సులిన్ ఇంజక్షన్లు, మందులకు రూ.20 వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. ఇప్పటి వరకు తమ దగ్గర ఉన్న ఇంటిని అమ్ముకుని చికిత్సకు వెచ్చించామన్నారు. బాధితుడు రితిక్ తండ్రి ఆటో డ్రైవర్ అని ప్రస్తుతం తమ అబ్బాయికి వైద్యానికి అయ్యే వ్యయాన్ని భరించే స్థితిలో లేమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకున్న ముగ్గురు పిల్లల్లో మొదటి అబ్బాయి రితిక్‌ను కాపాడుకోవ డానికి వైద్యానికి అయ్యే వ్యయం తమ శక్తికి మించిపోయిందన్నారు. కడు పేదలమైన తమ అబ్బాయికి అయ్యే వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించి ఆదుకోవాలని ఆమె సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు. లేదంటే నెలకు వైద్య ఖర్చులకు గానూ ఆర్థిక సహాయాన్ని అందించాలని వేడుకు న్నారు. పెద్ద మనసున్న దాతలు ఎవారైనా వైద్య ఖర్చులకు సహాయం చేయాలని వేడుకున్నారు. ఈ ఫోన్ నెంబర్: 9652335696 గూగుల్ పే/ఫోన్ పే ద్వారా సహాయం అందించాలని ఆమె అర్థించారు.

'మా ఆస్తిపై కన్నేసిన జాయింట్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

- మా కుటుంబానికి ప్రాణహాని ఉంది, రక్షణ కల్పించండి
- సీఎం ఎ.రేవంత్ రెడ్డికి బాధిత దంపతులు పాణెం ఉజ్వల, మహేష్ విజ్ఞప్తి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తమ ఆస్తిపై కన్నేసిన జాయింట్ కమిషనర్, సేల్స్ టాక్స్ (నాంపల్లి) వాసవి జగన్నాథం, ఆమె భర్త రామగుండం పోలీస్ కమిషనర్ మిట్టె శ్రీనివాసులు తమ కుటుంబాన్ని కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత దంపతులు పాణెం ఉజ్వల, మహేష్‌లు ఆరోపించారు. వెంటనే వారిపై రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎరుకల హక్కుల పోరాట సమితి ఏపీ అధ్యక్షులు ఎస్.మోహన్ కుమార్ ధర్మతో బాధితులు పాణెం ఉజ్వల, భర్త మహేష్‌లు కలిసి మాట్లాడుతూ వరుసకు పిన్ని అయ్యే వాసవి, ఆమె భర్త మిట్టె శ్రీనివాసులు ఈ నెల 20న తాము నివసిస్తున్న కోకాపేటలోని కాంప్లెక్స్‌లోకి తప్పుడు సమాచారం ఇచ్చి చొరబడి తమ కుటుంబాన్ని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని ఆమె చెప్పారు. నలుగురు వ్యక్తులతో కలిసి తమ ఫ్లాట్ బి-బ్లాక్ 101లోకి చొరబడి తన భర్త మహేష్‌ను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించడంతో డయల్ 100కు కాల్ చేయడం జరిగిందని ఆమె చెప్పారు. వెంటనే పోలీసులు మీడియా సహకారంతో నా భర్తను విడిచి పెట్టారని ఆమె తెలిపారు. మరుసటి రోజు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఐనప్పటికీ వారం రోజులు గడుస్తున్న ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని వెల్లడించారు. వెంటనే తమ పిన్ని వాసవి, బాబాయ్ మిట్టె శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వారి నుండి తమ కుటుంబానికి ప్రాణభయం ఉందని, అందుకే తమకు రక్షణ కల్పించాలని వారు రాష్ట్ర డీజీపీ, సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కోరారు.

'న్యాయ స్థానాల్లో వ్యాజ్యాలు వేయడం సామాజిక అన్యాయం'

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృపాకర్ మాదిగ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణకు వ్యతిరేకంగా కొందరు మాలలు ఉన్నత న్యాయ స్థానాల్లో వ్యాజ్యాలు వేయడం అనేది సామజిక అన్యాయమని, ఇది అంబేద్కర్ సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృపాకర్ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఆందోళనలు, వితండ వాదనలు సాంఘిక ఉగ్రవాదమేనని స్పష్టం చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు చింత స్వామి మాదిగతో ఆయన కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై వేసిన సబ్ కమిటీని అధికార పార్టీ ఎమ్మెల్యేలే వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆమోదించిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో చలో ఢిల్లీ మాలల గర్జన కార్యక్రమానికి పిలుపునివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. డిసెంబర్ 14 లోగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ముందు మాదిగ, ఇతర ఎస్సీ-ఎ, బీ గ్రూపుల కులాల ప్రతినిధులు, వ్యక్తులు పిటిషన్ దాఖాలు చేయాలని పిలుపునిచ్చారు. మాలలను రెచ్చగొట్టి ప్రభుత్వానికి వ్యతి రేకంగా కాంగ్రెస్‌కి చెందిన ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి, మాల ఎమ్మెల్యేలతో కలిసి కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో వీరికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి రమణ, పులిజాల గెల్వయ్య, నాగారం అంజయ్య, మురళీ, మంగేష్, దుబ్బాక సుభద్ర, బొల్లం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గంకు చెందిన లబ్ధిదారులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ క్యాంప్ ఆఫీస్‌లో నాంపల్లి మండల తహసీల్దార్ ఎం. ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే టి. రాజాసింగ్ చేతులమీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 147 చెక్కు లో కళ్యాణలక్ష్మి పథకంలో 99 మంది, షాదీముబారక్ పథకంలో 48 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగిందని తహసీల్దార్ ఎం. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, గిర్దావర్ అశ్విన్ కుమార్, అశోక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఇంట్లో నుండి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ పరిధి స్థానిక ప్రాంతానికి చెందిన గోవింద్ కూతురు లత(16) ఈ నెల 25న ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్ళింది. సాయంత్రం ఎంతకీ తిరిగి రాకపోవ డంతో స్థానికంగా, బంధు మిత్రుల, రక్త సంబంధికులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

8

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

గురువారం | నవంబర్ 28, 2024 | www.navatelangana.com



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్న జగదీశ్వర్ రెడ్డి కుతూరు రుత్విక రెడ్డి-అజిత్ రెడ్డి వివాహానికి జవహర్‌నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. వారి తోపాటు కార్పొరేటర్లు చింతల ప్రేమల శ్రీనివాస్, గొడుగు వేణు, పల్లపు రవి, కూతాడి సాయి, కో ఆప్షన్ సభ్యులు శ్వేతా ముఖేష్, నాయకులు మనోధర్ రెడ్డి, మెట్టు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-జవహర్‌నగర్



ఆల్వాల్ 133వ డివిజన్ మచ్చబోలారం కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ నేతృత్వంలో సిటిజన్స్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో డీసీ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. కాలనీలోని రోడ్ల పరిస్థితి, పార్కు అభివృద్ధి, చిల్డ్రన్ ప్లే ఏరియా ఏర్పాటు, రోడ్డుపై ఆక్రమణలతో సహా వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్ డీఈ, ఎంహెచ్ఓ డాక్టర్ రాజిని, రమేష్ మేనేజర్, ప్రభాకర్ ఎస్ఎస్, రవళి ఏఈ, మహేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎఫ్ఏ. కాలనీ ప్రెసిడెంట్ రాము, సెల్వరాజ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. నవతెలంగాణ ఆల్వాల్

కామ్రేడ్ బ్రహ్మాచారి మరణం పార్టీకి తీరని లోటు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేష్

నవతెలంగాణ-జవహర్‌నగర్



కామ్రేడ్ సంకోజ్ బ్రహ్మాచారి అకాల మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.బాల మల్లేష్ అన్నారు. బుధవారం జవహర్ నగర్ పరిధిలోని సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న సంకోజ్ బ్రహ్మాచారి రాత్రి గుండెపోటుతో చనిపోవడం బాధాకరమని, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరము పోరాడాడని కొనియాడారు. ఆయన మృతికి తీవ్ర సంతాపము తెలియజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ దశరథ్, తోటపల్లి శంకర్, దర్శనం యాదగిరి, సహదేవ్, ఎస్.కె.మీరా, నాగేశ్వరమ్మ, ఎస్కే మస్తాన్ బి, మల్లిక, పి నరసింహ, డి జంగయ్య, ఎన్.నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని ఆండాల్ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌళిక వసతుల కలపనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆండాల్ నగర్ సీసీ రోడ్డుతో స్థానిక వాసుల బాధలు తీరిందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ప్రకాష్, దాసంజి, ఉడుత నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని హోంగార్డు ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఘట్‌కేసర్

ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఓ హోంగార్డు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. చర్లపల్లి హోంగార్డు మహమ్మద్ గని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఎదులాబాద్‌లో సర్వేనెంబర్ 258, 268 గల తన 30 గుంటల భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు హద్దురాలు తొలగించారని, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసులు అడ్డుకున్నారు.



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా చర్లపల్లి డివిజన్‌లోని రెడ్డి కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఇంటి వద్ద అధికారులు సర్వే నిర్వహించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సమగ్ర కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అంశాల వివరాలను సేకరిస్తారు. ఇది అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. నవతెలంగాణ-చర్లపల్లి



పోచారం మున్సిపల్ పరిధిలో బుధవారం కొర్రేములలో రుక్మిణి పాండురంగ స్వామి కళ్యాణంలో స్వామి వారికి మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి శైలజ పట్టు వస్త్రాలను సమర్పించరు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు మాజీ సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్, గంప విశ్వ నాదం, చిలుగురి సత్యనారాయణ, మహేంద్ర చారి, విశ్వేంద్ర చారి, నరేష్, శ్రీకాంత్, అమర్, సతీష్, వాసుదేవ శర్మ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నవతెలంగాణ-పోచారం

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కాలేజీలను అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా (స్కిల్లింగ్ సెంటర్లు) తీర్చిదిద్దే దిశగా మేడ్చల్ ఐటీఐ కాలేజీలో నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పరిశీలించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తవ్వాలని ఛీఫ్ ఇంజినీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ



సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫ్లోరింగ్, సీడింగ్, ఎలక్ట్రిక్ వర్క్స్, విండోస్, పార్టిషన్ వంటి నిర్మాణ పనులు పూర్తవ్వడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్‌లలో 6 ట్రెడింగ్ విభాగాలకు గాను గదులను నిర్మించి మిషినరీ స్థాపించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, ఎలివేషన్, స్లాబ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఛీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్, మేడ్చల్ తహశీల్దార్ శైలజ, మున్సిపల్



కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీడీఓ సంపూర్ణ, సంబంధిత అధికారులు ఉన్నారు.

అన్ని బీసీ కులాలకు సమ ప్రాధాన్యత నివ్వాలి



- బీసీల చైతన్యమే లక్ష్యంగా కులాలకతీతంగా పోరాటం
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రభుత్వానికి బీసీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే 70 శాతం ఉన్న బీసీలకు 50 శాతం రిజర్వేషన్ పరిమితం ఎందుకు చేస్తుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సమీక్షించాలని బీసీ కులాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను కూడా ఎంతోమంది మేధావులతో చర్చలు జరిపి, పలు అంశాలపై సంపూర్ణ అవగాహనతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని బీసీ కులాలకు సమ ప్రాధాన్యతను ఇవ్వాలని, బీసీల చైతన్యమే లక్ష్యంగా, కులాల కతీతంగా పోరాటం చేస్తానని, ఈ విషయంపై బీసీ గొంతుకను శాసనసభ ద్వారా ప్రభుత్వానికి వినిపించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాస్తానన్నారు. అన్ని కులాల సంఘాలు వారి అభిప్రాయాలను, వారి సమస్యలను తెలియజేస్తూ వినతి పత్రాలను ఇవ్వాలని కోరారు. భారత రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకొని మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని బీసీ కులాల నాయకులతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీల పక్షాన మాట్లాడడం గర్వంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన విధి విధానాలను 2001వ సంవత్సరం జరిపిన జనగణన, సుప్రీం కోర్టు మార్గదర్శకాలను ఆధారంగా బీసీల రిజర్వేషన్ యాభై శాతానికి మించరాదని గెజిట్‌లో పొందుపరచిన అంశాన్ని సమావేశం దృష్టికి తెచ్చారు. బీసీ కులగణన సర్వేను ప్లానింగ్ కమిషన్ ద్వారా నిర్వహించడంతో రాజకీయ పరమైన సమస్యలు తలెత్తుతాయని, ప్రత్యేక విభాగంతో కులగనన చేయించాలని, లేకపోతే చాలా వరకు రాజకీయ ప్రాతినిధ్యం లేని కొన్ని బీసీ కులాలకు అన్యాయం జరుగుతుందని, ఇప్పటికే చాలా బీసీ కులాలను గుర్తించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ద్వారా కూడా కులగణన నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కూడా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని తెలిపారు.

కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ...

రాష్ట్రంలో ఒక్క రెడ్డి నాయకుడు బీసీలను అనచివేసేందుకు రాజకీయ కుట్ర చేస్తున్న సమయంలో మల్కాజిగిరి నియోజకవర్గంలో రెడ్డి ఎమ్మెల్యే బీసీల పక్షాన పోరాటం చేస్తున్నాడంటూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేస్తున్న పోరాటానికి మద్దతు తెలియజేశారు. ఎంతోమంది ఎమ్మెల్యేలను చూసిన ఈ సారి మల్కాజిగిరి గడ్డ మీద బీసీల పక్షాన నిలిచిన ఏకైక నాయకుడు మన రాజన్న అని, అంతే కాకుండా మల్కాజిగిరి బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డిపై పాట పాడి తన అభిమానం చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల రాష్ట్ర స్థాయి, కేంద్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్, అన్ని రాజకీయ పార్టీల బీసీ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని జేకే కాలనీలో బుధవారం రూ. 1.2 కోట్ల వ్యయముతో నూతన బాక్స్ డ్రయినేజీ పనులను కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కాలనీ వాసులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. ఈ ప్రాంతం ప్రజలు వర్షం నీటి ముంపుకు ప్రతి ఏట గురవ్వడం చూసి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ అధికారులతో ప్రతిపాదనలు పెట్టించి శాంక్షన్ చేయించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్‌కి వీలైనంత త్వరగా, నాణ్యతా పరిణామాలు పరిస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు అనంతరం బండ చెరువు వాకింగ్ ట్రాక్‌పై ఉన్న పలు సమస్యలను కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి దృష్టికి స్థానికులు తీసుకుపోగా వెంటనే స్పందించిన కార్పొరేటర్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్క్‌కు ఎంట్రెన్స్ మరమ్మత్తులు, టాయిలెట్లు, శుభ్రతానిర్వహణ, వాహనాల పార్కింగ్, స్ట్రీట్ లైట్స్ సమస్యలను, పరిష్కరించే విధముగా చూడాలని, సమస్యలను అన్ని శాఖలతో చర్చించి, ప్రాంగణ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు ఉంచి, వీలైనంత త్వరగా మంజూరయ్యేలా ప్రయత్నం చేస్తానని, వాకర్స్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు నవీన్, ధర్మేశ్ యాదవ్, భార్గవ్ గౌడ్, సాయి, సురేష్, లత, ఝాన్సి పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నాగరాజు, దీపక్, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, ఉడత నవీన్, శ్రీకాంత్ యాదవ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కిష్టయ్య వర్ధంతిని విజయవంతం చేయాలి

- వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ముదిరాజ్ మహాసభ నాయకులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



తెలంగాణ సాధన మలిదశ ఉద్యమములో, తొలి అమరుడు, పుట్టకొక్కుల(పోలీస్)కిష్టయ్య 15వ వర్ధంతిని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ నాయకులు కోరారు. మౌలాలి డివిజన్ పరిధిలోని భరత్ నగర్ చౌరస్తాలో బుధవారం మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చెరుకు సాంబరాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు దొంతర బోయిన కృపాసాగర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రచార కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి ముదిరాజ్, కొరవి కృష్ణ స్వామి, సేవా సమితి మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు శివంది యాదగిరిలు పాల్గొని మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దొంతరబోయిన కృపసాగర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమములో పోలీస్ కిష్టయ్య ప్రాణ త్యాగం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, తను పోలీస్ ఉద్యోగం చేస్తు భార్య పిల్లలను పోసించే శక్తి ఉన్న, ఉమ్మడి రాష్టంలో తెలంగాణ ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులను చూసి ప్రత్యేక రాష్ట్రమే మన అభివృద్ధికి శ్రీరామరక్ష అని భావించి ప్రాణత్యాగానికి సిద్ధపడి తన పోలీస్ డ్యూటీని, భార్య పిల్లలను వదిలేసి తెలంగాణ ప్రజల సంక్షేమ కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణత్యాగమే సరియైన పరిస్కారమని భావించి కామారెడ్డి మెయిన్ సెంటర్లో (బిఎస్ఎన్ఎల్) టవర్ పైకెక్కి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆ తరువాత తెలంగాణ సాధన ఉద్యమం తీవ్రతరం అయ్యి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదన్నారు. కుటుంబ పరంగా తీవ్రంగా నష్టపోయిన తన భార్య పిల్లలకు ప్రజా పోరాటాలతో వారికీ ప్రభుత్వ ఉద్యోగాలు, కుమార్తె మెడిసిన్ ఎంబిబిఎస్ చదువుకుని డాక్టర్‌గా ఉద్యోగం ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కుటుంబానికి బాసటగా నిలుస్తు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ ముదిరాజ్ మహాసభ సమక్షంలో డిసెంబర్ 1 వ తేదీన తెలంగాణ అసెంబ్లీ దగ్గర ఘన్ పార్క్ వద్ద 15 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసన మండలి ఎమ్మెల్సీ డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ముదిరాజ్ సంఘం, నాయకులు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. ముదిరాజ్ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని వర్ధంతి వేడుకలు విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్య క్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కటికల బిక్షపతి ముదిరాజ్, శివంది ఆంజనేయులు ముది రాజ్, మల్లేష్ ముదిరాజ్, కనకయ్య ముదిరాజ్, రాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

- కీసర సీఐ వెంకటయ్య

నవతెలంగాణ-కీసర



గ్రంథాలయంలోని పుస్తకాలు ఎంతో మందికి విజ్ఞానాన్ని పంచే బండగారాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కీసర మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పుస్తక ప్రదర్శన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఆయర హాజరైయారు. హైదరాబాద్ రీజనరల్ ఆర్డినేటర్ ఆదిత్యవర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లోని పుస్తకాల పఠనం ద్వారా ఎంతో మేధస్సును పొందవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదువుకుంటే జ్ఞానవంతులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పిన్సిపాల్ మహాలక్ష్మి, లైబ్రేరియన్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనీ విటమిన్ పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఉప్పల్

తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్, తెలుగు అసెట్స్ ఫౌండర్ శ్రీనివాస్ చీకటి రచించిన 'మనీ విటమిన్' పుస్తకావిష్కరణ బుధవారం ఉదయం ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించారు. మనదేశంలోనే కాదు.. విదేశాల్లో కూడా ఉన్న పలు పరిశ్రమలకు దాదాపు రెండు దశాబ్దాల పాటు టెక్నికల్ అడ్వైజర్‌గా పనిచేసిన శ్రీనివాస్ చీకటి.. నష్టాల్లో ఉన్న కంపెనీలను లాభాల బాట పట్టించారు. కరోనా సమయంలో జనజీవనం అస్తవ్యస్థమైన పరిస్థితుల్లో ఆర్థిక క్రమశిక్షణపై ప్రజలను చైతన్యవంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగ నిర్వహణలో తన అనుభవాలను, పుస్తక పఠనంతో తనకు లభించిన విజ్ఞానాన్ని తెలుగు ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో తెలుగు అసెట్స్ అనే మాధ్యమం ద్వారా నిత్యం ఆర్థిక పాఠాలను అందిస్తున్నారు. ప్రజలకు నిత్యం తాను చెబుతున్న పాఠాలనే రంగరించి పుస్తకరూపంలో తీసుకొచ్చారు. 'ధనవంతులు ఎలా ఆలోచిస్తారు? ధనవంతుల మైండ్‌సెట్‌ను అందరూ ఎలా అలవర్చుకోవాలి?' అనే కోణంలో ఈ పుస్తకం రాశారు. ఈ మనీ విటమిన్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో శ్రీనివాస్ చీకటితో పాటు.. సీనియర్ జర్నలిస్టు, గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ ఫ్యాక్ట్‌చెక్ ట్రైనర్ సప్తగిరి, ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్ రాంప్రసాద్, ప్రముఖ రియల్ ఎస్టేట్ నిపుణులు వెంకట్‌రాజ్, ఓం ప్రకాష్, ఎడ్యుకేటర్ వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు. ఈ పుస్తకం ప్రతి ఒక్కరికీ ప్రయోజనకరంగా ఉంటుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎలా నిలదొక్కుకోవాలో ఈ పుస్తకంలో వివరించారని హాజరైన అతిథులు ఈ సందర్భంగా వెల్లడించారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడేది టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే

- జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంపల్లి పద్మారెడ్డి
- 30న ఉప్పల్ నియోజకవర్గ మహాసభ

నవతెలంగాణ-చర్లపల్లి



జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, జర్నలిస్టుల పక్షాన నిలిచిన ఏకైక జర్నలిస్టుల సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మాత్రమే అని జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంపల్లి పద్మారెడ్డి అన్నారు. ట్రేడ్ యూనియన్‌గా కార్మిక శాఖలో నమోదై ప్రభుత్వ గుర్తింపు పొందిన, టీడబ్ల్యూజేఎఫ్‌లో సభ్యులుగా చేరే జర్నలిస్టులకు, సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల రక్షణ బాధ్యతగా టీడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తున్నదని, యూనియన్‌లో చిన్న, పెద్ద భేదం లేకుండా, ప్రతి జర్నలిస్టుకు సభ్యత్వం, సమానత్వం కల్పించడం జరుగుతుందని అన్నారు. మేడ్చల్ జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ కోశాధికారి బెల్లి అశోక్ మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీన ఉప్పల్ నియోజకవర్గ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మహాసభ కుషాయిగూడలో జరుగుతుందని, ఈ మహాసభలో గత కార్యక్రమాలు సమీక్షించుకొని, భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకుంటూ, నూతన కమిటీని ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. ఈ మహాసభకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే సలీమా, తన్నీరు శ్రీనివాస్ తదితరులు హాజరవుతారన్నారు. కావున ఉప్పల్ నియోజకవర్గం లోని జర్నలిస్టులందరూ పాల్గొని, మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నర్సింహులు, యాదవపురం రవి, సభ్యులు కె.వెంకటేష్, రామచంద్రమూర్తి, డి.శ్రీనివాసరావు, నిరంత్ తదితరులు పాల్గొన్నారు.

బండారి లక్ష్మారెడ్డి పుట్టిన రోజు వేడుకలు











నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ మ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ఆయనకు బుక్స్ ఇచ్చి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్-2 మాజీ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, మాజీ కార్యదర్శి కుమార స్వామి, ఎస్.ఎ. రహీం, మాట్ల గిరి, ప్రమోద్, ఊట్ల మొగులయ్య, పిట్టల రాజు, మొగులయ్య, అతిథి రాజు, రాజా శేఖర్ రెడ్డి, బసవయ్య, రామ్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కార్పొరేటర్ బనాల గీత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా గజమాలతో సత్కరించి భారీ కేక్ కట్ చేయించి డివిజన్ నాయకులుతో కలిసి ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు.

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మా రెడ్డి జన్మదినంసందర్భముగా రామాంతపూర్ మాజీ కార్పొరేటర్ గంథం జ్యోత్స్నా నాగేశ్వరావు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చర్లపల్లి

ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం కుషాయిగూడలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు కుషాయిగూడ బీఆర్ఎస్ నాయకులు చల్ల వెంకటేష్, సారా అనిల్ ముదిరాజ్ పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలకు, ఆకర్షితులై ఆయన పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడి పిల్లలకు పండ్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతు పండుగకు 200 మంది రైతులు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా పాలనా విజయోత్సవాల సందర్భంగా రైతు పండుగను మూడు రోజులపాటు ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తెలిపారు. ఈ వేడుకలకు జిల్లా నుంచి 200 మంది రైతులను ఈ నెల 19వ తేదీన బస్సుల్లో తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. అక్కడ వివిధ కంపెనీలు (విత్తన, ఎరువులు, పురుగు మందుల) సంబంధించిన స్టాల్స్‌పై రైతుల సందర్శన కోసం ఉంచినట్టు తెలిపారు. వర్క్‌షాపు, శాస్త్రవేత్తల చర్చాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొనాలని రైతులను కోరారు.

రూ.2,500 కోట్లతో
పలైస్ రాయల్ అభివృద్ధి

నవతెలంగాణ-సిటీబ్యూరో
రియల్ ఎస్టేట్ ప్లేయర్ సుమధుర గ్రూప్, హైదరాబాద్‌లో రూ.2,500 కోట్ల ఆదాయ అంచనాతో ఉబెర్ లగ్జరీ ప్రాజెక్ట్ అయిన పలైస్ రాయల్‌ను అభివద్ధి చేస్తుంది. ఈ సందర్భంగా సుమధుర గ్రూప్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూధన్ మాట్లాడుతూ "నగరంలో మార్కెట్ ట్రెండ్ హై-రైజ్ లగ్జరీ, అల్ట్రా-లగ్జరీ ప్రాపర్టీల వైపు మళ్లింది. ముఖ్యంగా అల్ట్రా-హై నెట్‌వర్త్ వ్యక్తులు, హై నెట్‌వర్త్ వ్యక్తులు, ఎన్‌ఆర్‌ఐలు, భారతదేశపు మిలీనియల్స్, నవతరం యువతరంలో స్వంత లగ్జరీ గహాల పట్ల పెరిగిన కోరిక కారణంగా, అలాంటి ప్రాపర్టీల అధిక డిమాండ్ కారణంగా ఈ మార్పు నేడు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది" అని తెలిపారు.



మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయ్ కుమారి, కూకట్‌పల్లి జెడ్‌పీహెచ్‌ఎస్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనము అమలు తీరును పరిశీలించారు. తనతో పాటు స్థానిక ఎంఈఓ.కిషన్, ప్రధానో పాధ్యాయులు నరేందర్ రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

గొర్రెలు మేకల పెంపకందార్ల
సమస్యలు పరిష్కరించాలి



- గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌కు వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో
గొర్రెలు మేకల పెంపకందార్ల సమస్యలు పరిష్కరించాలని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మేకల కుమార్, ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోనిజిల్లా పశువర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో గొర్రెల పెంపకం వత్తిపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయనీ, రోజురోజుకూ వత్తిలో ఇబ్బందులు పెరుగుతు న్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకంలో నిర్లక్ష్యం చేసిన ప్రతీసారి జీఎంపీఎస్ ఉద్యమించిందని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన రెండో విడత గొర్రెల పంపిణీ వాగ్ధానాన్ని విస్మరించిందన్నారు. అవినీతి సాకు తో ఏడాదిపాటు కాలయాపన చేసి, మూడేండ్ల క్రితం కట్టిన వేల మంది డీడీల డబ్బులు వాపస్ ఇవ్వడంతో గొల్ల కురుమలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. మరోవైపు సరిపడా నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రోజురోజుకూ గొర్ల కాపరులపై భౌతిక దాడులు పెరిగిపోతున్నా యన్నారు. ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాల్లో వందలాది గొర్రెలు చనిపోతున్నప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందడం లేదన్నారు. పశు వైద్యశాలల్లో మందులు లేవని డాక్టర్లే చెబుతున్నారని తెలిపారు. గొర్రెల కాపరులకు రైతుబీమా వర్తిస్తుందనే పేరుతో ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదన్నారు. గొర్రెల పెంపకందార్ల సహకార సంఘాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దళారుల ప్రమే యం లేకుండా నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలనీ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలనీ, సబ్సిడీ మీద జీవాలకు దాణా సరఫరా చేయా లనీ, తగినన్ని నిధులు కేటాయించి అన్ని గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ప్రతీ మూడు నెలలకోసారి నట్టల నివారణ మందులు తాగించాలనీ, అన్ని రకాల మందులు, వాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలనీ, పశువైద్యశాలల పని వేళలు ఉదయం 7 గంటల నుంచి ప్రారం భించేలా మార్పులు చేయాలనీ, 50 ఏండ్లు దాటిన గొర్రెల కాపరులకు నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలనీ, వివిధ ప్రమాదాల్లో చనిపోతున్న గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనీ, కేంద్ర ప్రభుత్వ ఎస్.ఎల్.ఎం. పథకంలో గొల్లకురుమ యువతకు 50శాతం రిజర్వేషన్‌తో గొర్రెల ఫామ్స్ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలనీ, పాలమూరు గొర్రెల పరిశోధనా కేంద్రానికి 200 ఎకరాల స్థలం కేటాయించి, అభివద్ధి చేయాలనీ, పాలన సమయం ముగిసిన సొసైటీలన్నింటికీ వెంటనే ఎన్నికలు నిర్వహించాలనీ, కొత్త జిల్లాల ప్రతిపాదికన జిల్లా యూనియన్లు విడదీసి రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలనీ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగళ్ల (సంత)ను గొర్రెల పెంపకందార్ల సొసైటీలకు కేటాయించి, తూకం పద్ధతిలో జీవాల అమ్మకాలు కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టాలనీ, ప్రభుత్వ భూములకు చెరువు సిక్కం భూములకు కాల్వకట్టు భూములకు హద్దులు ఏర్పాటు చేసి మూగజీవాల మేత భూమి నీటి సౌకర్యం కల్పించాలి దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టాలని తీర్మాణం చేశారు. ఈ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలనీ, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సానం మల్లేశ, జిల్లా సహాయ కార్యదర్శి బండారి మల్లేశ, జిల్లా గ్రామ సొసైటీ అధ్యక్షులు చీర గోపాల్, వట్టెల బలేష్, బత్తుల వీరేష్, గుదే రాజయ్య, గౌర్ల రాములు, బాల బోయిన సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 7,8 తేదిల్లో సీపీఐ(ఎం)
జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభల సందర్భంగా.. డిసెంబర్ 7న కుత్బుల్లాపూర్ ప్రగతి నగర్‌లో జరుగు మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 7,8 తేదీలలో కుత్బుల్లాపూర్ ప్రగతి నగర్‌లో సీపీఐ(ఎం) 3వ జిల్లా మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల ప్రారంభం సందర్భంగా డిసెంబర్ 7న ప్రారంభ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 7,8 తేదీలలో జరుగు ప్రతినిధుల సభలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని.. భవిష్యత్తులో ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. పాలక పార్టీలు ఎన్నికల లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.
ఈ ప్రారంభ సభకు ముఖ్య అతిథులుగాసీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డిజి.నరసింహారావు, పాలడుగు భాస్కర్, పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం పాల్గొంటారన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలో జరిగే జిల్లా మహాసభలకు సాయం సహకారాలు అందించి, పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)పార్టీ శాఖ కార్యదర్శులు పసుల అంజయ్య, రావుల స్వాతి, కే.కరుణాకర్, ఈ.దేవదానం, కే.శీను, కనకయ్య యాదవ రెడ్డి, సద్దాం నవీన్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జీఎన్. శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు

- పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా జీఎన్. శ్రీనివాస్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు తన చాంబర్‌లో కలిసి శాలువా కప్పి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు బల్గర్ సందీప్, అంబటి తేజ, దాస్యం విక్రాంత్, తిరుపతి తేజ మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందుబాటులోకి తేవాలన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు ప్రవేశ పెట్టాలని కోరారు. యూనివర్సిటీలో విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి, పరిష్కారానికి కృషి చేసి మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని కోరారు. విద్యార్థులకు అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గుణాత్మకమైన విద్యను, సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు విద్యార్థులు నూతన పరిశోధనలను చేపట్టేందుకు తమవంతు కృషి చేయాలని కోరారు. పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీయన్ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు అధునాతన సౌకర్యాలు యూనివర్సిటీ తరపున సమకూర్చి తన వంతు బాధ్యతను నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, కార్యవర్గ సభ్యులు అంబటి తేజ, దాస్యం విక్రాంత్, తిరుపతి, తేజ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి
భరత్ నగర్ కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పర్యటించారు. కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులను పర్యవేక్షిస్తూ.. పనులు చేయించాలన్నారు. బుధవారం కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ అధికారులు డిఈ.శంకర్, ఏఈ.రాధాకృష్ణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జమీల్‌లతో కలిసి, కాలనీలో పారిశుధ్యంపై, అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్య పరిష్కారం కొరకు పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భరత్ నగర్ కాలనీలో, పారిశుధ్యం, వీధులు శుభ్రపరిచే కార్మికులను, ఎప్పటికప్పుడు రోడ్లని శుభ్రపరిచే విధంగా పర్యవేక్షించాలన్నారు. స్థానిక జవాన్లకు, ఎస్‌ఎఫ్‌ఏలను ఆదేశించారు. అదేవిధంగా ఎల్ఐజిలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు అతి త్వరలో ప్రారంభించి, పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జనరల్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, విజయ్ కుమార్ వేణు, సాంబశివరెడ్డి, సోమయ్య, ఉమావతీ గౌడ్, జ్యోతి గౌడ్, శ్రీను, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ప్రగతినగర్ శ్మశాన వాటికలో
సౌకర్యాలు కల్పించాలి



- శ్మశాన వాటికను సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని.. ప్రగతి నగర్ స్మశాన వాటికను బుధవారం బాచుపల్లి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బి. వెంకట్రామయ్య నేతృత్వంలో.. సీపీఐ(ఎం) నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడి సుమారు ఐదు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ స్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెత్త డంపింగ్ యార్డ్‌గా మారిన స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనలో అలసత్వం వహిస్తున్న మున్సిపల్ అధికారులు వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు ఈ సందర్భంగా స్మశాన వాటికను వెంటనే శుభ్రం చేయించాలన్నారు. నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఉన్న రూములకు తలుపులు కిటికీలు ఏర్పాటు చేసి, ప్రజల సౌకర్యం కొరకు వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. స్మశానవాటిక ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలకు, మద్యపాన కేంద్రంగా మారిందని.. ఇది అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దాదాపు రూ.20 లక్షల రూపాయల నిధులు స్మశాన వాటికి అభివృద్ధి కోసం సిద్ధంగా ఉన్నాయని వివరించారు. స్మశాన వాటికని శుభ్రపరిచి, నీటి సౌకర్యం కల్పించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో సీపీఐ(ఎం) బాచుపల్లి మండల నాయకులు ఎం చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు సంతోష్, స్థానిక సీపీఐ(ఎం) నాయకులుచ, జి.వెంకటరాజ్యం, అక్బర్ అలీ ఖాన్, ఎస్ ప్రభాకర్, వివి.రావు, శ్రీనివాస్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తుర్క చెరువును పర్యవేక్షించిన హైడ్రా కమిషనర్



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని భండారి లేఔట్ కాలనీ సమీపంలోని తుర్కచెరువు (నిజాంతలాబ్)ను హైడ్రా కమిషనర్ రంగనాథ బుధవారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలాగే కట్టకి అనుకుని ఉన్న ఒక షెడ్‌ను రెండు రోజుల్లోగా తీపించాలని అధికారులను ఆదేశించారు. కట్ట పైన నుంచి ఔట్లెట్ చూసి మొత్తం చెరువు సర్వే చేపించి.. మునిసిపల్ రెవెన్యూ అగ్రికల్చర్ అన్ని సంస్థలు కోఆర్డినేట్ చేసి ఇస్తారన్నారు. వాళ్లకేమన్న ఇబ్బందులు ఉంటే ఇక్కడ ఉన్న కమ్యూనిటీ కోరిక మేరకు.. పర్సనల్‌గా హైడ్రా సహకరించి చెరువును పరిరక్షించి రెండు నెలల్లో కార్యాచరణ రూపొందేలా చూడలన్నారు. మళ్ళీ వచ్చి చూసి సీఎస్‌ఆర్ ఫండ్ కమ్యూనిటీ సహకారంతో చెరువును ప్రజలకు ఒకమంచి వాతావరణం ఉండి, నీటి సమస్య లేకుండా ఉండేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విధంగా సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలిపారు. కట్టకి అనుకుని ఉన్న షెడ్ రేకులు రెండు రోజుల్లో కమిషనర్, ఎమ్మార్వో వారి సహకారంతో తీపించి, తెలుపమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మునిసిపల్ కమిషనర్ సాదర్ అలీ, స్థానిక మున్సిపల్ 27వ వార్డ్ మహిళా కార్పొరేటర్ ఎల్లంబాయి జ్యోతి, బండారి లేఔట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్సింహారెడ్డి బాచుపల్లి తహ సిల్దార్, ఆర్ఐ.సర్వేయర్ 'ఇరిగేషన్ ఎంఎస్‌సి సిబ్బంది, సంక్షేమ సంగం సభ్యులు, కాలనీ మహిళలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలను తలపించిన 'భాగ్యరథి' ఎలక్షన్స్..





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
చింతల్‌లోని భాగ్యరథి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎలక్షన్ విధానం తెలియజేయుటకు.. మాక్ అసెంబ్లీ పెట్టి అందులో సీఎం రోల్, ప్రతిపక్ష పార్టీ లీడర్, స్పీకర్ రోల్, చేయుటకు ప్రత్యక్షంగా ఎలక్షన్ నిర్వహించారు. అందుకు గాను ఆరుగురు సీనియర్ విద్యార్థులు అర్జున్ మౌర్య, డి.ప్రేమ్ కుమార్, ఎం.సాయి చరణ్, మహమ్మద్ అఫ్రోజ్, మహమ్మద్ తాజుద్దీన్, మహమ్మద్ బిలాల్ ఎలక్షన్‌లో పోటీ చేయడం జరిగింది. 22 నుంచి 25 వరకు నామినేషన్ సమర్పించారు. 26 సింబల్స్ కేటాయించడం, ప్రచారం చేసుకోవడం జరిగింది. బుధవారం బ్యాలెట్ పేపర్, సీక్రెట్ బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటింగు సీనియర్ బాయ్స్ వినియోగించుకోగా.. 245 మంది విద్యార్థులలో 175 మంది ఓటింగ్‌లో పాల్గొనడం జరిగింది. ఉదయం10 - 12 గంటల వరకు ఒక క్రమ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12 గంటల తర్వాత బ్యాలెట్ బాక్స్ తెరిచి కౌంటింగ్ ప్రారంభించగా.. మహమ్మద్ తాజుద్దీన్ కు 81 ఓట్లతో ప్రథమ స్థానంలో సీఎం అభ్యర్థిగా ఎంపిక కావడం జరిగింది. డి.ప్రేమ్ కుమార్ 36 ఓట్లతో ద్వితీయ స్థానంలో ప్రతిపక్ష లీడర్‌గా, మహమ్మద్ బిలాల్ 26 ఓట్లతో స్పీకర్ ఎంపిక కావడం జరిగింది. ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు అందరూ చాలా ఆనందాన్ని వ్యక్తం పరచ డం జరిగింది. మాక్ అసెంబ్లీ జరపడానికి తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి విద్యార్థులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎస్.వెంక ట్ రెడ్డి, సిహెచ్.గోవిందరెడ్డి, జి.రమేష్ బాబు, కె.రామ కృష్ణ, నల్ల జై.శంకర్ గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'బుడ్డా గౌరీ శంకర్ గౌడ్'
మృతి బాధాకరం..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
కుత్బుల్లాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు,మాజీ మున్సిపల్ చైర్మెన్ దివంగత నేత బుడ్డా లింగం గౌడ్ తనయుడు, స్థానిక కార్పొరేటర్ బుడ్డా విజయ శేఖర్ గౌడ్ సోదరులు బుడ్డా గౌరీ శంకర్ గౌడ్ చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమని.. మాజీ ఐటి మంత్రి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ డివిజన్ చంద్రానగర్‌లో గల ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన దశదినకర్మ కార్యక్రమానికి ఆయనతోపాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, హాజరయ్యారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. బుడ్డా గౌరీశంకర్ గౌడ్ తల్లికి, సోదరుడికి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తాం



- కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు హామీ ఇచ్చారు. బుధవారం డివిజన్ పరిధిలోని 7వ ఫేస్ వద్ద ఎస్టిపి ప్లాంట్‌కి అనుసంధానంగా నిర్మితమవుతున్న ట్రంక్ సేవరజ్ పైప్ లైన్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టామని తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటికే అనేక రోడ్లు పార్కులు, స్మశానవాటికలు, నూతన పైప్ లైన్ నిర్మాణాలు పూర్తి చేసుకున్నామన్నారు. జీఎం ప్రభాకర్ రావు, డీజీఎం సంశీర్, టీఎస్ ట్రాన్స్కో శ్రీనివాస్, డి.ఈ.శ్రీదేవి, ఏఈ సాయి ప్రసాద్, హెచ్‌ఎండబ్ల్యు ఎస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు కష్టపడి సేవ చేస్తే ఆదరిస్తారు



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
సుభాష్ నగర్ డివిజన్ రాజ్య లక్ష్మి నగర్ నూతన కమిటీ అధ్యక్షులుగా అత్యధిక మెజారిటీతో కృష్ణ రెడ్డి గెలుపొందారు. బుధవారం కార్పొరేట్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డిని కలిసి రాజ్యలక్ష్మి నగర్ నూతన కమిటీ లెటర్ ప్యాడ్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. సురేష్ రెడ్డి నూతన కమిటీ సభ్యులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతు... గత 12 సంవత్సరాలుగా కృష్ణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఈ సారి స్థానికుల కోరిక మేరకు ఎన్నికలు నిర్వహించారన్నారు. మొత్తం కాలనీ ఓట్లు 194 , పోల్ అయినవి 170 , కృష్ణ రెడ్డికి 92 రాగా, ఇద్దరు ప్రత్యర్థులకు 40 ,38 ఓట్లు వచ్చాయి. ఎన్నికలు నిర్వహించిన కూడా బస్తీ వాసులు అదే అభిమానం చూపి అత్యధిక మెజార్టీతో కృష్ణ రెడ్డిని గెలిపించడం అభినందనీయమన్నారు. డబ్బులతో ప్రజలను కొనలేరని.. ప్రజలలోకి వెళ్లి సేవ చేస్తే తప్పకుండా ఆదరిస్తారని సురేష్ రెడ్డి అన్నారు. కుటుంబాల మధ్య స్నేహం, మమతానుబంధాలు పెంపొందించడంలో కాలనీలో ప్రముఖ పాత్ర వహిస్తాయి అన్నారు. కాలనీలు ఆహ్లాదకరంగా ఉండాలన్నా...అభివృద్ధి చెందాలన్నా... సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలన్నా కమిటీలు ఎంతో అవసరం అన్నారు. కాలనీలోని ప్రతి ఒక్కరినీ కలుపుకుపోతూ... సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కాలనీ అభివృద్ధికి తమ శాయశక్తుల కృషి చేస్తామని, అండగా ఉంటామని తెలిపారు. అధ్యక్షులు కృష్ణ రెడ్డి, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు సురేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, అధ్యక్షులు కృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు కుమారస్వామి, సత్తి రెడ్డి, గోపాల్, బలరాం,నూతన కమిటీ సభ్యులు అందరు ఉన్నారు.

విద్యార్థుల పరీక్ష ఫీజును చెల్లించిన బుచ్చిరెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లి, తండ్రి లేని 20 మంది ఒంటరి విద్యార్థుల 10వ తరగతి పరీక్షల ఫీజును గాజులరామారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చదువు మీద ఇష్టం ఉండి, సోమతలేక చదువుకు దూరం అవుతున్న పిల్లలను దృష్టిలో ఉంచుకొని.. తన వంతు సహాయంగా కొంతమంది విద్యార్థుల కైనా ప్రయోజనం చేకూరుతుందని ఉద్దేశంతో ఫీజు కట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఆయనను అభినందించారు.

క్రిస్టియన్ అభ్యర్థులు, సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న క్రిస్టియన్ వేడుకలలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన క్రిస్టియన్ అభ్యర్థులు, సంస్థలను సత్కరించ నున్నందున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మహమ్మద్ ఇలియాజ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవారంగం, విశిష్టమైన వైద్య సేవలు, విద్యా బోధన, సాహిత్యం, క్రీడా రంగాలలో పదేండ్ల పైబడి విశేషమైన సేవలు అందించిన క్రైస్తవులు, విద్యా సామాజిక సేవా రంగాలలో 30 ఏండ్లకుపైగా సేవ చేస్తూ ఉన్న క్రైస్తవ సంస్థలు గౌరవ సత్కారం అందుకొనేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వారి నామినేషన్లను నిర్ణీత నమూనాలు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో వచ్చేనెల 5లోగా అందజేయాలని చెప్పారు. నామినేషన్లు www.tscmfc.in వెబ్‌సైట్ నుంచి లేదా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం నుంచి గానీ పొందవచ్చని ఆయన తెలిపారు.



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లను అసెంబ్లీలో మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం కలిశారు. తన మనవడు తలసాని శ్రీవెన్ మొదటి పుట్టినరోజు వేడుకలకు, సోదరుడు తలసాని మహేష్ యాదవ్ కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరారు. నవతెలంగాణ-బేగంపేట

దీక్షా దివస్‌కు పార్టీ శ్రేణులు తరలిరావాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ఈ నెల 29న తెలంగాణ భవన్ లో నిర్వహించే దీక్షా దివస్‌కు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద సనత్ నగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధకుడు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని గుర్తు చేశారు. 29న మధ్యాహ్నం 2.30 గంటలకు నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ లపై బేగంపేటలోని పాటిగడ్డ లో గల మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని చెప్పారు. సుమారు 3 వేల బైక్‌లతో ర్యాలీగా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ సర్కిల్ వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా తెలంగాణ భవన్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. తెలంగాణ భవన్‌లో జరిగే దీక్షా దివస్‌లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు పాల్గొంటారని చెప్పారు. పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, ఏసూరి మహేష్, సంతోష్, ప్రవీణ్ రెడ్డి, కర్నాకర్ రెడ్డి, ఖలీల్, లక్ష్మీపతి, శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, నాగులు, కిషోర్, సురేష్ గౌడ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

9 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

- ఒక టేబుల్ ఐటమ్‌కు సభ్యుల ఆమోదం
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన 6వ స్టాండింగ్ కమిటీ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం 6వ స్టాండింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. కమిటీ సమావేశంలో 9 అంశాలు, ఒక టేబుల్ ఐటమ్ కు సభ్యులు ఆమోదించినట్టు మేయర్ తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్, మహమ్మద్ ఖాదీర్, మహమ్మద్ నసీరుద్దీన్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబీహా బేగం, చింతల విజయ్ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సరోజ, పంకజ, గీత రాధిక, చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, ఎస్.ఈ రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, అకౌంట్ ఎగ్జామినర్ వేంకటేశ్వర రెడ్డి, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు

ఎస్.ఎన్.డి.పి కింద నాగమయ్యకుంట నాలా రీ మోడలింగ్ రూ.19.34 కోట్లతో పూర్తయినందున జీహెచ్ఎంసీ అందుబాటులో గల ఎస్.ఎన్.డి.పి మిగులు నిధులతో నాలా పొడిగింపునకు ప్రతిపాదించిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణంకు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. హబీబ్ నగర్ నుంచి చాంద్రాయణగుట్ట మెయిన్ రోడ్, రియాసత్ నగర్ నుంచి హబీబ్ నగర్ వయా పాపా లాల్ టెంపుల్ వరకు రహదారి అభివృద్ధికి జీహెచ్ఎంసీ పరిధిలో గల 174 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం లభించింది. ఖైరతాబాద్ జోన్ మెహిదీపట్నం సర్కిల్ మల్లేపల్లి మోడల్ మార్కెట్ బిల్డింగ్ సమీప స్లమ్ ఏరియా నిరుద్యోగ యువత, వెనుకబడిన మహిళలకు సీ.ఎస్.ఆర్ కింద లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ వారి సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లవ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణలు నిర్వహించుటకు ఒక సంవత్సర కాలం పాటు మల్లేపల్లి మోడల్ మార్కెట్ బిల్డింగ్‌ను స్వాధీనం చేసేందుకు అనుమతిస్తూ సంబంధిత ఏజెన్సీతో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని 150 వార్డులలో క్రీడా కార్యక్రమాల నిర్వహణకు ప్రతి కార్పొరేటర్ డివిజన్‌కు రూ.2 లక్షల విలువైన ఆటలు/క్రీడల మెటీరియల్ అందించడానికి కమిటీ ఆమోదం తెలిపింది. పోలీస్ శాఖకు చెందిన నాంపల్లి వార్డు 45లో గల పోలీస్ క్వార్టర్స్, గోషామహల్ బంక్, స్టేడియం, బాస్కెట్ బాల్, బాడ్మింటన్ కోర్ట్ లకు సంబంధించిన 31.39 ఎకరాల భూమిని ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి గాను ఎన్.ఓ.సి జారీ చేయుటకు జీహెచ్ఎంసీ సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం. అంతేకాకుండా పలు పనులకు స్టాండిగ్ కమిటీ ఆమోదం లభించింది.

మాజీ మంత్రి నిజాయితీ నిరూపించుకో...



- న్యాయవాది జెల్లా రవీందర్ యాదవ్

నవతెలంగాణ-బంజారా హిల్స్

ఒక్క గుంట కూడా భూమిని కబ్జా చేయలేదని ప్రగల్భాలు పలుకుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తన నిజాయితీని నిరూపించుకోవాలని సిద్ధిపేట జిల్లా వాసులు, న్యాయవాది జెల్లా రవీందర్ యాదవ్, అశోక్, రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్ధిపేటలో హరీశ్‌రావు రాజ్యాంగం ఇప్పటికి కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. సిద్ధిపేట అభివద్ధిలో దూసుకుపోతుందని వస్తున్న వార్తలాన్ని అవాస్తమేనని, అభివద్ధి మాటున అరాచకాలు ఎన్నో కొనసాగుతున్నాయన్నారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మాణం సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులతో స్థానిక రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి వద్ద నుంచి ఎకరాల కొద్ది భూమిని కొనుగోలు చేశారని ఆరోపించారు. నేరుగా రంగనాయక సాగర్ కోసం సేకరించిన భూమి నుంచి 9 గుంటల భూమిని అక్రమంగా తన పేరును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. సప్త సముద్రాలు ఈదిన వాడు పిల్ల కాలువలో పడి కొట్టుమిట్టాడినట్టుగా ప్రస్తుతం 9 గుంటల భూమి హరీశ్‌రావు నిజాయితీని ప్రశ్నిస్తున్నదన్నారు. ఒక్క గుంట భూమిని కూడా కబ్జా చేసుకోలేదని చెబుతున్న హరీశ్‌రావుకు సీబీడీ ఎంక్వయిరీ కోరే దమ్ముందా అని ప్రశ్నించారు. దీంతోపాటు సిద్దిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) పేరిట జరిగిన అక్రమాలు ఎన్నో ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమగ్రంగా విచారణ జరిపి వెలికి తీయాలని కోరారు.

విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం స్పందించాలి



- డీఎస్‌యూ రాష్ట్ర కో కన్వీనర్ మేరిగ సైదాబాబు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ధర్మ స్టూడెంట్ యూనియన్(డీఎస్‌యూ) రాష్ట్ర కో.కన్వీనర్ మేరిగ సైదాబాబు డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట డీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో కలుషిత ఆహారం తిని, సంగారెడ్డి,నల్గొండ జిల్లాలో విద్యార్థులు పాముకాటుకు గురై, ఆదిలాబాద్ జిల్లాలో జిల్లా పరిషత్ స్కూల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురై మరణిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకుండా విజయోత్సవాలు జరపడం సిగ్గుచేటన్నారు. ఇది విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. వాంకిడి పాఠశాల విద్యార్థిని శైలజ మతిపై ప్రభుత్వం స్పందించి వారి కుటుంబానికి న్యాయం చేయాలని, గత 11 నెలలుగా చనిపోయిన విద్యార్థుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం, రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నారాయణ శ్రీ చైతన్య ప్రయివేటు విద్యాసంస్థల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని, ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా నిరంతర పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్ లింగయ్య, ఓయూ ఇన్‌చార్జి మొగిలిపాక శివ, ఆర్ట్స్ కాలేజ్ ఇంచార్జ్ లు నిఖిల్,మల్లేష్, సైన్స్ కాలేజీ ప్రెసిడెంట్ అశోక్, దుర్గారావు ,ప్రఫుల్, కృష్ణలు పాల్గొన్నారు.



"16 ఏండ్ల నుంచి ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం పడిగాపులు..'

నవతెలంగాణ-ఓయూ

2008 డీఎస్సీ వరంగల్ ఉమ్మడి జిల్లా ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించిన అభ్యర్థులు మంగళవారం ప్రజా భవన్‌లో వినతి పత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం 2008 సంవత్సరంలో డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిప్రకారం ఉపాధ్యాయులుగా నియమించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఇస్లావత్ వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు హనుమకొండ డీఈఓ ఆఫీసులో తమ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ సెప్టెంబర్ 2024లో జరిగిందన్నారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిరుద్యోగుల కోసం అర లక్ష ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 16 ఏండ్ల తర్వాత తమకు ఉద్యోగం కల్పిస్తామని శుభవార్త ప్రకటించింది ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. నిరుద్యోగుల జీవితంలో వెలుగు నింపుతున్న ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. అతి త్వరలో తమను ఉపాధ్యాయులుగా నియమించి న్యాయం చేయవలిందిగా 2008 డీఎస్సీలో అర్హత సాధించిన వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాటోతు సోమ్లా నాయక్, ఇస్లావత్ వెంకన్న, భూక్యవాలు, ఇస్లావత్ రాములు పాల్గొన్నారు.

ఓయూలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు





నవతెలంగాణ-ఓయూ

ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో వివిధ డిపార్ట్మెంట్స్‌లలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970 కేరళ రాష్ట్రంలో పురుడు పుసుకొని దేశంలో లక్షలాది విద్యార్థుల సైన్యంతో దేశ విద్యారంగ సమస్యల మీద నిరంతరం పోరాడుతోందని, చదువు, పోరాడు అనే శాస్త్రీయ నినాదంతో, స్వతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంతో పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఓయూ కార్యదర్శి రవి నాయక్, ఉపాధ్యక్షులు మల్సూర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఓయూ

చిలకలగూడ దూది బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా అన్ని విధాలా అండగా ఉంటానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. పాఠశాలకు సరైన దారి లేదు.. పాఠశాల తూర్పు వైపు కొత్త గేట్ పెట్టి కొత్త దారి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి బుధవారం సీతాఫల్ మండి లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఉపాధ్యాయులు పేద విద్యార్థుల విద్యా వికాసానికి అంకిత భావంతో పని చేయాలని కోరారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా నని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, సునీత, లక్ష్మీ ప్రసన్న, సీనియర్ జర్నలిస్టు ఇ. చంద్రశేఖర్, జర్నలిస్టు బ్రహ్మానందం, పాల్గొన్నారు.

- సంజీవపురంలో బోరింగ్ పనిచేసేలా చూడాలి
- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

బోరు పని చేసేలా చూడండి : ఎమ్మెల్యే

సంజీవపురంలో సివరేజ్ లైన్లు మార్చాలని, కొత్తగా ఏర్పాటు చేసిన పవర్ బోరింగ్ పని చేసేలా ఏర్పాట్లు జరపాలని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. సంజీవపురం తుల్జా భవానీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.జగదీశ్ నేతత్వంలో స్థానిక సంఘం ప్రతినిధులు బుధవారం సితాఫలమండీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. తమ గల్లీలో కొత్తగా పవర్ బోరింగ్ ను ఏర్పాటు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే పవర్ బోరింగ్ పని చేసేలా ఏర్పాట్లు జరపాలనికోరారు. డ్రయినేజీ లైన్లు మార్చాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



దీక్షా దివస్‌కు భారీగా వెళ్దాం : ఎమ్మెల్య



తెలంగాణా భవన్‌లో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌కు సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో బైక్‌లతో భారీ ర్యాలీని నిర్వహించనున్నట్టు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నేతల అత్యవసర సమావేశం బుధవారం సితాఫలమండిలో నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని తమ పార్టీకి కంచు కోటగా తీర్చిదిద్దామని తెలిపారు. రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్‌కు ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణా భవన్ లో ఈ నెల 29న నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సితాఫలమండీ, బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్ల నుంచి ఒక్కో డివిజన్‌కు కనీసం 250 బైక్‌ల చొప్పున భారీగా బైక్ ల ద్వారా కార్యకర్తలు తరలి రావాలని, చిలకలగుడా నుంచి ర్యాలీగా తెలంగాణ భవన్‌కు తరలి వెళ్లాలని చెప్పారు. సమావేశంలో వివిధ డివిజన్ల నేతలకు పార్టీ కండువాలు, జెండాలు, సామగ్రిని ఎమ్మెల్యే అందించారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, రాసూరి సునీత రమేష్, , కంది నారాయణ, , సునీల్, పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ క్లబ్ మాజీ కార్యదర్శి నుంచి ప్రాణహాని

- ప్రముఖ వ్యాపారవేత్త వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ క్లబ్ మాజీ సెక్రటరీ నుంచి తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందని నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వెంకటేశ్వరరావు ముప్పు ఆరోపిం చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో వ్యాపార ఒడిదుడుకులతో పాటు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తన వద్దకు వచ్చిన సదరు వ్యక్తి తనను వ్యాపారంలోకి భాగస్వామిని చేసుకు న్నారని తెలిపారు. అనంతరం సదరు వ్యాపారాలలో అక్రమాలకు పాల్పడుతున్నారని గమనించి తాను దూరం అయ్యానన్నారు. అయితే ఇప్పటికీ తన పేరును ఉపయోగించుకుంటూ వ్యాపారాలు చేయడమే కాక సెటిల్మెంట్లకు రావాలంటూ ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఈనెల 13న రెడ్ హిల్స్‌లోని తన కార్యాలయానికి రౌడీలతో వచ్చి దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. సదరు దాడులకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలతో సహా స్థానిక పోలీస్ స్టేషన్ నాంపల్లిలో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. పరిశీలిం చిన పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. దీంతో అతని నుంచి తనకు, తన కుటుంబానికి హాని ఉందని తక్షణమే అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు తనకు రక్షణ కల్పించాలని కోరారు.

'అవసరమైనది తీస్కో.. అవసరం లేనిది వదిలి వెళ్లు..'



నవతెలంగాణ-బంజారాహిల్స్

సోమాజిగూడ డివిజన్ పరిధిలోని రాజ్ భవన్ రహదారిలోనీ పార్క్ హెూటల్ సమీపంలో గుడ్ వీల్ స్టోర్‌ను జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ డీఎం సీ రజనీకాంత్ రెడ్డి, ఏఎంహెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానికంగా నివసించే ప్రజలందరూ తమకు పనికిరాని వస్తువులను ఈ స్టోర్ వద్దకు తీసుకువచ్చి పనికొచ్చే వస్తువులను తీసుకువెళ్లాలని సూచించారు. సదుద్దేశంతో ప్రభుత్వం ఈ స్టోర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. దీనితో పలువురికి ఉపాధితో పాటు వ్యర్థాలు బహిరంగ ప్రాంతాలలో నాలాల్లో పార వేయకుండా ఉంటారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

గత ప్రభుత్వ హాయంలో సైతం ఇలాంటివి ఎన్నో కార్యక్రమాలు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టి విఫలమయ్యారన్నారు. ముఖ్యంగా రెండు రూపాయలు ఏటీఎం నీటి బ్యాంకులు, ఆహారం వృధా కాకూడదని ఫ్రిజ్‌లు, స్ట్రీట్ వెండర్స్‌కి ఉపాధి కల్పనకూ ప్లాస్టిక్ వ్యర్థాలతో బాక్సులు ఏర్పాటు చేసి అక్కడక్కడ టీ స్టాల్స్, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కావలసిన సామాగ్రి కొరకు ఏర్పాటు చేసిన ఈ బాక్సలన్ని శిథిలావస్థితికి చేరుకోవడంతో వాటిని మార్చి రంగులు వేసి మళ్లీ వినియోగించుకోవడానికి జీహెచ్ఎంసీ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు చెప్పారు. ఈసారైనా నిరూప యోగంగా మారొద్దనే సంకల్పంతో ప్రారంభించడం విశేషమన్నారు.

ఆర్‌బీఐ 90 క్విజ్ జోనల్ రౌండ్‌లో విజేతలుగా ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నవంబర్ 25న కొచ్చిలో ఆర్‌బీఐ90క్విజ్ రెండో జోనల్ రౌండ్‌ను నిర్వహించింది. ఆర్బీఐ, తమ కార్యకలాపాలు ప్రారంభించి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఆర్‌బీఐ 90క్విజ్ దేశవ్యాప్తంగా నిర్వహించారు. జోనల్ రౌండ్‌లో కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్ర స్థాయి విజేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజికి చెందిన సయ్యద్ మహ్మద్ హమ్మీ, హుస్సేన్ అహ్మద్‌లతో కూడిన విజేత జట్టు, డిసెంబర్ 6, 2024న ముంబైలో జరగనున్న ఆర్‌బీఐ90క్విజ్ నేషనల్ రౌండ్‌లో పాల్గొనబోతున్నారు. వీరు ఇతర జోన్లలో గెలిచిన జట్లతో పోటీపడుతారు . కర్ణాటకలోని పీఈఎస్ యూనివర్శిటీ, కేరళలోని మార్ ఇవనోయిస్ కాలేజీ జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మొదటి మూడు జట్లు వరుసగా రూ.5 లక్షలు, రూ.4 లక్షలు, రూ. 3 లక్షల బహుమతులను గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ఎస్. రాథో మాట్లాడుతూ ఆర్‌బీఐ 90 క్విజ్ ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా విద్యార్థులలో ఆర్థిక అవగాహనను పెంపొందించడానికి ఆర్‌బీఐ తీసుకున్న చర్యల గురించి వివరించారు.



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం

- పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపి నాథ్ ఆధ్వర్యంలో శ్రీ నగర్ కాలనిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు అయ్యప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్య ప్ప స్వాములను ఎమ్మెల్యే అభినందించి, ఆయురారోగ్యాలతో అందరూ అయ్యప్ప స్వామిని దర్శించుకుని రావాలని కోరారు.

కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్న బీఎల్ఆర్



నవతెలంగాణ - కాప్రా/ చర్లపల్లి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధ వారం తన పుట్టిన రోజు సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఎర్రవెల్లిలోని వారి వ్యవసాయ క్షేత్రం లో మర్యాద పూర్వ కంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.



బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రంలో ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉన్నారు. నవతెలంగాణ-చర్లపల్లి

ఇద్దరు ఎన్యుమరేటర్లను సస్పెండ్ చేయండి

- మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు
- ఇంటింటి సర్వే వివరాల ఆన్ లైన్ అప్ లోడింగ్ ప్రక్రియ తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) వివరాలను ఆన్ లైన్‌లో అప్ లోడింగ్ చేస్తున్న ఆపరేటర్ పక్కన అందుబాటులో లేని ఇద్దరు ఎన్యుమరేటర్లను వెంటనే సస్పెండ్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం మేడ్చల్ మున్సిపాల్టీలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాల ఆన్ లైన్ అప్ లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ ప్రక్రియలో ఎన్యుమరేటర్లు లేకుండా సర్వే వివరాలను అప్ లోడ్ చేస్తున్న ఆపరేటర్లను గమనించిన ఎన్యుమరేటర్లు ఎక్కడ అని అడిగి, అందుబాటులో లేని ఎన్యుమరేటర్లను వెంటనే సస్పెండ్ చేయాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సర్వేలో ఎలాంట పొరపాటు జరిగినా సహించేది లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో బాధ్యతగా నిర్వహించాల్సిన విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కేవలం అన్ లైన్‌లో అప్ లోడ్ చేయడం వరకే ఆపరేటర్ల బాధ్యత అనీ, ఎలాంటి తప్పులు జరిగినా ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్యుమరేటర్లు పక్కన ఉన్నంత సేపు మాత్రమే ఆపరేటర్లు సర్వే వివరాలు అప్ లోడ్ చేయాలని సూచించారు. సమయం వృధా కాకుండా ఎన్యుమరేటర్లు, ఆపరేటర్లు ఒకే సమయంలో భోజనం చేయాలని తెలిపారు. సూపర్ వైజర్లు దగ్గరుండి ఎన్యుమరేటర్లు, ఆపరేటర్ల పని తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. తప్పులు లేకుండా సర్వే వివరాలను నిర్దేశిత సమయంలో ఆన్ లైన్ లో అప్లోడ్ చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ తహశీల్దార్ శైలజ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీడీఓ సంపూర్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

- సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాను బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని డిపార్టుమెంట్‌లు కలిసి పనిచేస్తాయని సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్ తెలిపారు. బాల్యవివాహాలు లేని భారత్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ, మహిళ శిశుసంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నగరంలోని ఉమెన్ ఎంపవర్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలని తెలిపారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్, వారి బృందం ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, తెలంగాణ విద్యాకమిషన్ సభ్యులు వెంకట్ రెడ్డి, సీడీపీవోస్, అయిదు ప్రాజెక్టుల సూపర్‌వైజర్లు, సభ్యులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొదరుడు ఎ.జగదీష్ రెడ్డి కుమార్తె ఎ.రుత్వికా రెడ్డి వివాహం బుధవారం శంషాబాద్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు వైరా ఎమ్మెల్యే రాందాస్, మిమిక్రీ కళాకారులు రమేష్, తెలంగాణ గద్దర్ కాసాల నర్సిరెడ్డి, గుత్తా సీతారాం రెడ్డి, వాకిటి రవీందర్ రెడ్డి, నర్సింహా, ఆసిఫ్ హాజరై నూతన వధువరులు ఎ.రుత్వి కా రెడ్డి, అభిజిత్ రెడ్డిలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

9 కిలోలు గంజాయి పట్టివేత

నవతెలంగాణ-బంజారా హిల్స్



గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న నిందితుడితో పాటు ఏడుగురు కొనుగోలుదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నంది నగర్ లో నివసిస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్ రౌట్ నగరానికి వలస వచ్చి ముందుగా సెక్యూరిటీ గార్డ్, అనంతరం స్విగ్గీ డెలివరీ బాయ్, పనిచేశాడు. ఈ క్రమంలో అదే రాష్ట్రానికి చెందిన పుల్బాని జిల్లాకు చెందిన గోవింద్ అనే గంజాయి సరఫరాదారుడితో పరిచయం ఏర్పడింది. దీంతో అప్పటికే విలాసాలకు అలవాటు పడి డెలివరీతో పాటు ఈ వ్యాపారాన్ని పెంచుకొని ఈజీ మనీకి అలవాటు పడ్డ నిందితుడు సంతోష్ అప్పటికే తనకు పరిచయం ఉన్నవారికి క్రమం తప్పకుండా ప్యాకెట్లలో ప్యాక్ చేసి గంజాయి అమ్ముతూ ఉండేవాడు. అయితే విశ్వసనీయ సమాచారం ఆధారంగా వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ టీమ్, ఇన్‌స్పెక్టర్ ఇ. జంగయ్య నేతృత్వంలో బంజారాహిల్స్ పోలీసులతో కలిసి గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న నిందితుడిని సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్నారు.

గోవింద్ నుంచి సంతోష్ సుమారు 9 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, దాన్ని రైలు ద్వారా ఒడిశా నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్‌కు తీసుకువచ్చినట్లు ఇక్కడ దానిని చిన్న చిన్న ప్యాకెట్లుగా ప్యాక్ చేసి, వినియోగ దారులకు విక్రయించి సులభంగా డబ్బు సంపాదించాలకున్నట్టు విచారణలో తేలినట్లు వెల్లడించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి కొనుగోలు చేసిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి డ్రై గంజాయి 9 కిలోలు, ఓ ద్విచక్ర వాహనం, ఖాళీ ప్యాకెట్లతో పాటు మొబైల్ ఫోన్లు 2, ఒక వెయింగ్ మెషీన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టాస్క్ ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైవిఎస్ సుధీంద్ర, ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య,ఎస్ఐ బి. అరవింద్ గౌడ్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ టీమ్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పెద్ద అంబర్‌పేటలోని సాయి శ్రీనివాస బాటిల్ కంపెనీలో నిర్వహించిన ఉప్పలమ్మ తల్లి పూజ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బంధు మిత్రులు, సాయి శ్రీనివాస కార్మికులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు ,ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నాగోల్

సీఎం సోదరుని కుమార్తె వివాహంలో ఉప్పల

నవతెలంగాణ- నాగోల్



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి కుమార్తె రుత్విక రెడ్డి -అభిజిత్ రెడ్డిల వివాహ మహోత్సవం వేడుకలను నగరం లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో గల జీఎంఆర్ అరేనా కన్వెన్షన్ హాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కిమ్స్ బీఎస్సీ
పారా మెడికల్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఎస్సీ పారా మెడికల్ కళాశాల నడిపేందుకు కిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చినట్టు బొల్లినేని మెడ్ స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. 11 కోర్సులకు అనస్థీషియా టెక్నాలజీ, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, కార్డియాక్, కార్డియో వాస్కులర్ టెక్నాలజీ, రీనల్ డయాలసిస్ టెక్నాలజీ, ఆప్టోమెట్రీ టెక్నాలజీ, రెసిపిరేటరీ టెక్నాలజీ, న్యూరో సైన్స్ టెక్నాలజీ, క్రిటికల్ కేర్ టెక్నాలజీ, రేడియాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ రికార్డ్స్ టెక్నాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ కోర్సులకు అనుమతి లభించినట్టు తెలిపారు.

ఇప్పటి వరకు నర్సింగ్ సంబంధిత కోర్సులు నిర్వహిస్తున్న తమ సంస్థకు పారా మెడికల్ కోర్సుల నిర్వహణకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఆనందాయకమన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. తమ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నడుస్తున్న బొల్లినేని పారా మెడికల్ కళాశాలలో చదివిన నిస్సీ లియోన్ అనే విద్యార్థినికి లండన్‌లో రూ. 37 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం లభించిందన్నారు. పూర్తి వివరాలకు సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ లేదా 7093589568 నెంబర్‌ను సంప్రదించగలరని కోరారు.


ఫ్లైఓవర్ పేయింటింగ్స్ అదుర్స్






నవతెలంగాణ-సిటీబ్యూరో


గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన పచ్చదనం నేపథ్యంలో నగరాన్ని మరింత సుందరీకరణంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కులు, జంక్షన్ల అభివృద్ధితోపాటు ఫ్లైఓవర్లపై అందంగా పేయింటింగ్ చేస్తున్నారు. వివిధ ప్రముఖుల ఫోటోలు, మరికొన్నిచోట్ల పిల్లర్స్‌పై కళాత్మక చిత్రాలను వేశారు. ప్రత్యేకంగా ఆకర్షించే విధంగా ముస్తాబు చేశారు. ఈ చిత్రాలు నగరవాసులనే కాకుండా ప్రయాణీకులను, పాదాచారులను, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపోయేవారిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.











బీఎస్పీని గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తాం



బీఎస్పీ నూతన అధ్యక్షుడు అజయ్ కుమార్

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

బీఎస్పీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని బీఎస్పీ నూతన అధ్యక్షుడు అల్వాల అజయ్ కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బీఎస్పీ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ నూతన అధ్యక్షుడిగా అల్వాల అజయ్ కుమార్ ఎన్నికయ్యాడు. అనంతరం అజయ్ కుమార్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు వంగాల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు గుండె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మచ్చ మహేందర్, కార్యదర్శి బంగారిగళ్ళ మహేందర్, మంచాల మండల అధ్యక్షులు నల్ల శివకుమార్, నాయకులు మున్నా నాయక్, నల్లారి నాగరాజు, ప్రసాద్, సాయి, శ్రీనివాస్, రాజు, సోమయ్య, జి. నరసింహ, సాయికుమార్, రాజు, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హెూంగార్డులకు వీడ్కోలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి విజిలెన్స్ వింగ్‌లో సుదీర్ఘ కాలం పాటు పనిచేస్తున్న ముగ్గురు హెూంగార్డులు మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. ఎం.చంద్రశేఖర్, ఎం.సుబ్బా రాయుడు, ఎస్ఎస్‌పి సుధాకర్‌లు బోర్డులో సుమారు 20 ఏళ్ల నుంచి హెూంగార్డులుగా సేవలందిస్తున్నారు. ఇటీవల వారికి బదిలీ కావడంతో వారిని జలమండలి విజిలెన్స్ వింగ్ అధికారి గ్యానేందర్, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

రాచకొండ సీపీకి
డిప్యూటీ సీఎం పరామర్శ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ పార్లమెంటు సభ్యులు గొట్టే భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మాతృమూర్తి శాంత మృతి చెందిన విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం సాయంత్రం మాజీ పార్లమెంటు సభ్యులు గొట్టే భూపతి, పోలీస్ కమిషనర్ సుధీర్ బాబులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. శాంతమ్మ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు.

'బాల బాలికలకు అథ్లెటిక్స్‌లో 31 పతకాలు'



నవతెలంగాణ-హయత్ నగర్

10వ రంగారెడ్డి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2024 లో అకాడమీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందుతున్న బాల బాలికలు మొత్తం 31 పతకాలు సాధించారని అకాడమీ హెడ్ కోచ్ నేనావత్ వినోద్, అసిస్టెంట్ కోచ్ గణేష్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ ఇందులో స్వర్ణ పతకాలు 13, రజిత పతకాలు 8, కాంస్య పతకాలు 10.. మొత్తం 31 పతకాలు సాధించినట్టు తెలిపారు. ఇందులో 11 మంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని హర్షం వ్యక్తం చేశారు. డిసెంబరు 1వ తేదీన మంచిర్యాల డిస్ట్రిక్‌లో జరుగుతున్నాయని చెప్పారు. అకాడమీ స్పోర్ట్స్ 11 మంది రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

సాలార్జంగ్ మ్యూజియంలో డిగ్రీ విద్యార్థులు

నవతెలంగాణ-హయత్‌నగర్

చరిత్ర విభాగం ఆధ్వర్యంలో హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చారిత్రక విజ్ఞాన యాత్ర (హిస్టారికల్ స్టడీ టూర్)లో భాగంగా బుధవారం సాలార్జంగ్ మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ మ్యూజియంలోని నిజాం కాలం నాటి చారిత్రక పనిముట్లు, వస్తువులను, అవశేషాలు, విగ్రహాలు, వస్తువులను, పాలరాతి విగ్రహాలు ఉపయోగించినటువంటి ఫర్నిచర్ మొదలగు వాటిని చూసినట్టు తెలిపారు. సాలార్జంగ్ మ్యూజియంలో ఉన్నటువంటి పనిముట్లను చూయించి..జీవన విధానానికి సంబంధించిన అనేక విషయాలను ప్రత్యక్షంగా మ్యూజియంలో సందర్శించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. ఈ స్టడీ టూర్ మాకు ఎంతో విజ్ఞానాన్ని ఇచ్చిందన్నారు. భవిష్యత్ నిర్మాణానికి, చరిత్ర



ఆయుధాలు, దుస్తులు, చిత్రలేఖనలు, ప్రతిమలు, శిల్పకళా సంపదను విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేసినట్టు వివరించారు. వీటితోపాటు ఫ్రాన్స్, పోర్చుగీస్, డచ్, ఇంగ్లీష్ వారి మొదలగు యూరోపియన్లు ఉపయోగించిన సామాగ్రి అధ్యయనం పునాదికి ఉపయోగపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ పి. నాగేంద్ర, నాక్ కోఆర్డినేటర్ ఇందిరా, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబికా రాణిని సన్మానించిన కమిషనర్ ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ క్రీడా రంగంలో సాధించిన విజయాలు గర్వకారణమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో జీహెచ్ఎంసీ ఉద్యోగి, విక్టరీ ప్లే గ్రౌండ్ ప్లేయర్, జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడల్లో బంగారు పథకం సాధించింది. జూడో క్రీడలో ఢిల్లీ నుండి రజత పథకం సాధించిన అంబికా రాణిని అడిషనల్ కమిషనర్ యాదగిరి రావుతో కలిసి కమిషనర్ శాలువతో సన్మానించారు. వచ్చే నెల ఆమె పాటియాల (పంజాబ్)లో ఎన్ఐఎస్‌ఏ శిక్షణా సంస్థలో సర్టిఫికేట్ కోర్సు కోసం శిక్షణ పొందనున్నారు.

సాయిబాబా అన్ని కుల, మతాలకు అతీతుడు

- షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సీఈవో గోరక్ష మహాదేవ్ గాడిల్కర్



నవతెలంగాణ- నాగోల్

షిరిడి సాయిబాబా అన్ని కుల, మతాలకు అతీతుడని షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గోరక్ష మహాదేవ్ గాడిల్కర్ అన్నారు. నాగోలు డివిజన్‌లోని దేవకి కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర షిరిడి సాయి భక్త ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన షిరిడి సాయిబాబా మందిరాల నిర్వాహకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాయిబాబా అన్ని మత, కులాలకు అతీతుడు అని.. షిరిడి సాయిబాబా ముస్లిం అని ఏ కోర్టు, ఏ ప్రభుత్వమూ ఇప్పటివరకు చెప్పలేదని అన్నారు. సాయిబాబా ట్రస్టు ద్వారా దేశంలో, రాష్ట్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో షిరిడిలో రెండు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్వహించబడుతున్నాయని, కేవలం పది రూపాయల నామమాత్రపు రుసుముతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నో విద్యాసంస్థలను ఇప్పటికే నెలకొల్పి పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. సోషల్ మీడియాలో షిరిడి సాయిబాబా మీద తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. షిరిడీలోని సాయి సంస్థాన్ మందిరం మహారాష్ట్ర హైకోర్టు పరిధిలో నడుస్తున్నదని, ఈ మందిరానికి మహారాష్ట్ర హైకోర్టు జడ్జి , శిరిడి జిల్లా కలెక్టర్, షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ కార్యనిర్వాహణ అధికారి, సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం నుండి నేటి వరకు కూడా షిరిడి సాయి ఏ మతానికి, ఏ కులానికి చెందినవారు అని ఏ కోర్టు కూడా తీర్పులేదని అన్నారు. ఈ సమావేశంలో షిరిడి సాయి భక్త ఐక్యవేదిక కమిటీ కార్యవర్గంతో పాటు పలువురు శిరిడి సాయిబాబా భక్తులు, వక్తలు, తెలుగు రాష్ట్రాలకు చెందిన సాయిబాబా ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ప్రసాద్ మరణం సీపీఐకి తీరని లోటు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రా చారి


నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు కామ్రేడ్ పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రాచారి అన్నారు. బుధవారం పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో రావి నారాయణ రెడ్డి కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రా చారి మాట్లాడుతూ కామ్రేడ్ పోటు ప్రసాద్ అకాల మరణ వార్త తనను తీవ్ర కలతకు గురిచేసిందన్నారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ నిర్వహించిన ప్రజా ఉద్యమాల్లో తనదైన పాత్రను పోషిస్తూ ప్రజల పక్షాన పోరాటం చేశాడని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్ నాయక్, తగిలి మధు, పుల్లయ్య, ప్రసాద్, నిరంజన్, యాదగిరి, దేవమ్మ, సుజాత, వినోద్, శ్రావణి తదితరులు ఉన్నారు.



చల్లటి వాతావరణంలో వేడివేడిగా..

చల్లటి వాతావరణంలో వేడి వేడిగా ఏదైనా తాగాలనిపిస్తుంది. అందుకు సూప్‌లు బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. ఇవి శరీరంలో వెచ్చదానాన్ని పెంచుతాయి. చలి నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అలాగే పోషకాలు ఉండే వాటితో సూప్ చేసుకుంటే ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. రెస్టారెంట్ స్టయిల్‌లో చేసుకునే కొన్ని రకాల సూప్‌లు నేటి మానవిలో...



క్యారెట్, అల్లం సూప్

కావలసిన పదార్థాలు : క్యారెట్ - 400 గ్రాములు (కడిగి సన్నగా తరగాలి), ఓ ఇంచు అల్లం (చిన్న ముక్కలుగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు - ఆరు, బిర్యానీ ఆకు - ఒకటి, మిరియాలు - ఒక స్పూను. ఉల్లిపాయ - ఒకటి, నూనె - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా. నీరు - ఒక లీటరు.

తయారీ విధానం : ముందుగా స్టవ్‌పై ఓ ప్యాన్ పెట్టుకొని నూనె పోయాలి. నూనె వేడెక్కాక బిర్యానీ ఆకు, వెల్లుల్లి, మిరియాలు, అల్లం ముక్కలు వేసి సుమారు రెండు నిమిషాల పాటు వేగనివ్వాలి. దాంట్లో తరిగిన క్యారెట్ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. కొద్దిగా వేగాక అర లీటర్ వరకు నీరు పోయాలి. క్యారెట్, ఉల్లిపాయ ముక్కలు మెత్తగా అయ్యే వరకు మీడియం మంటపై మూతపెట్టి ఉడికించుకోవాలి. మధ్యమధ్యలో కలుపుతుండాలి.

క్యారెట్ ముక్కలు పూర్తిగా ఉడికాక.. ఆ మిశ్రమాన్నంతా మిక్సీ జార్‌లో వేసుకోవాలి.



దీన్ని మెత్తగా ప్యూరీలా గ్రైండ్ చేసుకుని వడగట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని మళ్లీ ఓ ప్యాన్‌లో మరికొద్ది నీళ్లు పోసుకొని స్టవ్‌పై బాగా మరిగించాలి. రుచికి సరిపడా ఉప్పు వేసుకోవాలి. సూప్ బాగా మరిగాక స్టవ్ ఆఫ్ చేసుకోవటమే. అంతే క్యారెట్ అల్లం సూప్ రెడీ అవుతుంది. కాస్త తియ్యగా, ఘాటుగా ఈ సూప్ అదిరిపోతుంది. అయితే, ఘాటు తక్కువగా ఉండాలనుకునే వారు అల్లం, మిరియాలు కాస్త తక్కువ వేసుకోవచ్చు. వేడివేడిగా ఈ సూప్ తాగితే అద్భుతంగా ఉంటుంది.


శరీరంలో రోగ నిరోధక శక్తి మెరుగుపరుస్తుంది. క్యారెట్, అల్లంలో యాంటీఆక్సిడెంట్లతో పాటు ముఖ్యమైన విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. దీనివల్ల శరీరంలో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

టమాట సూప్

కావలసిన పదార్థాలు : వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, టమాటాలు-అర కేజీ, బటర్ - రెండు స్పూన్లు, ఉల్లిపాయ తరుగు - రెండు స్పూన్లు, బిర్యానీ ఆకు - ఒకటి, మిరియాలు-అర స్పూన్, క్యారెట్ ముక్కలు- పావు కప్పు, బీట్ రూట్ - ఒకటి (చిన్నది), ఉప్పు-రుచికి సరిపడా, షుగర్ -ఒక స్పూను, మిరియాల పొడి-పావు చెంచా, మిల్క్ బ్రెడ్ - రెండు. నూనె- వేయించడానికి సరిపడా.

తయారీ విధానం : ముందుగా స్టవ్‌పై పాన్ పెట్టి బటర్ వేసుకోవాలి. బటర్ కరిగిన తర్వాత కచ్చాపచ్చాగా చేసిన వెల్లుల్లి రెబ్బలు, బిర్యానీ ఆకు, మిరియాలు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఫ్రై చేయాలి. ఉల్లిపాయలు వేగిన తర్వాత క్యారెట్ ముక్కలు వేసి మగ్గించాలి. రెండు నిమిషాల తర్వాత బీట్‌రూట్ ముక్కలు వేసి బాగా కలపాలి. (సూప్‌లో ఆర్టిఫిషియల్ కలర్స్ వాడకుండా మంచి రంగు రావడానికి కొన్ని బీట్ రూట్ ముక్కలు వేసుకోవాలి)

కొద్దిసేపటి తర్వాత టమాటా ముక్కలు వేసుకుని బాగా కలుపుకోవాలి. (టమాటాలు బాగా పండినవి అయితే, సూప్ రుచిగా ఉంటుంది) ఇప్పుడు ఇందులో ఉప్పు, కొద్దిగా చక్కెర వేసి కలుపుకోవాలి. తర్వాత 2 గ్లాసుల నీళ్లు పోసి మూతపెట్టి, టమాటాలు మెత్తగా ఉడికించుకోవాలి. టమాటాలు ఉడికిన తర్వాత స్టౌ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీ గిన్నెలో వేసి గ్రైండ్ చేసుకోవాలి.




(వేడి మీద వేస్తే మిక్సీ లోంచి చిందిపోతుంది) ఇప్పుడు టమాటా ప్యూరీ మిశ్రమాన్ని వడగట్టుకోవాలి. అందులో రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి వేసి కలుపుకోవాలి. స్టౌ మీడియం ఫ్లేమ్‌లో పెట్టి వడగట్టిన మిశ్రమానికి మరికొద్దిగా నీళ్లపోసి ఒక పొంగు వచ్చేంత వరకు ఉడికించుకోవాలి. తర్వాత మిల్క్ బ్రెడ్ చిన్నగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేసి బ్రెడ్ స్లైసెస్ వేసుకోవాలి. అవి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకూ ఫ్రై చేసుకుని సూప్‌లో వేసుకోవాలి. ఇలా చేసుకుంటే రెస్టారెంట్ స్టైయిల్‌లో టమాటా సూప్ రెడీ.

చికెన్ సూప్

కావలసిన పదార్థాలు : చికెన్ - 250 గ్రాములు (బోన్ లెస్), ఉల్లిపాయ - 1, వెల్లుల్లి రెబ్బలు - 3, నిమ్మకాయ - సగం, కొత్తిమీర - ఒక కట్ట, బిర్యానీ ఆకులు - 2, లవంగాలు - 4, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - చిటికెడు, మొక్కజొన్న - అర కప్పు, క్యారెట్ - ఒకటి, క్యాప్సికమ్ - ఒకటి, స్ప్రింగ్ ఆనియన్ - ఒకటి, కార్న్ పౌడర్ - ఒక స్పూను.

తయారీ విధానం : ముందుగా ఉల్లిపాయను సన్నగా తరుగుకోవాలి. ఇప్పుడు ఓ గిన్నెలో నీళ్ల వేసి..బోన్ లెస్ చికెన్, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. దానిలోనే వెల్లుల్లి



రెబ్బలు, నిమ్మబద్ద, బిర్యానీ ఆకులు, కొత్తిమీరు, ఉప్పు, మిరియాల పొడి వేసుకోవాలి. ఇప్పుడు స్టౌవ్ వెలిగించి దానిని మరగనివ్వాలి. బాగా ఉడికిన తర్వాత స్టౌవ్ ఆపేయాలి. ఉడికిన చికెన్ ముక్కలను వేరుచేసుకొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. మిగిలిన ముక్కలను కూడా ఒక గిన్నెలోకి తీసుకొని బాగా స్మాష్ చేసుకొని అదే నీటిలో కలుపుకోవాలి. ఇపుడు కట్ చేసుకున్న చికెన్ ముక్కలు, మొక్కజొన్న గింజలు వేసుకోవాలి. కొత్తిమీర తురుము, చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకున్న క్యాప్సికమ్‌ను వేసి మరోసారి ఉడికించుకోవాలి. ఇప్పుడు ఒక స్పూను కార్న్ పౌడర్‌ను నీళ్ల వేసి కలిపి.. దానిని సూప్‌లో వేసి బాగా కలపాలి. ఈ కార్న్ పొడి వేయడం వల్ల సూప్ చిక్కబడుతుంది.

దానిలో స్ప్రింగ్ ఆనియన్స్ ముక్కలు వేసుకోవాలి. అలాగే బటర్ కూడా వేసుకోవాలి. మూతపెట్టి మరో రెండు నిమిషాలు ఉడికించుకుంటే వేడి వేడి చికెన్ సూప్ రెడీ.

జొన్న, గుమ్మడి సూప్

కావలసిన పదార్థాలు : జొన్నపిండి - మూడు స్పూన్లు, గుమ్మడి ముక్కలు - 350 నుంచి 400 గ్రాములు, ఉల్లిపాయ - ఒకటి, పుదీనా ఆకులు - అరకప్పు, ఉప్పు- రుచికి సరిపడా, మిరియాల పొడి - అర స్పూను, నెయ్యి - ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, జీలకర్ర - అర స్పూను, వాము - కొద్దిగా, వెల్లుల్లి రెబ్బలు



- నాలుగు, నిమ్మకాయ - ఒకటి. కొత్తిమీర తరుగు - కొద్దిగా,

తయారీ విధానం : ఇందుకోసం ముందుగా స్టౌపై కడాయి పెట్టుకొని జొన్నపిండిని లో ఫ్లేమ్ మీద మంచి సువాసన వచ్చేంత వరకు వేయించుకొని పక్కనుంచుకోవాలి. ఇప్పుడు స్టౌ మీద మరో పాన్ పెట్టుకొని 750 - 800ఎంఎల్ వాటర్ పోసుకొని మరిగించుకోవాలి. నీళ్ల వేడెక్కి మరుగుతున్నప్పుడు అందులో మీడియం సైజ్‌లో కట్ చేసుకున్న తీపి గుమ్మడి ముక్కలు, కాస్త పెద్దగా తురుముకున్న ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తగా ఉడికించుకోవాలి.

ఆ విధంగా ఉడికించుకున్నాక పుదీనా ఆకులు వేసి కలిపి మరో మూడు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తర్వాత స్టైయినర్ సహాయంతో ఆ వాటర్‌ని ఒక బౌల్‌లోకి వడకట్టుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్ తీసుకొని అందులో స్టైయినర్‌లో ఉన్న వడకట్టుకున్న గుమ్మడి, ఉల్లి, పుదీనా ఆకుల మిశ్రమాన్ని వేసుకోవాలి. ఆపై ముందుగా వేయించుకున్న జొన్నపిండిని కూడా యాడ్ చేసుకొని గుమ్మడి ముక్కల మిశ్రమాన్ని ఉడికించుకున్న వాటర్‌ని కొద్దిగా పోసుకొని కాస్త బరకగా గ్రైండ్ చేసుకోవాలి. అనంతరం స్టౌపై కడాయి పెట్టుకొని వడకట్టుకున్న గుమ్మడి ముక్కలు ఉడికించిన వాటర్‌ని పోసుకోవాలి. ఆపై అందులో మీరు గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని కలుపుతూ కొద్దికొద్దిగా యాడ్ చేసుకోవాలి. ఆ తర్వాత మీడియం ఫ్లేమ్ మీద మిశ్రమం చిక్కగా మారేంత వరకు ఉడికించుకోవాలి. అలా ఉడికించుకునేటప్పుడే అందులో రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి వేసుకోవాలి. సూప్ రెండు, మూడు పొంగులు రాగానే మంటను లో ఫ్లేమ్‌లోకి మార్చుకుని కొద్దిసేపు మరిగాక స్టవ్ ఆఫ్ చేయాలి. ఇప్పుడు ఇంకో బర్నర్ మీద ఒక చిన్న కడాయి పెట్టుకొని నెయ్యి వేసుకోవాలి. అది కరిగి కాస్త వేడయ్యాక జీలకర్ర వేసి చిట్లనివ్వాలి. ఆపై వాము వేసి 5 సెకన్లు వేయించుకోవాలి. ఆ తర్వాత సన్నగా కట్ చేసుకున్న వెల్లుల్లి తరుగు వేసుకొని లైట్ గోల్డెన్ కలర్ వచ్చేంత వరకు వేపుకొని స్టౌ ఆఫ్ చేసుకోవాలి. దాన్ని సూప్‌లో పోసుకుని మిక్స్ చేసుకోవాలి. ఇక చివరగా కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లుకొని, నిమ్మరసం పిండుకొని వేడివేడిగా సర్వ్ చేసుకుంటే చాలు. ఎంతో టేస్టీగా ఉండే "జొన్న గుమ్మడికాయ సూప్" రెడీ! ■

డస్ట్ అలర్జీ వేధిస్తోందా?

ప్రస్తుత వాతావరణ కాలుష్యం నేపథ్యంలో డస్ట్ అలర్జీ బారిన పడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చిన్న దుమ్ముకే తుమ్ములు రావడం, ముక్కు కారడం, కళ్లలో దురద, కళ్లు ఎర్రబడడం, గొంతులో నొప్పి వంటి సమస్యలకు దారి తీస్తుంది. శ్వాస సంబంధిత సమస్యలు కూడా ఎక్కువతున్నాయి.



- ఒకసారి డస్ట్ ఎలర్జీ బారిన పడ్డామంటే.. తగ్గడం అంత సులువుకాదు. కొన్ని రకాల నేచురల్ టిప్స్ ద్వారా దీనికి చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎన్ని మందులు వాడినా తగ్గని డస్ట్ అలర్జీని కొన్ని రకాల వంటింటి చిట్కాలతో చెక్ పెట్టొచ్చని అంటున్నారు. ఇంతకీ ఆ నేచురల్ టిప్స్ ఏంటో చూద్దాం...
- డస్ట్ అలర్జీని చెక్ పెట్టడంలో రాక్‌సాల్ట్ బాగా ఉపయోగపడుతుంది. ఒక కప్పు వేడి నీటిలో రాక్ సాల్ట్‌ను కరిగించి ఆ నీటిని ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల ముక్కు శుభ్రపడుతుంది. గొంతు నొప్పి, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దుమ్ము బ్యాక్టీరియా నాశనం అవుతుంది.
- డస్ట్ అలర్జీ ఉన్న వారిలో అల్లం, తేనె కూడా బాగా ఉపయోగపడుతుంది. ఈ రెండింటిలో ఉండే నేచురల్ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫమేటరీ లక్షణాలు డస్ట్ అలర్జీని దూరం చేస్తుంది. ఒక చెంచా తేనెలో అల్లం రసం కలిపి ప్రతీరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే డస్ట్ అలర్జీ దూరమవుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- శీతాకాలంలో డస్ట్ అలర్జీ మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలాంటి సమయంలో పసుపు, తులసి ఆకులు క్రియాశీలకంగా ఉపయోగపడతాయి. తులసి ఆకులను ఉడకబెట్టి, అందులో పసుపు వేయాలి. అనంతరం నీరు సగం అయ్యే వరకు వేడి చెయ్యాలి. గోరు వెచ్చ చేసుకొని ఈ నీటిని తాగాలి. ఇది శరీరంలోని విషాన్ని తొలగిస్తుంది.
- రాత్రి పడుకునే ముందు కొబ్బరి నూనె మసాజ్ చేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది. ముక్కు, గొంతు దగ్గర కొబ్బరి నూనెను మసాజ్ చేయాలి. ఇది శ్వాస తీసుకోవడంలో తలెత్తే ఇబ్బందుల నుంచి ఉపశనం కలిగిస్తుంది. ■

గ్రూపులొద్దు.. కలిసి పని చేయండి

(మొదటిపేజీ తరువాయి)

తన ఛాంబర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ... తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గొడెం నగేశ్, ధర్మపురి అర్వింద్, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, రాజ్యసభ సభ్యులు డా లక్ష్మణ్, ఎమ్మెల్యేలు రాజా సింగ్, కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్‌బాబు, రాం రావు పవార్, సూర్య నారాయణ, బీజేపీ ఎమ్మెల్సీ, మొత్తం 16 మంది హాజరయ్యారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో తొలుత కిషన్ రెడ్డి, డీకే అరుణ ప్రధానికి రాష్ట్ర నేతలను పరిచయం చేశారు. ఒక్కొక్కరుగా ప్రధానికి శాలువా కప్పారు. అనంతరం వారి వారి నియోజక వర్గాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగాల్సిన అభివద్ధి పనులు, కేంద్ర సాయానికి సంబంధించిన వివరాలను ప్రధానికి డీకే అరుణ అందజేశారు. ఆ ఫైల్‌ను తీసుకున్న తర్వాత... తాజా ఎన్నికల్లో తెలంగాణ లో పార్టీ అధికారంలోకి రాకపోవడానికి గల కారణాలను ఒకొక్కటిగా ప్రధాని ప్రస్తావించారు. ఈ దిశలో రాష్ట్ర నేతలు గ్రూపులుగా ఏర్పడ్డ తీరు, ఆ గ్రూపుల ద్వారా ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలను వెల్లడించారు. ఇందులో భాగంగా ఎన్నికల ముందు పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో మార్పులు చేయాల్సి వచ్చిందని చెప్పినట్లు తెలిసింది. అయినప్పటికీ... ఇంకా గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయని, ఇలాంటి తీరు సరికాదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నేతలంతా ఏం చేస్తారో తనకు తెలియదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరాలని చెప్పారు.

మహారాష్ట్రను స్ఫూర్తిగా తీసుకోండి

సాధారణంగా తక్కువ మాట్లాడి, ఎక్కువ వినేందుకు ఇష్టపడే మోడీ... రాష్ట్ర నేతల మీటింగ్‌లో మాత్రం క్లాస్ పీకేందుకే టైం కేటాయించినట్టు తెలిసింది. దాదాపు అరగంటలో 20 నిమిషాల పాటు ముఖ్యనేతల్లో క్షీణించిన సఖ్యతను ఏకరువు పెట్టారు. తద్వారా పార్టీకి జరిగిన నష్టం, కింది స్థాయి కార్యకర్తల్లో నెలకొన్న గందరగోళం పై క్లారిటీ ఇచ్చారు. ఈ దిశలో నేత ఏ స్థాయిలో ఉన్న ఉపేక్షించే పరిస్థితి ఉండదన్నారు. బీజేపీ హైకమాండ్ కేవలం వ్యూహాలు, కావాల్సిన సపోర్ట్ మాత్రమే ఇస్తుందని... క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్టం చేసేది రాష్ట్ర నాయకులే అని తేల్చి చెప్పారు. ఆ విషయంలో తెలంగాణలో నేతల మధ్య నెలకొన్న వ్యక్తిగత విబేధాలు, దూరం పార్టీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చుతున్నాయని అభిప్రాయపడ్డారు. బీజేపీ హైకమాండ్ కేవలం అనుసరించాల్సిన వ్యూహాలు, కావాల్సిన సపోర్ట్ మాత్రమే ఇస్తుందని... క్షేత స్థాయిలో పార్టీని పటిష్టం చేసేది రాష్ట్ర నాయకులే అని తేల్చి చెప్పారు. ఆ విషయంలో తెలంగాణలో నేతల మధ్య నెలకొన్న వ్యక్తిగత విబేధాలు, దూరం పార్టీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గ్రాండ్ విక్టరీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ విజయం వెనక కీలక నేతలతో పాటు కింది స్థాయి కార్యకర్త వరకు కలిసికట్టుగా పని చేసిన తీరును వివరించారు. అలాగే గుజరాత్ ఎన్నికల్లో, మున్సిపల్ స్థాయి ఎలక్షన్స్‌లో బీజేపీ ప్రణాళికలు, విజయాలను నేతలకు హితబోధ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

నియోజకవర్గాల వారీగా అభివద్ధి చేయాలనే విజ్ఞప్తులే కాదని... ప్రజా సమస్యలపై పోరాడాలని ప్రధాని మోడీ దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో మరింత బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. గడప గడపకు బీజేపీ పార్టీ స్టాండ్‌ను తీసుకెళ్లాలన్నారు. తెలంగాణలో బీజేపీకి ఇంకా మంచి ఆదరణ ఉందని తన సర్వే రిపోర్ట్‌లో తెలిసినట్లు వివరించారు. కుటుంబ పాలన, అహంకారం, అవినీతి అంశాలు బీఆర్ఎస్ పార్టీని ముంచేశాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ప్రజల్లో రోజు రోజుకు విశ్వాసం, నమ్మకం సన్నగిల్లుతున్నట్టు తేలిందన్నారు. అందువల్ల బీజేపీకి మంచి స్కోప్ ఉందని వివరించారు. అందువల్ల నాలుగేండ్ల ముందు నుంచే క్షేత స్థాయిలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాలని సూచించారు. అంతకున్న ముందు తమ తమ నియోజక వర్గాల్లో నేతల మధ్య గొడవలకు ఫులిస్టాప్ పెట్టాలని నొక్కి చెప్పారు.

అందుకే ఇంత టైం...

వాస్తవానికి మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి పార్లమెంట్ సెషన్‌లోనే రాష్ట్ర నేతలు ప్రధాని అపాయిట్మెంట్ కోరారు. అయితే రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, నేతల మధ్య సఖ్యత లేకపోవడం, పార్టీలో గ్రూపు రాజకీయాల గురించి తెలుసుకోవడానికే ఇంత కాలం మోడీ అపాయిట్మెంట్ ఇవ్వలేదని తెలిసింది. ముఖ్యంగా 2023 చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఖాయమని భావించినా... ఎనిమిది సీట్లకే పరిమితం కావడం వెనక సంఘ్ పరివార్ నుంచి కూడా సమాచారం తెలుసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ డేటా సేకరించిన తర్వాత... నేతలకు క్లాస్ పీకేందుకే ప్రధాని ఈ భేటీ నిర్వహించినట్లు మీటింగ్‌లో పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు. కాగా... కొందరు ఎమ్మెల్యేలు ప్రధాని మీటింగ్‌పై అసంతప్తి వ్యక్తం చేశారు. కాదనలేక ఈ సమావేశం ఏర్పాటు చేశారని మీడియా ప్రతినిధులకు తమ మనసులోని మాటను చెప్పుకున్నారు. ప్రధాని మోడీతో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేల భేటీపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. గత పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధాని మోడీ అపాయిట్మెంట్ కోసం రిక్వెస్ట్ చేస్తే, బుధవారం టైం ఇచ్చారని తెలిపారు.

వక్ఫ్‌బిల్లుపై జేపీసీని పొడిగించండి

బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే తీర్మానం

ఇప్పటికే ప్రతిక్షాలు డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్‌బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమయాన్ని పొడిగించాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జేపీసీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఇప్పటికే ప్రతిపక్షాలు వక్ఫ్‌బిల్లుపై జేపీసీ సమయాన్ని పెంచాలని కోరాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశాయి. ప్యానెల్ 25 సార్లు మాత్రమే సమావేశమైనందున, వాటాదారులు తమ అభిప్రాయాలను సమర్పించడానికి మరింత సమయం అవసరమని వారు వాదించారు. నవంబర్ 29 గడువులోగా ప్రక్రియను ముగించడానికి ప్రభుత్వం యోచిస్తోందని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన పార్లమెంటరీ ప్యానెల్ సమావేశంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వచ్చే బడ్జెట్ సమావేశాల వరకు పొడిగించే అవకాశం ఉంది.

కాల్పుల విరమణ

జెరూసలేం : గత 14 నెలలుగా లెబనాన్‌లో సాగుతున్న మారణహోమానికి ఇజ్రాయిల్, హిజ్బుల్లా స్వస్తి చెప్పాయి. ఇరు పక్షాలు బుధవారం కాల్పుల విరమణను ప్రారంభించాయి. ఒప్పందాన్ని హిజ్బుల్లా ఉల్లంఘిస్తే తిరిగి దాడి జరుపుతానని ఇజ్రాయిల్ ప్రకటించింది. దక్షిణ లెబనాన్ ప్రజలెవ్వరూ త్వరపడి స్వస్థలాలకు చేరుకోవద్దని, సైన్యం ఇప్పటికీ అక్కడ మోహరించి ఉన్నదని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి ఒకరు తెలిపారు. ఒప్పందం ప్రకారం తొలుత రెండు నెలల పాటు ఇరు పక్షాలు కాల్పుల విరమణ పాటిస్తాయి. దక్షిణ లెబనాన్ నుండి హిజ్బులా మిలిటెంట్లు వైదొలుగుతారు. అలాగే ఇజ్రాయిల్ దళాలు కూడా తమ సరిహద్దుకు చేరుకుంటాయి. వేలాది అదనపు లెబనాన్ దళాలు, ఐరాస శాంతి పరిరక్షక దళాలు దక్షిణ ప్రాంతంలో మోహరిస్తాయి. అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం ఒప్పందం అమలును పర్యవేక్షిస్తుంది. కాల్పుల విరమణ బుధవారం ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమైంది. ఇజ్రాయిల్ దళాలు మంగళవారం బీరూట్‌లో పెద్ద ఎత్తున వైమానిక దాడులు జరిపాయి. ఘర్షణ ప్రారంభమైన తర్వాత భారీ స్థాయిలో దాడులు జరగడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో ఇరు పక్షాల మధ్య యుద్ధం తీవ్రమవుతుందన్న సంకేతాలు వెలువడ్డాయి. వైమానిక దాడుల్లో 42 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. కాగా గాజాలో జరుగుతున్న భీకర పోరు ప్రస్తావన మాత్రం కాల్పుల విరమణ ఒప్పందంలో లేదు. ఇప్పటికీ హమాస్ చేతిలో కొన్ని డజన్ల మంది బందీలుగా ఉన్నారు. ఘర్షణ రోజురోజుకూ తీవ్ర రూపు దాలుస్తోంది. ఒప్పందాన్ని హిజ్బులా ఉల్లంఘిస్తే దానిపై దాడి చేసే హక్కు ఇజ్రాయిల్‌కు ఉంటుందా అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఒప్పందంలో ఈ అంశాన్ని కూడా చేర్చాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ పట్టుబట్టారు. అయితే లెబనాన్, హిజ్బుల్లా అందుకు అంగీకరించలేదు. అమెరికా, ఫ్రాన్స్ నేతృత్వంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయిల్ భద్రతా క్యాబినెట్ అంతకుముందు ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందిస్తూ 'ఇది మంచి వార్త' అని వ్యాఖ్యానించారు. గాజాలో కూడా కాల్పుల విరమణకు తన ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన చెప్పారు.

కాల్పుల విరమణ ఒప్పందంపై నెతన్యాహూ టీవీలో ప్రసంగిస్తూ 'ఈ ఒప్పందం గాజాలో హమాస్‌ను ఏకాకిని చేస్తుంది. ప్రధాన శత్రువు అయిన ఇరాన్‌పై దృష్టి సారించేందుకు ఇజ్రాయిల్‌కు అవకాశం ఇస్తుంది. ఒకవేళ హిజ్బుల్లా ఒప్పందాన్ని ఉల్లంఘించి కయ్యానికి కాలు దువ్వితే మేమూ దాడి చేస్తాం. ప్రతి ఉల్లంఘనకూ మా దాడి సమాధానమిస్తుంది' అని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై లెబనాన్ ఆపద్ధర్మ ప్రధాని నజీబ్ మికాతీ హర్షం వ్యక్తం చేశారు. స్థిరత్వాన్ని సాధించడంలో ఇది కీలక అడుగు అవుతుందని, నిరాశ్రయులైన ప్రజలు తిరిగి స్వస్థలాలకు చేరుకుంటారని ఆయన అన్నారు.

శాంతి, సుస్థిరతకు అవకాశం : భారత్

ఇజ్రాయిల్, హిజ్బుల్లా ఒప్పందంపై భారత్ హర్షం వ్యక్తం చేసింది. ఉద్రిక్తతలు సడలాలని, ఇరు పక్షాలు సంయమనం పాటించాలని, చర్చలు, దౌత్యాన్ని ప్రారంభించాలని తాము మొదటి నుండీ కోరుతూనే ఉన్నామని గుర్తు చేసింది. తాజా పరిణామాలు శాంతికి, సుస్థిరతకు దారితీస్తాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

వామ్మో..దొంగ నోట్లు

(మొదటిపేజీ తరువాయి)

తీయడంలో పూర్తిగా విఫలమైన బీజేపీ సర్కార్.. కనీసం దేశంలో నకిలీ నోట్లను అరికట్టలేకపోయింది. మూడేండ్లలో దొంగనోట్లు మూడు రెట్లు పెరిగిపోయాయి. 2018-19 నుంచి 2022-23 వరకు నకిలీ రూ.500 నోట్లు 317 శాతం పెరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2018-19లో రూ.500 విలువ కలిగిన మొత్తం 2186.5 కోట్ల నకిలీ నోట్లను గుర్తించినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. దీంతో పోల్చితే 2022-23లో ఏకంగా 9,111 కోట్ల దొంగ నోట్లు బయటపడ్డాయన్నారు. వీటిలో 316.6 శాతం పెరుగుదల చోటు చేసుకున్నట్లయ్యిందన్నారు. 2023-24లో రూ.500 నకిలీ నోట్ల సంఖ్య 85,711గా నమోదయ్యిందన్నారు. ఎంపీ టిఎం సెల్వగణపతి అడిగిన ప్రశ్నకు సమాధానంగా పంకజ్ చౌదరీ వివరణ ఇచ్చారు. 2018-19లో 2,184 కోట్ల రూ.2వేల నకిలి నోట్లు గుర్తించబడ్డాయి. ఇవి 2022-23లో 980 కోట్లుగా చోటు చేసుకున్నాయి. 2023-24లో 2,603.5 కోట్లకు పెరగడం ఆందోళనకరం. ఆర్‌బీఐ గణంకాల ప్రకారం.. 2024 మార్చి ముగింపు నాటికి మొత్తం కరెన్సీలో రూ.500 నోట్ల వాటా 86.5 శాతంగా ఉంది. గతేడాది ఇదే సమయం కల్లా 77.1 శాతంగా ఉంది. గతేడాది మేలో రూ.2వేల నోట్లను ఉపసంహరించుకోవడం ద్వారా రూ.500 నోట్లు ఎక్కువగా చెలామణిలోకి వచ్చాయి. 2024 అక్టోబర్ 31 నాటికి 98.04 శాతం విలువ కలిగిన రూ.2వేల నోట్లు ఆర్‌బీఐకి తిరిగి వచ్చాయి.

రూపాయి డీలా

(మొదటిపేజీ తరువాయి)

వరుసగా ఈక్విటీలను తరలించుకుపోవడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. మరోవైపు చమురు ధరలు పెరగడమూ, యూఎస్ ఫెడ్ మీటింగ్ అంశాలు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. భారత స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడంతో ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 84.38 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84.48 కనిష్ట స్థాయిని తాకింది. వరుసగా రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచనుంది.

బీజేపీకి డౌన్ ట్రెండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఒకవైపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతుంటే, బీజేపీకి మాత్రం డౌన్ ట్రెండ్ మొదలైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను కసరత్తు చేస్తున్నదని చెప్పారు. కచ్చితంగా రైతు భరోసా ఇస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. గత కొద్ది రోజులుగా ప్రభుత్వం గురించి కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో, ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ, గురుకుల వసతి గృహాల్లో జరుగుతున్న ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. కాంగ్రెస్ మంత్రులంతా పనిమంతులేననీ, చాలా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, ప్రగతిశీల భావాలే లక్ష్యంగా ముందుకు పోతున్నదని చెప్పారు. ఇటీవల కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచారని వివరించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ మంత్రిని కాంగ్రెస్ అభ్యర్థి ఓడించారని గుర్తు చేశారు. ప్రభుత్వాన్ని పట్టుకుని కేటీఆర్ ఇష్టమెచ్చి మాట్లాడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఏం తప్పు చేసిందని విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో భావ స్వేచ్ఛ, అందరికీ స్వతంత్రాన్ని ఇచ్చి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి పదేండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించారని గుర్తు చేశారు. ఎంతమందికి భూ పంపిణీ చేశారని ప్రశ్నించారు. ఎన్నో వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేదని విమర్శించారు.



పదేండ్లపాటు మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కు కనీస సంస్కారం కూడా లేదని విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను సన్యాసి అంటే ఎలా? అని ప్రశ్నించారు. అందుకే ఆయన మైండ్ సెట్ సరిగా లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటి తర్వాత ఒకటి నెరవేర్చుకుంటూ ముందుకు పోతున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించి వారి పక్షాన ప్రభుత్వం ప్రతినెలా రూ. 400 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తుందని గుర్తు చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తూ వారి పక్షాన ప్రభుత్వం నెలకు రూ. 150 కోట్లు చెల్లిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు త్వరలోనే భూమి పూజ చేస్తామని తెలిపారు. గత పదేండ్లపాటు రేషన్ కార్డులు లేకుండా ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. వాటిని ప్రక్షాళన చేసి తాము కార్డులు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని నాలుగు సార్లు చేయడం వల్ల అది వడ్డీకే సరిపోయిందన్నారు. ఇక రెండో దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అరకొరగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థను సృష్టించారని ఆరోపించారు. దీంతోపాటు రాష్ట్రంపై అప్పుల భారాన్ని మోపారని చెప్పారు. స్వేచ్ఛగా బతికిన తెలంగాణను బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులాలను విడగొడుతున్నారంటూ తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. తాము కులాలను సృష్టించడం లేదనీ, అవి శతాబ్దాలుగా ఈ సమాజంలో ఉన్నాయని గుర్తు చేశారు. 'రాష్ట్రంలో వివిధ కులాల వారు ఎంతమంది? రాజ్యాంగ ప్రవేశిక ప్రకారం అందరూ సమానంగా ఎదిగారా? లేదా? అనేది తాము సర్వేలో తెలుసుకుంటాం. ఇంతకాలం రాష్ట్రాన్ని దోపిడీ చేసిన బ్యాచ్ మళ్లీ దోపిడీ చేయాలని చూస్తుంది. అందరి లెక్కలు చెప్పి వాస్తవాలు బయటకు తీస్తే వాళ్లకు ఇబ్బంది' అని హెచ్చరించారు. ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. పరిశుభ్ర వాతావరణం, నాణ్యతతో కూడిన భోజనం అందుతుందా? లేదా? పర్యవేక్షించాలని సీఎం ఆదేశించినట్టు వివరించారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించేందుకు 40 శాతం మెస్ చార్జీలు పెంచినట్టు తెలిపారు. జార్ఖండ్ ఫలితాలు ప్రజల విజయమని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం సోరేన్ సమిష్టి కషి ఫలితమేనన్నారు. హైదరాబాద్ అభివద్ధికి పదివేల కోట్లు కేటాయించామని త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలుంటాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పంచిన 26 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ధరణి వచ్చిన తర్వాత వాటి పరిస్థితి ఏంటో లెక్కలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వాటిని తిరిగి అర్హులైన పేదలకు పంచుతామని చెప్పారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పాత్ర నిర్మాణాత్మకంగా ఉండాలని సూచించారు. విచ్ఛిన్నకర ధోరణులను వీడాలని కోరారు.

నవచిత్రం

మెప్పించే డిఫరెంట్ లవ్‌స్టోరీ



సిద్ధార్థ్, ఆషిక రంగనాథ్

హీరో సిద్దార్థ్ నటించిన లేటెస్ట్ మూవీ 'మిస్ యు'. ఎస్.రాజశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 29న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. 7 మైల్స్ పర్ సెకండ్ సంస్థ నిర్మాణంలో ఈ చిత్రం రూపొందింది. ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. చాలా రోజుల తరువాత ఒక క్యూట్ లవ్‌స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. గిబ్రాన్ ఈ సినిమా కోసం ఎనిమిది సూపర్బ్ ట్యూన్స్ ఇచ్చారు. మ్యూజికల్ లవ్ స్టోరీగా ఈ సినిమా ఈనెల 29న థియేటర్స్‌లో రాబోతోంది. ఈ సినిమా మీద నాకు నమ్మకం ఉంది. ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమాను బాగా రిసీవ్ చేసుకుంటారని అనిపిస్తుంది. శామ్యూల్ మాత్యూస్ మంచి ప్యాషన్ ఉన్న నిర్మాత. ఈ జనరేషన్‌లో ఉన్న యంగ్‌స్టర్స్ ఈ మూవీకి బాగా కనెక్ట్ అవుతారు. తెలుగులో రిలీజ్ చేస్తున్న ఏషియన్ సురేష్ సంస్థకు కృతజ్ఞతలు' అని తెలిపారు.



నితిన్, శ్రీలీల

'రాబిన్‌హుడ్' పక్కా హిట్ సినిమా

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ఈ మూవీ డిసెంబర్ 25న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతుంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో నితిన్ మాట్లాడుతూ,'నేను, వెంకీ కలిసి చేస్తున్న సెకండ్ ఫిల్మ్ ఇది. 'భీష్మ' మ్యాజిక్ ఈ సినిమాతో మళ్లీ రిపీట్ అవుతుందని స్ట్రాంగ్‌గా బిలీవ్ చేస్తున్నాను. శ్రీలీలతో కూడా ఇది నా సెకండ్ ఫిల్మ్. ఈ సినిమాతో హిట్ పెయిర్ అనిపించుకుంటాం. ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్, సాంగ్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇంత మంచి సాంగ్స్ ఇచ్చిన జీవి ప్రకాష్‌కి థ్యాంక్స్. నిర్మాతలు నవీన్, రవి లేకపోతే ఈ సినిమా ఇంత రిచ్‌గా, ఇంత గ్రాండ్‌గా వచ్చేది కాదు. నా కెరీర్‌లోనే ఇది హయ్యస్ట్ బడ్జెట్ సినిమా. నిర్మాతలు పెట్టిన డబ్బుని రెంట్టింపుతో సహా మీనుంచి దోచుకొని డిసెంబర్ 25న 'రాబిన్‌హుడ్' వారికి ఇస్తాడు. నమ్మకంగా చెబుతున్నా ఈ క్రిస్మస్ మాదే' అని అన్నారు.

'ఇది నాకు చాలా స్పెషల్ ఫిలిం. నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర చేశాను. ఇప్పటివరకు కమర్షియల్ హీరోయిన్‌గా, డాన్సింగ్ స్పెషల్‌గా ప్రేక్షకులు చూశారు. ఈ సినిమాలో నా క్యారెక్టర్ పెర్ఫార్మెన్స్ గురించి స్పెషల్‌గా మాట్లాడుకుంటారని భావిస్తున్నాను' అని శ్రీలీల చెప్పారు.

డైరెక్టర్ వెంకీ కుడుముల మాట్లాడుతూ, 'ఇది చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అవుతుంది. అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.

'సినిమా చాలా బాగా వచ్చింది. డెఫినెట్ చాలా పెద్ద సినిమా అవుతుంది' అని నిర్మాతలు అన్నారు.

నాన్‌స్టాప్‌గా నవ్విస్తాం..



వెంకటేష్, ఐశ్వర్య రాజేష్

వెంకటేష్ ఎక్స్-కాప్‌గా కనిపించనున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదలకు సిద్ధమవుతోంది. ఆద్యంతం నవ్వించే సినిమాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు.

ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'గోదారి గట్టుకు..' సంబంధించిన అప్‌డేట్‌ని మేకర్స్ ఇచ్చారు. ఈ పాటను డిసెంబర్ 3వ తేదీన రిలీజ్ చేయబోతున్నారు. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన ఈ పాటను సంగీత దర్శకుడు రమణ గోగుల పాడటం విశేషం. ఈ బ్రీజీ రొమాంటిక్ మెలోడీకి భాస్కరభట్ల లిరిక్స్ రాశారు. ఈ సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ జంట అందర్నీ అలరిస్తోంది.

హీరో వెంకటేష్, మరో హీరోయిన్ మీనాక్షి చౌదరితో కలసి ప్రస్తుతం డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అద్భుతమైన లోకేషన్లలో ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



దీపికా పిల్లి, ప్రదీప్ మాచిరాజు

ఎవడో ఈడి కొచ్చినాడు..

హీరో ప్రదీప్ మాచిరాజు తాజాగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ యూనిక్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను దర్శక ద్వయం నితిన్, భరత్ రూపొందిస్తున్నారు. దీపికా పిల్లి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ నిర్మిస్తోంది.

ఈ చిత్రంలోని 'లే లే లే లే లే..ఎవడో ఈడి కొచ్చినాడు చూడు..' అంటూ సాగే పాటను విడుదల చేసి మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్లను ప్రారంభించారు. రధన్ స్కోర్ చేసిన ఈ ఈ పాటను హీరో మహేష్ బాబు లాంచ్ చేశారు. ప్రదీప్ ఫస్ట్ సినిమా '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' లోని 'నీలి నీలి ఆకాశం..' సాంగ్ ఎంత పెద్ద హిట్ అయ్యిందో తెలిసిందే. అదేవిధంగా ఈ పాట కూడా అదే స్థాయిలో పాపులర్ అవ్వడానికి అన్ని ఎలిమెంట్స్‌ని కలిగి ఉంది. ఉదిత్ నారాయణ్ తన మెస్మరైజ్ చేసే వాయిస్ పాటకు అదనపు ఆకర్షణను తీసుకువచ్చింది. లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీని అందంగా ప్రజెంట్ చేసే రీతిలో శ్రీధర్ ఆవునూరి లిరిక్స్ అందించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ మరింత అందాన్ని తీసుకొచ్చింది. బ్లైండ్‌ఫోల్డ్ గేమ్ ద్వారా చిత్రీకరించబడిన ప్రేమకథ ఒక యూనిక్, క్రియేటివ్ కాన్సెప్ట్. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి, అద్భుతమైన గ్రామీణ నేపథ్యంలో అందంగా ఈ పాటను షూట్ చేశారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా 'వీకెండ్'

వి ఐ పి శ్రీ హీరోగా, ప్రియా దేషపాగ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'వీకెండ్'. ఖడ్గధార మూవీస్ బ్యానర్ పై ఐ డీ భారతీ నిర్మిస్తున్నారు. బి. రాము రచయిత, దర్శకులు. పక్కా కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా చీరాలలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రారంభమైంది. ఎస్‌ఆర్‌ఐ లేళ జయ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు అజయ్ ఘోష్ క్లాప్ కొట్టారు. తొలిషెడ్యూల్ అంతా చీరాలలోనే నిర్వహిస్తామని దర్శక,నిర్మాతలు తెలిపారు. అజయ్, ఎస్తర్, డెబోర, సునిత, జబర్దస్త్ అశోక్, యోగి ఖత్రే నటిస్తున్న ఈచిత్రానికి సమర్పణ : ఈశ్వర్ - నిఖిత, డిఓపి : యూఎస్ విజయ్, సంగీతం : ఎస్ అర్జున్, ఎడిటింగ్ : ఈ ఎస్ స్టూడియో.



విపి శ్రీ, అజయ్ ఘోష్

ఆ కోటలోని రహస్యాలు ఏంటి?

'శ్రీ గాంధారి' అంటూ హన్సిక భయపెట్టిస్తూనే నవ్వించేందుకు వస్తున్నారు. మసాలా పిక్స్ బ్యానర్‌పై ఆర్ కన్నన్ దర్శకత్వం వహిస్తూ నిర్మించారు. తమిళంలో రూపొందిన ఈ చిత్రాన్ని సరస్వతి డెవలపర్స్‌తో కలిసి లచ్చురామ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాజు నాయక్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ మూవీని వీకేఆర్ (విక్రమ్ కుమార్ రెజింతల) సమర్పిస్తున్నారు. హిందూ ట్రస్ట్ కమిటీకి హెడ్ ఆఫీసర్‌గా పనిచేసే యువతిగా హన్సిక ఈ చిత్రంలో నటించారు. ఆమె గంధర్వ కోట పురాతన స్మారకానికి సంబంధించిన పరిశోధన ప్రాజెక్ట్‌ను చేపట్టడంతో అసలు కథ మొదలవుతుంది. ఈ కోటలో ఉన్న ఎన్నో రహస్యాల్ని ఆమె ఎలా బయటకు తీసుకువచ్చారు? అనేదే ఈ సినిమా. ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు రాజు నాయక్ సన్నాహాలు చేస్తున్నారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నిరసనలు విరమించిన పీటీఐ

త్వరలో కొత్త వ్యూహం రూపొందిస్తామని వెల్లడి



ఇస్లామాబాద్ : మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వీధి నిరసనలు నిర్వహించిన పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులు తమ ఆందోళనలను విరమించారని స్థానిక మీడియా బుధవారం తెలిపింది. మంగళవారం రాత్రి రాజధాని ఇస్లామాబాద్‌లో భద్రతా బలగాలు దాడి చేసి, వందలాదిమందిని అరెస్టు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. తాత్కాలికంగా నిరసనలను విరమించినట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపిందని జియో న్యూస్ బ్రాడ్‌కాస్టర్ తెలిపింది. సెంట్రల్ ఇస్లామాబాద్‌లో ఒక ప్రాంతంలో లైట్లన్నింటినీ తీసివేసి, పెద్ద మొత్తంలో బాష్పవాయు గోళాలను ప్రయోగించారని జియో న్యూస్, ఎఆర్‌వై బ్రాడ్‌కాస్టర్ తెలిపాయి. దీంతో నిరసనకారులు మొత్తంగా చెల్లా చెదురైపోయారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం నగర కార్మికులు ఆ ప్రాంతంలోని శిధిలాలను తొలగించి, షిప్పింగ్ కంటెయినర్లను కొన్నింటిని తొలగించారు. భారీ బందోబస్తు చర్యలతో నిండిన ఆ ప్రాంతంలో ఆందోళనకారులు వాహనాలు చాలావరకు అక్కడే వుండిపోయాయి. పార్టీ నిరసనలను విరమించిందని పెషావర్ నగర అధ్యక్షుడు తెలిపారు. సరైన రీతిలో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త వ్యూహం రూపొందిస్తామని చెప్పారు.

విప్లవ నేత కాస్ట్రోకు అరుణాంజలి

వర్ధంతి సందర్భంగా హాజరైన జనసంద్రం



హవానా : మన జ్ఞాపకాల్లో వారు రగిలించిన జ్వాలలు రగులుతున్నంత కాలమూ వీరులకు మరణం లేదు. ఇందుకు విరుద్ధంగా, లక్షలాదిమంది ప్రజల ఆకాంక్షలకు, గౌరవానికి చిహ్నంగా మారిన వ్యక్తులను మనం విస్మరిస్తే ఇక మనం మన గమ్యాన్ని పోగొట్టుకున్నట్లే. ఒక వెయ్యి సంవత్సరాలు గడిచినా కూడా హవానా యూనివర్శిటీ మెట్లు ప్రతి నవంబరు 25వ తేదీన జన సంద్రంతో పులకిస్తాయి. ఆ జనాల మదిలో ఫైడెల్ కాస్ట్రో పేరు ప్రతిధ్వనిస్తూ వుంటుంది. ఆ మహా విప్లవ వీరుడు మనల్ని వదిలివెళ్ళి 8సంవత్సరాలైన సందర్భంగా ఈ సోమవారం కూడా ఇవే దృశ్యాలు చోటు చేసుకున్నాయి.

ఈ నెల 25 సాయంత్రం జరిగిన కార్యక్రమానికి క్యూబా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఫస్ట్ సెక్రటరీ, దేశ అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్, పొలిటికల్ బ్యూరో సభ్యులు, పార్లమెంట్ అధ్యక్షుడు, సెంట్రల్ కమిటీ నిర్వహణా కార్యదర్శి ప్రభృతులు హాజరయ్యారు. తమ ప్రియతమ నేతకు విప్లవాంజలి ఘటించారు.కాస్ట్రో చూపిన దారిలో ముందుకు సాగుతూ, ఆయన కన్న కలలు న్యాయం, శాంతిలను సాకారం చేయడమే మనం ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని రివల్యూషనరీ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (ఎఫ్ఎఆర్) పొలిటికల్ డైరెక్టరేట్ అధిపతి అయిన మేజర్ జనరల్ విక్టర్ రోజో రామోస్ పేర్కొన్నారు.

నేడు మనం పెను సవాళ్ళను ఎదుర్కొంటున్నాం, అనేక ప్రతికూలతలు, పరిమితులు కూడా వున్నాయి. అయితే అవసరాలు వనరులను అధిగమించవచ్చు కానీ సంకల్పశక్తిని, మనిషి సృజనాత్మకతను అధిగమించలేవని మనకు చూపించిన మహా నేతను మనం ఇక్కడ స్మరించుకోవాల్సి వుందని రోజో రోమోస్ వ్యాఖ్యానించారు.

6న ఎరాయ లైఫ్‌స్పేస్ షేర్ల విభజన

హైదరాబాద్ : ఎరాయ లైఫ్‌స్పేస్ లిమిటెడ్ షేర్ల విభజన రికార్డ్ తేదిని డిసెంబర్ 6గా నిర్ణయించినట్లు తెలిపింది. రూ.10 ముఖ విలువ కలిగిన షేర్లను ఒక్కోదాన్ని పది ఈక్విటీ షేర్లుగా విభజించడానికి అక్టోబర్ 19న ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. తాజాగా షేర్ల విభజన తేదిని ప్రకటించింది. ఇటీవల ఈ సంస్థ ఎబిక్స్‌క్యాష్ గ్లోబల్ సర్వీసెస్, టెలికం, ఇ-కామర్స్ సంస్థల నుంచి కాంట్రాక్టులను పొందినట్లు పేర్కొంది

హెచ్‌డీఎఫ్‌సీ నుంచి ప్రగతి సేవింగ్స్ ఖాతాలు

న్యూఢిల్లీ : గ్రామీణ, చిన్న పట్టణాల ప్రజల బ్యాంకింగ్ అవసరాలను తీర్చేందుకు ప్రత్యేకంగా ప్రగతి సేవింగ్స్ ఖాతాను అందుబాటులోకి తీసుకువచ్చామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. ప్రస్తుతం తమ శాఖల్లో 51 శాతం చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోని 4600 పైగా శాఖల్లో రైతులతో సహా, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు తక్కువ నిర్వహణ వ్యయాలతో ఈ ఖాతాలను జారీ చేయనున్నట్టు తెలిపింది.

పుష్ప2తో సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ జట్టు

హైదరాబాద్ : పుష్ప2 చిత్రంతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ఐటీసీకి చెందిన సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ తెలిపింది. ఇందులో భాగంగా సినిమా విడుదలకు ముందు తాము ప్రత్యేకంగా తయారు చేసిన పరిమిత ఎడిషన్ పుష్ప 2 ప్యాక్‌లను విడుదల చేసినట్టు పేర్కొంది. అల్లు అర్జున్ తన ఐకానిక్ 'పుష్ప' అవతార్‌లో కనిపించే ప్రత్యేకమైన చిత్రాలు ఈ ప్యాక్‌లు కలిగి ఉంటాయని తెలిపింది. వీటిని కొనుగోలు చేసిన వారిలో ఐదుగురిని అల్లు అర్జున్‌ను కలిపించే అవకాశాన్ని కలిపిస్తున్నట్టు పేర్కొంది.

హైదరాబాద్‌లో అరవింద్ ఫ్యాషన్ ఫెస్టివల్

హైదరాబాద్ : తమ వినియోగదారులకు అసాధారణమైన షాపింగ్ అనుభూతిని అందించడానికి రూపొందించబడిన ప్రత్యేకమైన కార్యక్రమం గ్రేట్ ఫ్యాషన్ ఫెస్టివల్‌ను ప్రారంభించినట్టు అరవింద్ స్టోర్ తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేకమైన లగ్జరీ ప్రిమాంటే సూటింగ్ కలెక్షన్‌ను విడుదల చేయటంతో పాటు ఎథ్నిక్‌వేర్, సూట్‌లపై కాంప్లిమెంటరీ స్టిచింగ్ సేవలను పరిచయం చేస్తోన్నట్టు పేర్కొంది. ఈ ఫెస్టివల్‌లో ఉచిత స్టిచింగ్ సేవలు, ప్రత్యేక కలెక్షన్‌లతో అత్యుత్తమ ఫ్యాషన్‌ను పొందవచ్చని తెలిపింది.

బిజినెస్

మధ్యతరగతికి ఆర్థిక సవాళ్లు

పడిపోతున్న ఆదాయాలు | పట్టణ వినిమయంపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ : భారత్‌లోని మధ్యతరగతికి ఆర్థిక సవాళ్లు పెరిగాయి. ఆదాయాలు తగ్గడంతో వారి వినిమయంపైనా ప్రభావం పడుతోంది. మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ నివేదిక ప్రకారం.. మధ్యతరగతిని ముఖ్యంగా మూడు సవాళ్లు వెంటాడుతున్నాయి. ఆర్థిక మందగమనానికి తోడు టెక్నాలజీ సమస్యలు, కుటుంబాల ఆదాయాలు క్షీణించడం. ఒకప్పుడు ఉపాధి పొందడంలో అత్యంత కీలకంగా ఉన్న మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు ఆటోమేషన్, ఇతర సాంకేతికతతో ఆ వర్గం వారికి ఉద్యోగాలను లేకుండా చేస్తోంది. అదే విధంగా కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లోనూ క్లరికల్, సూపర్‌వైజరీ పోస్టులు తగ్గాయి.

"అవుట్‌సోర్సింగ్, ఆటోమేషన్ వాటితో ఖర్చు తగ్గించే చర్యల కారణంగా అనేక మేనేజర్ స్థాయి పోస్టులు అదృశ్యమవుతున్నాయి. ఎంతో కొన్ని ఉద్యోగాలు పోతున్నాయని ఇటీవల విప్రో చైర్మెన్ ప్రేమ్‌జీ వ్యాఖ్యలే నిదర్శనం. వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఇబ్బందులు పెరుగుతున్నాయి." అని నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ మాజీ చైర్మెన్ పిసి మోహనన్ పేర్కొన్నారు. కరోనా తర్వాత భారత వృద్ధి మందగించింది. ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలోకి నెట్టబడింది. 2008 ఆర్థిక పతనం వంటి సంక్షోభం కాకపోయినప్పటికీ 2024-25 సెప్టెంబర్ త్రైమాసికంలో కార్పొరేట్ ఆదాయాలు భారీగా తగ్గాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో ఇదే అత్యంత క్షీణత. ఆర్థిక వ్యవస్థలలో ఇటువంటి తిరోగమనాలు సాధారణమే అయిప్పటికీ.. మధ్యతరగతిపై వాటి ప్రభావం తీవ్రంగా ఉంది. వినియోగాన్ని భారీగా తగ్గిస్తుంది.



ఆర్‌బీఐ గణంకాల ప్రకారం.. గడిచిన 50 ఏండ్లలో ఎప్పుడూ లేని విధంగా జీడీపీలో కుటుంబాల పొదుపు భారీగా పడిపోయింది. పెరుగుతున్న గృహ రుణాల భారం పరిస్థితిని మరింత దిగజార్చింది. స్థూల పొదుపులు స్థిరంగా ఉన్నప్పటికీ, అన్‌సెక్యూర్డ్ రుణాలు పెరగడం నికర పొదుపులను దెబ్బతీస్తున్నాయి.

తక్కువ ఆదాయాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. మధ్యతరగతి ప్రజల వ్యయాలు తగ్గడంతో పట్టణ వినిమయం తగ్గిందని ఇటీవల నెస్లే ఇండియా ఎండీ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. మధ్యతరగతిలోని ప్రతికూల పరిస్థితుల వల్లే అమ్మకాలు పడిపోతున్నాయన్నారు. ఆహార పానీయాల రంగంలో రెండంకెల వృద్ధి రేటు ఇప్పుడు 1.5 శాతం నుంచి 2 శాతానికి పడిపోయిందని నారాయణన్ తెలిపారు.

ఇదే తరహాలో హిందుస్థాన్ యూనిలీవర్ సీఈఓ రోహిత్ జావా పేర్కొన్నారు. పట్టణ మార్కెట్లలో ముఖ్యంగా పెద్ద నగరాల్లో వినిమయం తగ్గిందన్నారు. మొత్తం ఎఫ్ఎంసీజీ కొనుగోళ్లలో మూడింటిలో రెండో వంతూ మధ్యతరగతి ప్రజలదే కావడం విశేషం. వచ్చే త్రైమాసికాల్లో ఈ తిరోగమనం కొంత తగ్గొచ్చని మార్సెల్లస్ రిపోర్ట్ పేర్కొంది. అయితే సాంకేతిక అంతరాయాలు, కుటుంబాల పొదుపులో మాత్రం ఒత్తిడి ఉండొచ్చని విశ్లేషించింది.

రాష్ట్రంలో ఏ హామీ అమలు కావట్లేదు

- ప్రశ్నిస్తే వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు : ఢిల్లీలో కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికలకు ముందు డిక్లరేషన్లు, గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీలు అంటూ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయట్లేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. అదేమని ప్రశ్నిస్తే నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. బుధవారం రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రధాని నరేంద్రమోడీని కలిసిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వరరెడ్డి తన కుమార్తె వివాహ పనులు ఉన్నందును హాజరు కాలేదని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైతు రుణమాఫీ ఇప్పటికీ పూర్తికాలేదనీ, ఫించన్ల పెంపు జరగలేదని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఈ దశలో విజయోత్సవాలు చేయడం ఏంటని ఎద్దేవా చేశారు. మూసీపై సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తే, ఆయన నా డీఎన్‌ఏ గురించి మాట్లాడుతున్నారనీ, తాను పార్టీలు మారిరాలేదని ఘాటుగా సమాధానం చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ వైఫల్యాలపై డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

సామాజిక బహిష్కరణలు సహించేది లేదు

- డీజీపీకి బీసీ కమిషన్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీల పేరుతో బీసీలను సామాజిక బహిష్కరణలు చేస్తే సహించేది లేదని బీసీ కమిషన్ హెచ్చరించింది. అలాంటివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం డీజీపీకి కమిషన్ చైర్మెన్ జీ నిరంజన్ లేఖ రాసారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ (బీసీ కమిషన్) ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బహిరంగ విచారణల్లో గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో బీసీ వర్గాల ప్రజలను నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో సామాజిక బహిష్కరణలకు గురిచేస్తున్న ఉదంతాలు తమదృష్టికి వచ్చాయని తెలిపారు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు.

ఆర్టీసీ కార్తికమాసం దోపిడీ

- మెజారిటీ సంఘాల జేఏసీ ఆరోపణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్తీకమాసం వనభోజనాల పేరుతో ఆర్టీసీ యాజమాన్యం రూ.1.20 కోట్ల దోపిడీకి తెరలేపిందని టీజీఎస్‌ఆర్టీసీ మెజారిటీ కార్మిక సంఘాల జేఏసీ ఆరోపించింది. సంస్థలో పనిచేస్తున్న 40వేల మంది కార్మికుల దంపతులు సహా మొత్తం 80 వేల మందికి ఒక్కొక్కరికి రూ.150 చొప్పున ఖర్చు చేసేందుకు యాజమాన్యం సిద్ధమైందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కార్మికులు ఎవరూ కోరుకోలేదనీ, యాజమాన్యం ఆర్టీసీ సొమ్మును దోచుకొనేందుకే దీన్ని నిర్వహిస్తున్నదని జేఏసీ చైర్మెన్ ఇ అశ్వత్థామరెడ్డి (టీఎమ్‌యూ), కన్వీనర్ ఎమ్ నరేందర్ (ఎన్ఎమ్‌యూ), కో కన్వీనర్లు ఎర్రస్వామి కుమార్ (బీఎమ్ఎస్), పున్న హరికిషన్ (ఎస్‌టీఎమ్‌యూ) విమర్శించారు. డ్యూటీల్లో ఉన్న కార్మికులు, వారాంతపు సెలవుల్లో ఉన్న వారు, ఫస్ట్‌షిఫ్ట్ చేసి ఇండ్లకు వెళ్లినవారు, సెకండ్ షిఫ్ట్ చేసే కార్మికులు, స్పెషల్ ఆఫ్ డ్యూటీలో ఉన్నవారు, తిరుపతి, బెంగుళూరు వంటి లాంగ్ సర్వీసు డ్యూటీల్లో ఉన్నవారు, చిన్న పిల్లలు ఉన్నవారు వనభోజనాలకు భార్యలతో కలిసి ఎలా వస్తారని ప్రశ్నించారు. గతంలో కూడా గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్, ప్రగతి చక్ర అవార్డుల పేరుతో సంస్థ సొమ్మును దోపిడీ చేశారని ఆరోపించారు. కార్మికులు ఎవరూ కార్తీకమాస వనభోజనాలకు హాజరుకావొద్దనీ, నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. యాజమాన్యానికి కార్మికులపై అంత ప్రేమ ఉంటే జనవరి మాసం జీతంతో అదనంగా రూ.300 చొప్పున వారి అక్కౌంట్లలో జమచేయాలని డిమాండ్ చేశారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్పీకర్ పుట్టిన రోజు సందర్భంగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆయన్ను అధికార నివాసంలో కలిశారు. ప్రసాద్ కుమార్ కు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మిషన్ భగీరథ నీటిపై విశ్వాసం కల్గించాలి

- ఆర్వో ప్లాంట్లు, బోరు నీళ్ల వాడకాన్ని తగ్గించాలి
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగు నీటిపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. రూ. వేల కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ వ్యవస్థను ఏర్పాటు చేసినా, ప్రజలు ఇంకా ఆర్వో ప్లాంట్లు, బోరు నీళ్లపై ఆదారపడటం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మిషన్ భగీరథ తాగునీరుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవువున్న శుద్ధమైన తాగు నీటిపై ప్రతి గ్రామ పంచాయితీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆర్వో నీరు, బోరు నీటి ద్వారా దీర్ఘకాలంలో ఏ విధమైన సమస్యలు తలెత్తుతాయో వివరించాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతను ప్రజలకు వివరించేలా రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ఫిబ్రవరి, మార్చి మాసాల్లో క్రాష్ ప్రోగ్రాం నిర్వహించి డిపార్ట్ మెంట్ అధికారులనూ, పంచాయతీలను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డిఎస్.లోకేష్ కుమార్, కృపాకర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఎల్బీ స్టేడియంలో వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- ఆ వేడుకలకు అన్ని చర్చిల అధిపతులను ఆహ్వానించండి
- 95 అసెంబ్లీ నియోజకవర్గాలు, జీహెచ్ఎంసి పరిధిలో 200 ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహణ

క్రిస్మస్ సెలబ్రేషన్ కమిటీ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణపై బుధవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెలబ్రేషన్ కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండు వందల ప్రాంతాలు, 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేయాలన్నారు. జీహెచ్ఎంసితో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం హాజరవుతున్న వేడుకలకు రాష్ట్రంలో ఉన్న అన్ని చర్చిల అధిపతులు పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. అన్ని చర్చిల అధిపతులకు, క్రైస్తవ మత పెద్దలకు క్రిస్మస్ వేడుకల ఆహ్వానాలను అందజేయాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు సూచించారు. సోషల్ వర్క్, మెడికల్, ఎడ్యుకేషన్, లిట్రరీ, స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ రంగాల్లో అవార్డులకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా లక్ష రూపాయలు, అదే విధంగా సోషల్ వర్క్, మెడికల్, ఎడ్యుకేషన్ అవార్డులకు ఎంపికైన సంస్థలకు రెండు లక్షల రూపాయల చెక్కులను అందిస్తామన్నారు. అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రధాన పత్రికల్లో నోటిఫికేషన్ వేయాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబితను ఆదేశించారు. క్రిస్మస్ వేడుకలను అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా రూ.6,000 పెన్షన్

వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ: మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగులకు ప్రకటించిన రూ.6,000 పెన్షన్‌ను వీలైనంత త్వరగా అందజేస్తామని వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. త్వరలోనే వారికి సంబంధించిన బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను కూడా నింపనున్నట్టు ఆమె చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో వికలాంగుల క్రీడోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైకల్యమున్నా బలమైన సంకల్పంతో క్రీడల్లో ప్రపంచ స్థాయిలో పతాకాలు సాధించడం చారిత్రక నిర్ణయమని అభినందించారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తున్నామనీ, పారా ఒలంపిక్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన జీవన్ జీ దీప్తికి రూ.ఒక కోటి నగదు, 500ల గజాల స్థలం ఇచ్చినట్టు గుర్తుచేశారు. గ్రూప్ 2 ఉద్యోగాన్ని త్వరలోనే ఇవ్వనున్నట్టు తెలిపారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలియజేశారు.

వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ వికలాంగ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అధునాతనమైన పరికరాల కోసం రూ.3 లక్షలు రూపాయలు కేటాయించేలా మేనేజ్ మెంట్ కమిటీలో తీర్మానం చేసినట్టు తెలిపారు. జీవన్ జీ దీప్తికి, రూ.ఒక కోటితో పాటు 500 ల గజాల ఇంటి స్థలం, గ్రూప్ 2 ఉద్యోగం కేటాయించి నందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకు, శాట్స్ చైర్మెన్ శివసేనారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఉమెన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల్లో వారి వెయిటేజీ మార్కులను పరిగణనలోకి తీసుకోవద్దు

తెలంగాణ నర్సింగ్ సమితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో 2017, 2022 నోటిఫికేషన్‌లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల కోసం వెయిటేజీ మార్కులను ఉపయోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారి వెయిటేజీ మార్కులను 2024 నోటిఫికేషన్‌లో పరిగణనలోకి తీసుకోవద్దని తెలంగాణ నర్సింగ్ సమితి (టీఎన్ఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎన్ఎస్ అధ్యక్షులు ధనుంజయ్ కంపాటి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఇలాంటి వారు నర్సింగ్ ఆఫీసర్లుగా స్థిరపడ్డారని తెలిపారు. 2024 నోటిఫికేషన్ లో దాదాపు 1,500 నుంచి 2,000 మంది వరకు ప్రభుత్వోద్యోగులు నో ఆబ్జెక్షన్ లెటర్ తీసుకోకుండా, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ పోటీ పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఇది వరకే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా వెయిటేజీ మార్కులు క్లెయిమ్ చేసుకుని వీరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. మరోసారి వారి వెయిటేజీ మార్కులను పరిగణనలోకి తీసుకుంటే నిరుద్యోగ నర్సింగ్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నో ఆబ్జెక్షన్ లెటర్ సమర్పించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్, సెక్రెటరీని కోరారు.



ప్రజా ప్రతినిధుల అరెస్టులు అక్రమం

- మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధుల అరెస్టులు అక్రమమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు వరుసగా జరుగుతున్నా మాగనూరు పాఠశాలను సందర్శించడానికి వెళ్తారనే నెపంతో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. "పాఠశాలలు సందర్శించడానికి వెళ్తే ప్రభుత్వానికి ఎందుకంత భయం?. పురుగులన్నం మాకొద్దు అని విద్యార్థులు రోడ్డెక్కి నినదిస్తుంటే ప్రభుత్వానికి పట్టింపు లేదు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులకు వెంటనే విడుదల చేయాలి. ఫుడ్ పాయిజన్ వల్ల ఆస్పత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించండి, ఇలాంటి ఘటనలు పునరావృతం చర్యలు తీసుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

నిర్మల్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించండి

సీఎస్‌కు డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్మల్ జిల్లా దిలవార్‌పూర్‌లో ఆర్డీఓ పట్ల ఆందోళనకారుల వ్యవహరించిన తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి వినతి పత్రం అందించింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దిలవార్‌పూర్‌లో ఇథనాల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న గ్రామస్థులతో చర్చలు జరిపేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు వెళ్లిన స్థానిక



ఆర్డీఓ రత్నకల్యాణిని నిరసన కారులు కారులో నుంచి దిగకుండా దిగ్బంధం చేశారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీఓ కారుపై దాడి చేసి ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఐదారు గంటల పాటు కారులోనే ఉండటంతో అస్వస్థకు గురయ్యారన్నారని అన్నారు.

లగచర్ల ఘటన మరవకముందే నిర్మల్ ఘటన చోటు చేసుకోవడం ఉద్యోగులను భయబ్రాంతులకు గురి చేస్తోందని అన్నారు. రెవెన్యూ ఉద్యోగులపై పథకం ప్రకారమే దాడులు జరుగు న్నాయనే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. వరుస ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాద్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసి జేబులో పైసలు నింపుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే ఈ ప్రాజెక్ట్‌కు అన్ని అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. ఆర్భాటాల కోసమే శంకుస్థాపన నాటకమాడుతున్నారని పేర్కొన్నారు. చిన్న కాళేశ్వరంకు రూ.570 కోట్లు ఇస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పినా ఇప్పటి వరకు ఎస్‌ఈ లేరని విమర్శించారు. ఇప్పటికైనా శ్రీధర్‌బాబు వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగంపై కట్టడి

- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్రస్థాయి అవగాహనా సదస్సు
- **26 నుంచి 29 వరకు ఈ కార్యక్రమం : టీజీఏఎన్‌బీ**

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అడ్డుకోవటానికి ఈనెల 26 నుంచి 29 వరకు మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో రాష్ట్రస్థాయి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) బుధవారం తెలిపింది. రాష్ట్రంలో మాదక పదార్థాల జాడ ఇసుమంతైనా కనిపించరాదనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవటానికి టీజీఏన్ఎబీ సర్వశక్తులను ఒడ్డుతూ పని చేస్తున్నదని ఆ విభాగం అధికారులు చెప్పారు. ఇందులో భాగంగా ఒకపక్క , మాదక పదర్థాల అక్రమ రవాణా, వినియోగాన్ని అడ్డుకుంటూనే, మరోపక్క వీటి వినియోగం వలన ఏర్పడిన దుష్పరిణామాలపై అన్ని వర్గాల ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నాలుగురోజుల పాటు విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వివిధ పరిశ్రమల్లో పని చేసే సిబ్బంది, అధికారులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 20 వేలకు పైగా విద్యాలయాలు, 690 యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. అలాగే, అనేక పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలలో యాంటీ డ్రగ్ కమిటీ(ఏడీసీ)లను ఏర్పాటు చేయటం జరిగిందనీ, వీటి ద్వారా ఆయా విద్యా సంస్థల విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా ఏర్పడే దుష్పరిణామాల గురించి వివరించటం జరిగిందని అధికారులు తెలిపారు. అలాగే, 57వేల మంది విద్యార్థులలో ఏడీసీలు అవగాహనను కల్పించగా.. పోలీసులు మరో 60 వేల మందిలో మాదక ద్రవ్యాలపై అవగాహనను కల్పించటం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు దాదాపు రెండు లక్షల మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్‌ను తయారు చేయటానికి కార్యాచరణను రూపొందించి, అమలు చేయబోతున్నట్టు అధికారులు తెలిపారు.

విద్యార్థులు, యువతను డ్రగ్స్‌కు బానిసలుగా చేసి, వారి భవిష్యత్తును అంధకారంలో నింపటానికి మాదక పదార్థాల ముఠా చేస్తున్న ప్రయత్నాలను పూర్తిగా అరికట్టటానికి తాము కృత నిశ్చయంతో ఉన్నామనీ, అందుకు తగిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి, ప్రోత్సహిస్తున్నదని అధికారులు చెప్పారు. వేలాది మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను కూడా యాంటీ డ్రగ్ కార్యచరణలో క్రియాశీల కార్యకర్తలుగా తయారు చేసి, వారి సేవలను కూడా వినియోగించుకుంటున్నామని తెలిపారు.

మై హెూమ్ భుజ 9వ అంతస్తుపై నుంచి పడి వివాహిత మృతి

- సరోగసి కోసం ఒడిశా నుంచి వచ్చిన మహిళ
- లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి నుంచి తప్పించుకునే క్రమంలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

మై హెూమ్ భుజ 9వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి వివాహిత మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన అశ్వితసింగ్(25) సరోగసి ద్వారా పిల్లలను కనడానికి ఓ వ్యక్తి ద్వారా హైదరాబాద్‌కు వచ్చింది. హై మోమ్ భుజ 9వ అంతస్తులో ఉంటున్న రాజేష్‌బాబు అనే వ్యక్తి ఆమెకు పిల్లలను కనివ్వడానికి రూ.10 లక్షల డీల్ కుదుర్చుకున్నాడు. అయితే నెలరోజులుగా మృతురాలిని బయటకు వెళ్లనివ్వకుండా రాజేష్ తన ఫ్లాట్‌లోనే బంధించాడు. కనీసం ఆమె భర్తను కూడా కలవనివ్వలేదు. దాంతో పాటు ఆమెను లైంగికంగా వేధించాడు. దాంతో రాజేష్‌బాబు ప్రవర్తన నచ్చక ఆమె పారిపోవడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో 9వ అంతస్తు నుంచి కిందపడి చనిపోయింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

హకోతుల బెడద

- దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్న వైనం
- పంటల ధ్వంసం.. బెంబేలెత్తుతున్న జనం



నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లాలో కోతుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడి చేస్తున్నాయి.. ఏ పంటా చేతికొచ్చే పరిస్థితి లేదు. పెద్దవూర మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కోతులు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తూ హడలెత్తిస్తున్నాయి. నాయినవానికుంట, పర్వేదుల, చలకుర్తి, బోనూతల, కుంకుడు చెట్టుతండా, నీమా నాయక్‌తండా, బెట్టేలతండా, కోమటి కుంటతండా, చలకుర్తి, ఉట్లపల్లి గ్రామాల్లో ప్రజలు కోతులు భయంతో వణికిపోతున్నారు. పిల్లలపై, వృద్ధులపై దాడి చేస్తూ గాయపరుస్తు న్నాయి. కోతుల దాడిలో గాయపడిన వారు టీకాలు తీసుకోవడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో కిరాణ సామాన్లు ఉప్పు, పప్పు కొనుక్కోవడానికి వెళ్లాలన్నా భయపడుతూ వెళ్తున్నారు. అంతేకాకుండా పంటలను ధ్వంసం చేస్తుండటం వల్ల వేరుశనగ, పెసలు, కందులు, మొక్కజొన్న, జొన్న, బొబ్బర్లు, కూరగాయల తోటలు వేయడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి పైరు పొట్టదశకు రాగానే కోతులు పొట్టలను కొరికేస్తున్నాయి. పంటలను రక్షించుకు నేందుకు ప్రయత్నం చేస్తున్న రైతులపైనా కోతులు దాడులు చేస్తున్నాయి. చివరికి ఇండ్లల్లో చొరబడి అన్నం, కూరలు తింటున్నాయని, వెళ్లగొట్టబోతే దాడి చేస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. కోతుల నుంచి పంటలను, తమను కాపాడాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకం వంట ధరల పెంపు

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం (పీఎం పోషణ్) వంట ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ అర్యదర్శి జేబీ నాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలవాటికా, ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి వంట ధర రూ.6.19 వరకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి వంట ధర రూ.9.29కు పెంచామని తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి చొప్పున నిధులను భరిస్తాయని వివరించారు. అంటే ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఇచ్చే వంట ధర రూ.6.19లో కేంద్రం రూ.3.71, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.48 భరించాలని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఇచ్చే వంట ధర రూ.9.29లో కేంద్రం రూ.5.57, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.72 నిధులను ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ పెరుగుదల వచ్చేనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మధ్యాహ్న భోజన పథకం అమలుకు సంబంధించి ఉత్తర్వులను జారీ చేస్తుంది. రాష్ట్రంలో చివరి సారిగా 2020, జనవరి 28న మధ్యాహ్న భోజన పథకం వంట ధరలను ప్రభుత్వం పెంచింది. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి వంట ధర రూ.4.48, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.6.71 ఖర్చు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల వరకే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మొత్తం నిధులను భరించి మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నది.

క్వింటాల్‌కు ఐదు కిలోల కోత

ధాన్యం తూకంలో దోపిడీ

- రైతాంగం నిస్సహాయత



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు, మిల్లర్లు.. రైతులను ఎడాపెడా దోచుకుంటున్నారు. క్వింటాల్‌కు 5 కిలోల మేరకు కోత పెడుతుండటంతో రైతాంగం భారీగా నష్టపోతోంది. ఎకరాకు 40 క్వింటాళ్ల ధాన్యం పండించిన రైతు సగటున క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున 2 క్వింటాళ్ల ధాన్యాన్ని కోల్పోతున్న పరిస్థితి ఉంది. సన్నాలైనా, దొడ్డు రకాలైన తూకంలో కోతలు విధించడం సర్వసధారణం అయిపోయింది. రైతులను దబాయించి మరీ ధాన్యం తూకంలో కోతలు విధిస్తుండటం, ప్రశ్నించినా దోపిడీ ఆగకపోవడం పట్ల రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. అలాగే, కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్లు కరువయ్యాయి. రైతుల సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా నిర్వాహకులుగాని, అధికారులు గాని స్పందించకపోవడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితులు చాలాచోట్ల ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగే తూకంలో మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి. హన్మకొండ జిల్లాలో శనివారం నాటికి 31,701 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఇందులో క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున కోత పెట్టగా జిల్లాలో సుమారు 1,268 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు నష్టపోయారు. హన్మకొండ జిల్లాలో 157 కొనుగోలు కేంద్రాలు కేటాయించగా 148 మాత్రమే ప్రారంభించారు. వాటిలో ఐకేపీకి సంబంధించి 37, పీఏసీఎస్‌కు చెందిన 83 కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన 28 కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదు. 9 కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం. ప్రారంభించిన ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో మోసాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులు 2 కిలోలు కోత పెడితే, కొనుగోలు కేంద్రం నుంచి మిల్లర్ల వద్దకు వెళ్లిన ధాన్యంలోనూ మిల్లర్లు 3 కిలోలను కోతపెడుతున్నారు. మొత్తంగా రైతులు 5 కిలోల మేరకు ధాన్యాన్ని ప్రతి క్వింటాల్‌కు నష్టపోతున్నారు. వివిధ నాణ్యతా ప్రమాణాల నెపంతో నిర్వాహకులు రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. ఈ విషయమై ఎంత మంది అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండాపోతుందని రైతులు వాపోతున్నారు. ఈ మోసాలపై అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషించడం గమనార్హం. సివిల్ సప్లయ్ అధికారులు ఈ వ్యవహారాన్ని చూసీచూడనట్టు ఉండటంతో ఈ దందా కొనసాగుతోంది. అలాగే, కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్లు కరువ య్యాయి. జిల్లా కలెక్టర్లు ధాన్యం కొనుగోలుకు సంబంధించి సన్నాహక సమీక్షా సమావేశాలు నిర్వహించిన సందర్భంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్లు రైతులకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. రైతులే స్వయంగా టార్పలిన్లు సమ కూర్చుకొని ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది.

పట్టించుకోరేం..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడిపై రైతులు, రైతు సంఘాలు ఎన్ని విమర్శలు చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, మటి పెల్లలు, చెత్తాచెదారం, గన్నీ బ్యాగుల పేరిట తరుగు తీయడంలో భాగంగా భారీగా కోత పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఓ పద్ధతిలో కోత పెడితే మిలర్లు అంతకు రెట్టించి కోత పెడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపో తున్నారు. ఆరుగాలం కష్టించి క్వింటాల్ ధాన్యానికి 5 కిలోలు నష్టపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా మమ్మల్ని మోసం చేస్తున్నారని, ఎంత మొత్తుకున్నా తమ మొర ఆలకించేటోళ్లు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోసం చేసేందుకు ఎవ్వరికైనా రైతులే దొరుకుతున్నారని వాపోతున్నారు.

30న రైతు పండుగను విజయవంతం చేయాలి

- విశ్వాసం కోల్పోయిన ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి అన్నారు. రైతులు, ప్రజలు ఆ పార్టీల మాటలు నమ్మొద్దని కోరారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే జిల్లా రైతు పండుగ సదస్సును విజయవంతం చేయాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం మీడియా సెంటర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి చిన్న అంశాన్ని భూతద్దంలో చూపడమే ధ్యేయంగా ప్రతిపక్ష పార్టీల నాయకులు పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మక పాత్రను పోషించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా సంకుచిత మనస్తత్వంతో ఇష్టారితిన వ్యవహరిన్నాయని అన్నారు. ప్రజలు తిరస్కరించడం వల్ల అధికారం కోల్పోయిన అసహనంతో ఒక పార్టీ, మతతత్వ వాదంతో అడ్డదారిన అందలం ఎక్కేందుకు మరికొన్ని పార్టీలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా రూ.రెండు లక్షల వరకు రుణమాఫీని చేశారని వివరించారు. కొన్ని అంశాల్లో సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ డబ్బులు రైతులకు జమ కాలేదనీ, త్వరలోనే వారికి కూడా రుణ మాఫీ జరిగి తీరుతుందని అన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులోని భూత్పూర్, అమిస్తాపూర్ ప్రాంతంలో ఈనెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రజలు, రైతులను ఉద్దేశించి మాట్లాడతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నుంచి ఈనెల 30 వరకు భూత్పూర్, అమిస్తాపూర్ ప్రాంతంలో మూడు రోజులపాటు రైతు పండుగ సదస్సు జరగనుందని వివరించారు. ఈ సదస్సు ఎగ్జిబిషన్‌లో 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారనీ, వ్యవసాయం దాని అనుబంధ సంస్థలకు సంబంధించిన అంశాలను ప్రదర్శిస్తారని వివరించారు. గురువారం ఈ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బందూలాల్, విశ్రాంత వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం గురుకులంలో విద్యార్థి ఆత్మహత్య



(ఫైల్)

బైక్‌పై ఆస్పత్రికి తరలింపు!

విద్యార్థి సంఘాలు, వివిధ పార్టీల ధర్నా

నవతెలంగాణ-మదనాపురం

వనపర్తి జిల్లా మదనాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి టి.ప్రవీణ్(14) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, మృతిపై అనుమానాలున్నాయంటూ కుటుంబీకులు, విద్యార్థి సంఘాలు, వివిధ పార్టీల నాయకులు ధర్నా చేశారు. కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల సిబ్బంది, కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మదనాపురం మండల పరిధిలోని కొన్నూర్‌కు చెందిన తప్పెడ శ్రీనివాస్, సత్యమ్మ దంపతులు తమ చిన్న కుమారుడు ప్రవీణ్‌ను మదనాపురం గురుకుల పాఠశాలలో చేర్పించారు. మంగళవారం కబడ్డీ ఆడుతుండగా తలకు గాయం కావడంతో పాఠశాల సిబ్బంది చికిత్స చేయించారు.ఆ విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. బుధవారం ఉదయం అల్పాహారం తరువాత అందరూ తరగతి గదుల్లోకి వెళ్లగా..ప్రవీణ్ తలనొప్పి వస్తుందని ఉపాధ్యాయులకు చెప్పి విశ్రాంతి గదికి వెళ్లాడు. ఆ తరువాత కొద్ది సేపటికే ఫ్యాన్‌కి ఉరేసుకున్నాడు.అది గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పగా..వెంటనే మదనాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్ప టికే విద్యార్థి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

టీటీడీ బోర్డు చైర్మెన్‌ను కలిసిన భూపాలపల్లి ఎమ్మెల్యే



నవతెలంగాణ-భూపాలపల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు చైర్మెన్ బీఆర్ నాయుడుని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు, తన (ఎమ్మెల్యే) సిఫారసు లేఖల ద్వారా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను అనుమతించాలని కోరారు. ఈ సమయంలో అక్కడ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు ఉన్నారు.

సెప్టిక్ ట్యాంకర్ల కార్మికుల ధర్నా



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సెప్టిక్ ట్యాంకర్ల కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. వరదల కారణంగా గత మూడు నెలలుగా దానవాయిగూడెం వద్ద ఉన్న మలమూత్ర విసర్జనను శుద్ధి చేసే యంత్రం రిపేర్‌లో ఉంది. ఎన్నిసార్లు రిపేర్ చేయించాలని అడిగినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో సెప్టిక్ ట్యాంకర్లతో కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ప్రజల ఇండ్లలో సెప్టిక్ ట్యాంక్‌లు నిండిన మలమూత్ర వ్యర్థాలను ఎక్కడ డంపు చేయాలో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే శుద్ధి యంత్రాన్ని రిపేర్ చేయించి పునరుద్ధరించాలని ట్యాంకర్ల డ్రైవర్లు డిమాండ్ చేశారు.

నల్లగొండ పట్టణంలో అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్ర

- జులాయిగా తిరుగుతున్న 84 మందికి కౌన్సెలింగ్
- 48 బైకులు, 5 కార్లు, 3 ఆటోలు, 80 సెల్‌ఫోన్లు స్వాధీనం
- 24 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
- నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి వెల్లడి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ పట్టణాన్ని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి పట్టణంలో డీఎస్పీ కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో ఆపరేషన్ చబుత్ర చేపట్టారు. వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు సీఐలు 12 మంది ఎస్ఐలు, 80 మంది కానిస్టేబుల్స్.. మొత్తం 10 చెకింగ్ బృందాలుగా, 10 పెట్రోలింగ్ పార్టీలుగా పట్టణాన్ని జల్లెపట్టారు. రోడ్లపై అర్ధరాత్రి ఆవారాగా తిరుగుతూ అనుమానాస్పదంగా ఉన్న 84 మందిని అదుపులోకి తీసుకొని డీఎస్పీ కౌన్సెలింగ్ చేశారు. వారి వద్ద నుంచి 48 బైకులు, 5 కార్లు, 3 ఆటోలు, 80 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 24 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఇక నుంచి అర్ధరాత్రి అరుగుల (చబుత్ర) మీద బాతకానీలు కొడుతూ, రోడ్ల మీద ఇష్టానుసారం బైకులపై తిరుగుతూ కాలనీ వాళ్లను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తాగి వాహనాలపై తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవ్వడం, గొడవలు సృష్టించడం, అనుమానాస్పదంగా రోడ్లపై తిరుగుతున్న వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతిరోజూ ఈ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలకు ముఖ్యంగా మైనర్లు, 30 సంవత్సరాల లోపు వాళ్లే అధికంగా కారణమవుతున్నారని, అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి.. మార్పు తీసుకొచ్చినట్లైతే చాలా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అన్నారు. నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దీనికి పట్టణవాసులు సహకరించాలని కోరారు. మంగళవారం.రాత్రి పట్టుబడిన వారందరినీ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని టిటిఐ సెంటర్‌లో వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్ రెడ్డి, డానియల్, రాజు, సైదులు, కొండల్ రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, సైదులు, సురేష్, సైదా బాబు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ

కొత్త ప్రాంతాల గుర్తింపు, అభివృద్ధికి చర్యలు

- కృష్ణ, గోదావరి పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- వినోద కేంద్రాలుగా పర్యాటక ప్రాంతాలు
- త్వరలో తెలంగాణ టూరిజం పాలసీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ పర్యాటక గమ్యం స్థానంగా తెలంగాణ దూసుకుపోతున్నది. గత పదేండ్ల పాలనలో రాష్ట్రంలో పడకేసిన టూరిజాన్ని కొత్త సర్కార్ పరుగులు పెట్టిస్తున్నది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, సహజ వనరులు పుష్కలంగా ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక, పురావస్తు ప్రాంతాలను గుర్తించి వాటిని టూరిస్టు హబ్‌లుగా మార్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. తెలంగాణను గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు నూతన పర్యాటక విధానాన్ని అందుబాటులోకి తేనున్నట్టు సర్కార్ చెబుతోంది. .

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. వనరులు, చారిత్రక వారసత్వ సంపద అంతగా లేని ప్రపంచంలోని అనేక దేశాలు టూరిజంపై వచ్చే ఆదాయంతోనే మనుగడ సాధిస్తున్నాయి. అన్నీ ఉన్న తెలంగాణ ఈ రంగాన్ని ఆదాయ మార్గంగా మార్చుకోలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించడంతో పాటు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. అడ్వెంచర్, రీక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ డెస్టినేషన్ వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నది.

పర్యాటకులకు స్వర్గధామంగా కొనియాడుతున్న లక్నవర జలాశయంలో ఇప్పటికే రెండు ద్వీపాలు అందుబాటులో ఉండగా, తాజాగా మరో ద్వీపాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచ స్థాయికి తగ్గకుండా అనేక హంగులతో రూ. 7 కోట్ల వ్యయంతో 3 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేశారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న పర్యాటక కార్యక్రమాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించి ప్రాజెక్‌లకు ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతులు జారీ చేసింది. మంథని, రామగిరి కోట, కోదాడ, మధిర, జమలాపురం, సింగూర్, కొల్లాపూర్, శ్రీరంగాపూర్, కొడంగల్, నెలకోండపల్లి, పాలేరు, నాగార్జునసాగర్, సూర్యాపేట్, భూపాలపల్లి, నల్గొండ, అనంతగిరి, మహబూబ్‌నగర్, జోడేఘాట్ ప్రాంతాల అభివృద్ధికి రూ. 99.46 కోట్ల పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. రాష్ట్ర నలుమూలల ఉన్న పర్యాటక ప్రాంతాలను వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. శ్రీశైలం, సోమశిల, నాగర్జున సాగర్ వరకు 160 కిలోమీటర్ల మేర నల్లమల అడవుల గుండా ప్రవహిస్తున్న కృష్ణా నదీ తీరం, దట్టమైన అడువులు, వన్యప్రాణులు, జలపాతాలను డెస్టినేషన్ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది. నల్లమల అటవీ ప్రాంతం, కొండకోనల మధ్య కృష్ణా నదిలో విహారానికి లాంచీ జర్నీని నవంబర్ 2న పర్యాటక శాఖ ప్రారంభించింది. సోమశిల నుంచి శ్రీశైలానికీ, నాగర్జున సాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ సేవలను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే కేంద్ర పర్యాటక శాఖ ఆర్థిక సహాయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర పర్యాటక శాఖ పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రూ. 56.81 కోట్లతో భువనగిరి కోట, రూ. 38 కోట్లతో అనంతగిరి హిల్స్, రూ. 25 కోట్లతో బుద్ధవనం, నాగార్జునసాగర్, రూ.10 కోట్లతో నిజాంసాగర్‌లో పనులను చేపట్టనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ పథకంలో భాగంగా రూ. 250 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నిధులతో నాగర్జున సాగర్, రామప్ప, నల్లమల, కాళేశ్వరం, మధిరలోని పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దనున్నారు.

నూతన ఒరవడికి శ్రీకారం

టూరిజంలో ప్రమోషన్ లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అనేక వినూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను, చారిత్రక కట్టడాలను విద్యార్థులు ఉచితంగా సందర్శించేందుకు "తెలంగాణ దర్శిని" అనే కొత్త కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. కార్పొరేట్, ఐటీ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు హరితహెూటళ్లలో 10 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. పర్యాటకులతో పాటు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు, ఆయా పనుల నిమిత్తం తెలంగాణకు వచ్చే వారిని పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు ప్రత్యేక కార్యచరణను రూపొందించి, చేయాలని యోచిస్తోంది.

టూరిస్ట్ కారిడార్‌గా హైదరాబాద్

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు కలుపుతూ టూరిస్టు కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. దేశ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నగరంలోని చార్మినార్, గోల్కొండ, సాలార్‌జంగ్ మ్యూజియం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్థూపంతో పాటు అనేక అధ్యాతిక, చారిత్రక ప్రాంతాలను కలుపుతూ టూరిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే మూసీని లండన్‌లోని థేమ్స్ నదీ తీరం తరహాలో అభివృద్ధి చేసేందుకు పలు కంపెనీలతో ఇప్పటికే ఒప్పందం కుదిరింది. భవిష్యత్‌లో నగరంలో మరిన్న టూరిస్ట్ ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ కసరత్తు చేస్తున్నది.